శిథిలం
రూ॥90/-
పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

దావోస్ సమావేశాలకు
భారత్ నుండి అతిపెద్ద బృందం
రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, ఫడ్నవీస్ సహా ఐదుగురు కేంద్రమంత్రులు

అమెరికాలో స్తంభించిన టిక్ టాక్

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 52 | సోమవారం | 20-01-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## రాష్ట్రంలో 'క్యాపిటల్ ల్యాండ్'..
# రూ.450 కోట్లు పెట్టుబడులు

### అత్యాధునిక భారీ ఐటి పార్క్
హైదరాబాద్‌లో 10లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఒప్పందం



### సింగపూర్‌లో సిఎం బిజీబిజీ
**ముగిసిన పర్యటన**
**దావోస్‌కు వెళ్లిన బృందం**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. సింగపూర్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు సిఎం ప్రతినిధి బృందం బిజీ బిజీగా గడిపింది. వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చల్లో పాల్గొన్నది. ఆశించిన పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటిఇ)తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవడం కీలక పరిణామం. హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఎఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్‌టి టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. రూ.3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో భారీ ఐటి పార్కు ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.450 కోట్లతో తరువాయి 2లో

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రూ.450 కోట్ల పెట్టుబడులకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక భారీ ఐటి పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. సింగపూర్ కేంద్రంగా విస్తరించిన ఈ కంపెనీ ప్రపంచ స్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటిగా ఉంది. సింగపూర్‌లో పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో ముందడుగు వేసింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సింగపూర్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్ ల్యాండ్ ఈ నిర్ణయం ప్రకటించింది. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, సిఎంఓ స్పెషల్ సెక్రెటరీ అజిత్‌రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ తరపున ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ సిఈఓ గౌరీశంకర్ నాగభూషణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాపిటల్ ల్యాండ్ నిర్ణయాన్నిస్వాగతిస్తూ క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కాపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలను ఈ ఐటి పార్క్‌లో అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా గౌరీశంకర్ నాగభూషణం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో తరువాయి 2లో

### ఖోఖో ప్రపంచకప్...
# విజేత భారత్



న్యూఢిల్లీ : ఖోఖో పురుషుల, మహిళల ప్రపంచకప్‌లో విజేతగా భారత్ నిలిచింది. తొలి ఎడిషన్‌లో భారత అమ్మాయిల జట్టు చరిత్ర సృష్టించింది. తద్వారా తొలి ఖోఖో ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించింది. 23 దేశాలు పాల్గొన్న ఈ మెగా టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు అజేయంగా టోర్నీని ముగించింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన ఈ ఖోఖో వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత మహిళల జట్టు 78–40 తేడాతో నేపాల్‌ను ఓడించింది. ఈ తుది పోరు టర్న్ 1లో భారత్ దూకుడు ప్రదర్శనను తరువాయి 2లో

# తప్పు నాదికాదు..ఆయనదే!

### ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కెటిఆర్, అరవింద్‌కుమార్ విరుద్ధ వాంగ్మూలాలు
### వీరి తీరుపై ఇడి, ఎసిబి అధికారుల విస్మయం







ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో నిందితులు తమ తప్పులను ఒకరిపై ఒకరు తోసేసుకుంటున్నారు. తప్పు నాదికాదు, ఆయనదే అంటూ విచారణ అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకుంటున్న తీరు ఈడి, ఎసిబి అధికారుల్లో చర్చానీయాంశంగా మారింది. నిధులు విదేశీ కంపెనీకి బదిలీ చేయడంలో తన పాత్ర లేదని కెటిఆర్ అంటుండగా.. కెటిఆర్ చెబితేనే తాను లండన్‌లోని ఫార్ములా ఈ ఆపరేషన్ (ఎఫ్ఇఒ) సంస్థకు బదిలీ చేశానని ఆరవింద్ రావులు విచారణ సందర్భంగా ఎసిబి, ఈడి అధికారులకు వాంగ్మూలాలు ఇచ్చారు. వీరిద్దరి వాంగ్మూలాలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు వీరిద్దరు నాటకాలు ఆడుతున్నారని ఇట్టే అర్థం అవుతుంది. నిధులు బదిలీ చేయమని కెటిఆర్ ఆదేశించిన వాట్సాప్ చాటింగ్‌ను అరవింద్‌కుమార్ ముందు జాగ్రత్త చర్యగా తన వద్ద భద్రపర్చుకోవడం ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం. ఈ కాపీలను ఎసిబి, ఈడి అధికారులకు అరవింద్‌కుమార్ అందించడంతో కెటిఆర్ గొంతులో వెలక్కాయపడినట్లయ్యింది. 10వ కార్ రేస్ కోసం హెచ్‌ఎండిఎ నుంచి రూ.56 కోట్ల నిధులు అక్రమంగా దారి మళ్లించారని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఫిర్యాదు చేయడంతో ఎసిబి, ఈడి అధికారులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిలతో పాటు గ్రీన్‌కో కంపెనీ ఎండి అనీల్ కుమార్‌లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నిందితులందర్నీ ఎసిబి, ఈడి అధికారులు సుదీర్ఘంగా విచారించింది. విచారణలో నిధుల బదిలీపై అరవింద్‌కుమార్ వాంగ్మూలం ఇచ్చారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ ఆదేశాల మేరకే తాను హెచ్‌ఎండిఎ నుంచి నిధులు విడుదల చేయాలని హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డికి ఆదేశాలు ఇచ్చానని, ఆ తరువాతనే హెచ్‌ఎండిఎ బ్యాంక్ ఖాతా నుంచి లండన్‌లోని ఫార్ములా ఈఆపరేషన్ తరువాయి 2లో



'ఇందిరమ్మ ఇండ్లు' కోసమే
## హౌసింగ్‌బోర్డు పునరుద్ధరణ
### రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ బోర్డ్‌ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఆ విభాగాన్ని మూసివేసి, అందులో పనిచేసే ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే 'ఇందిరమ్మ ప్రభుత్వ' లక్ష్యమని, అందుకే గృహ నిర్మాణ సంస్థను పునరుద్ధరించామని వివరించారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో 'తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ, క్యాలండర్2025'ను మంత్రి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థను పునరుద్ధరించి, లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందని వివరించారు. 326 మంది తరువాయి 2లో

## సంక్షేమం, హక్కుల కోసం
# సిపిఐ పోరాటం




పేదలకు లక్షలాది ఎకరాల భూ పంపిణీ చేసిన ఘనత పార్టీదే
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
సిద్దిపేటలో భారీ ర్యాలీ



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

పేద ప్రజల సంక్షేమం.. హక్కుల పరిరక్షణ కోసం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ప్రపంచ దేశాల్లో ఉందని, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందన్నారు. కమ్యూనిస్టుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పేద ప్రజలకు కూడు, గూడు, భూమి కోసం అనేక పోరాటాలు చేసి పేదప్రజల పక్షాన నిలిచిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. కమ్యూనిస్టులు ప్రజల్లో ఉండి ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శివానుభావ మండపంలో నిర్వహించిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు విక్టరీ చౌరస్తా నుండి సిద్దిపేట పట్టణ ప్రధాన వీధుల గుండా సిపిఐ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు తరువాయి 12లో



121 మంది రైతులు
## ఆమరణదీక్ష విరమణ
### వైద్య సహాయానికి అంగీకరించిన డల్లేవాల్

**చండీగఢ్ :** రైతు నేత జగ్జిత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావంగా పంజాబ్ ఖన్నౌరిలోని ఆందోళన ప్రదేశంలో ఆమరణ దీక్షకు దిగిన 121 మంది రైతుల బృందం ఆదివారం దీక్ష విరమించింది. నవంబరు 26వ తేదీ నుంచి డల్లేవాల్ (70) ఆమరణదీక్ష చేపడుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన అన్ని రకాల సహాయ సహకారాలను నిరాకరిస్తున్నారు. అయితే రైతుల డిమాండ్లపై ఫిబ్రవరి 14వ తేదీన చర్చలు జరుపుతామని శనివారం కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించడంతో డల్లేవాల్ వైద్యపరమైన సహాయానికి అంగీకరించారు. రైతుల డిమాండ్ల అమలుకు ప్రభుత్వం అంగీకరించకపోవడం, రోజు రోజుకు డల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో ఆగ్రహించిన అన్నదాతలు హర్యానా వైపు ఉన్న ఖన్నౌరి సమీపంలోని సరిహద్దు ఈనెల 15వ తేదీన 111 మంది రైతులతో కూడిన బృందం డల్లేవాల్ ఆమరణదీక్షలో చేరింది. ఆ తరువాత మరో 10 మంది రైతులు కూడా ఈనెల 17వ తేదీన చేరారు. కాగా, డిఐజి తరువాయి 2లో

### కర్ణాటకలో వరుస దోపిడీలు
## రాష్ట్రం అప్రమత్తం







ప్రజాపక్షం/హైదరాబాద్

కర్ణాటక రాష్ట్రంలో వరుస దోపిడీలు చోటుచేసుకోవడంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు బ్యాంక్ అధికారులను అప్రమత్తత చేయాల్సిన అవసరం ఉందని.. అన్ని జిల్లాల ఎస్‌పిలు, పోలీసు కమిషనరేట్ల పోలీసులకు డిజిపి డాక్టర్ జితేందర్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రాయపర్తి, బీదర్, మంగళూరులో ఇటీవల జరిగిన బ్యాంక్ దోపిడీ సంఘటనల నేపథ్యంలో దుండగులు ఏకంగా కాల్పులకు కూడా పాల్పడి సెక్యూరిటీగార్డ్స్‌ను చంపారు. అక్కడి నుంచి పారిపోయిన దుండగులు హైదరాబాద్‌కు పారిపోయి వచ్చి ఇక్కడ కూడా తరువాయి 12లో

## ఆర్థిక సమానత్వ పోరాటం
### వైట్ టీ–షర్టు ఉద్యమం ప్రారంభించిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ
### దేశంలో పేదలు, కార్మికవర్గాన్ని మోదీ పట్టించుకోలేదని విమర్శ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆర్థిక సమానత్వ పోరాటం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా వైట్ టీ–షర్టులు ధరించి ఈ ఉద్యమంలో పాల్గొనాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పేద ప్రజలకు, కార్మికవర్గానికి రిక్తహస్తాలు చూపించిందని, వారిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. బహుజనుల హక్కులను సమర్థించే నాయకుడుగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను ఈ వైట్ టీ–షర్టు ధరించే ఉద్యమం ప్రారంభిస్తున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. ''ఆర్థికన్యాయం పట్ల మీకు విశ్వాసం ఉంటే, దేశ ఆర్థిక సంపద పంపిణీలో రోజు రోజుకూ పెరిగిపోతున్న అసమానతలను వ్యతిరేకించండి, సామాజిక సమానత్వం కోసం పోరాటం చేయండి, దేశంలో అన్ని రూపాలలోనూ కొనసాగుతున్న వివక్షను తిరస్కరించండి, మనదేశ శాంతి, తరువాయి 2లో

### ఒప్పందం అమలులో
## మూడు గంటలు ఆలస్యం
### గాజాకు 220 ట్రక్కుల్లో ఆహారం సరఫరా



**గాజా :** గాజాలో యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మూడు గంటలు ఆలస్యంగా అమలు చేసింది. అప్పటివరకూ దక్షిణ గాజా ప్రాంతంలో దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒప్పందం ప్రకారం మొదటి విడత బందీలను ఎంతమందిని విడుదల చేస్తున్నారు? ఎవరిని విడుదల చేస్తున్నారు? అనే వివరాల జాబితాను ఇవ్వడంలో హమాస్ జాప్యం చేసినందువల్లనే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. ఎట్టకేలకు హమాస్ ఆ జాబితాను ఇజ్రాయెల్‌కు ఇచ్చిన తర్వాత భారత కాలమానం ప్రకారం ఆదివారం 11.30 గంటలకు ఒప్పందం అమలులోకి వచ్చింది. ఆదివారంనాడు ముగ్గురు మహిళా బందీలను విడుదల చేస్తామని హమాస్ సంస్థ లిఖితపూర్వకంగా ఇజ్రాయెల్‌కు తెలియజేసింది. ఈ ప్రకారం, రోమీ గోనెన్, ఎమిలీ, దమరీ, దోరోన్ స్టెయిన్‌బ్రేచర్ అనే ముగ్గురు మహిళా బందీలను ఆదివారం నాడు విడుదల చేస్తుంది. కాగా ఒప్పందం నేపథ్యంలో గాజాలోకి 200 లారీలలో ఆహార పదార్థాలు, మరో 20 లారీలలో ఇంథనం రావడం ప్రారంభమైంది. ఇజ్రాయెల్ అధీనంలో ఉన్న షలోమ్ ప్రాంతానికి ఈ వాహనాలన్నీ చేరుకుని గాజాలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం తరువాయి 2లో

# ''ట్రంపిజం''కు వ్యతిరేకంగా .. అమెరికాలో వేలాదిమంది మహిళల ప్రదర్శనలు

ప్రపంచం



## ఎలాన్ మస్క్ వ్యతిరేక నినాదాలు

**వాషింగ్టన్ :** ప్రమాణ స్వీకారోత్సవానికి ఒకవైపు డోనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతుంటే అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, సీటెల్, చికాగో సహా అన్నిచోట్లా వేలాదిమంది మహిళలు ఆయనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. దీనిని 'పీపుల్స్ మార్చ్''గా మహిళలు అభివర్ణించారు. ట్రంప్, ఎలాన్ మస్క్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా సమానత్వం, వాతావరణమార్పులు, వలస ప్రజలను వెనక్కు తిప్పి పంపడం, మహిళా హక్కుల పరిరక్షణ వంటి పలు అంశాలలో ట్రంప్ ప్రకటించిన విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నిరసన ప్రదర్శనలు జరిపారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. లాభాపేక్ష ఆశించని స్వచ్ఛంధ సంస్థలు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. వీరంతా పుసీ క్యాట్ టోపీలు ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ 'పీపుల్స్ మార్చ్'' లేదా ''ఉమెన్ మార్చ్'రాబోయేకాలంలో ట్రంప్ అనుసరించే విధానాలకు చెంపపెట్టుగా మారే అవకాశం ఉంది. అబార్షన్లకు సంబంధించి ట్రంప్ అనుసరిస్తున్న విధానాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఒక మహిళ బ్రూక్ చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ విధంగా భారీ మెజారిటీతో ట్రంప్‌ను గెలిపించడంపట్ల అమెరికాలో మహిళలు ఎంతమాత్రం సంతోషంగా లేరని ఆమె అన్నారు. రాబోయే కాలంలో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రతిసారీ వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తారన్న ఆశాభావం ఆమె వ్యక్తం చేశారు.

మహిళా సమానత్వం, వలసలకు మద్దతుగా తాము ఈ ప్రదర్శన చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ వారం అంతా నిరసన ప్రదర్శనలు చేసేందుకు వీరు ప్రణాళిక చేశారని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. ''ట్రంపిజం''కు వ్యతిరేకంగా ఈ నిరసన ప్రదర్శనలు చేస్తున్నట్లు పీపుల్స్ మార్చ్ ప్రతినిధులు తమ వెబ్‌సైటు ద్వారా తెలియజేశారు. ఇంతకుముందు కూడా మహిళలు దేశవ్యాప్తంగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవంనాడు ''ఉమెన్ మార్చ్'' పేరుతో ప్రదర్శనలు జరిపారు. ఈసారి వీరు ప్రమాణ స్వీకారోత్సవానికి ఒకరోజుముందుగా భారత కాలమానం ప్రకారం ఆదివారం నాడు ''పీపుల్స్ మార్చ్'' పేరుతో నిరసన ప్రదర్శనలు జరిపారు. మహిళలు ప్రతి సంవత్సరం 2017 నుండి ఈ విధంగా తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. న్యూయార్క్ సిటీలో కూడా ఇదేవిధంగా మహిళలు ''పీపుల్స్ మార్చ్'' బ్యానర్‌పై నిరసన ప్రదర్శన జరిపారు.




ఇదిలా ఉండగా దేశాధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు డోనాల్డ్ ట్రంప్ ఆదివారంనాడు వాషింగ్టన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రదర్శకులు వాషింగ్టన్ డిసిలో ఉన్న మూడు పార్కులలో ఒక్కచోట చేరి లింకన్ మెమోరియల్ వరకూ ప్రదర్శనలు జరిపారు. దేశానికి ఒక మహిళా అధ్యక్షురాలిని ఎంపిక చేసుకోవడంలో తాము విఫలమయ్యామని ఆమె అన్నారు. ట్రంప్ తొలివిడత పరిపాలనలో మహిళల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. 2016లో హిల్లరీ క్లింటన్ అధ్యక్ష పదవి ఎన్నికల్లో ఓడిపోయినప్పటినుండీ అమెరికాలో మహిళల ప్రదర్శనలు జరుగుతున్నాయి. మరోవైపు ట్రంప్‌కు అనుకూలంగా కొంతమంది కూడా ప్రదర్శన జరిపారు.

**ప్రమాణ స్వీకారం రోజే వలసలపై ఉత్తర్వులు**

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న నిరసనల మధ్య డోనాల్డ్ ట్రంప్ శనివారంనాడు వాషింగ్టన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు సంబరాలు జరుగుతాయి. క్యాపిటల్ భవనంలో సోమవారంనాడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన సన్నద్ధం అవుతున్నారు. మైనస్ 11 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయి గడ్డకట్టే చలివాతావరణంవల్ల ప్రమాణస్వీకారాన్ని భవంతి లోపలే ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ట్రంప్ అనేక రకాల అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తూ పలు ఫైళ్ళపై సంతకాలు చేస్తారు.

అక్రమంగా అమెరికాలోకి వలసలు వచ్చినవారిని తిరిగి స్వదేశాలకు పంపించే ఒక కీలకమైన ఫైలుపై ఆయన జనవరి 20వ తేదీ నాడే సంతకం చేసేందుకు సిద్ధం అవుతున్నారు. అదేవిధంగా చైనాలో పర్యటన చేసేందుకు కూడా ట్రంప్ ఎంతో ఆసక్తితో ఉన్నారు. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి చైనా దేశ ఉపాధ్యక్షుడు హాజరు కానున్నారు. గడచిన శుక్రవారం 17న డోనాల్డ్ ట్రంప్ టెలిఫోన్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సంభాషించారు. టిక్ టాక్ సమస్య గురించి కూడా వారు చర్చించారు.



## దక్షిణ కొరియా కోర్టులో హింస
### యోల్‌కు మరో 20 రోజులు కస్టడీ

**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టును 20 రోజులు పొడిగిస్తూ ఆ దేశ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యూన్ సుక్ యోల్ మద్దతుదారులు దేశంలో అల్లర్లు ప్రారంభించారు. వెస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్టులోకి దూసుకువచ్చారు. కోర్టు బయట 44,000 మంది మద్దతుదారులు నినాదాలు చేస్తూ గుమిగూడారు. కోర్టులోకి దూసుకొచ్చిన యోల్ మద్దతుదారులు హింసకు పాల్పడ్డారు. కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. పోలీసులతో ఘర్షణ పడ్డారు. కొందరు పోలీసులు కూడా గాయపడ్డారు. ఈ ఘటనల్లో 97 మంది యోల్ మద్దతుదారులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో కోర్టులో ఉన్న మాజీ అధ్యక్షుడు యోల్ కూడా దిగ్భ్రాంతి చెందారు. అందరూ శాంతంగా ఉండాలని, సహనం పాటించాలని తన అనుచరులకు ఆయన విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు అధికారులు ఎట్టకేలకు యూన్‌ను అరెస్టు చేసిన తర్వాత రెండురోజులపాటు విచారణ జరిపారు. ఆదివారంనాడు కూడా ఆయనపై ప్రశ్నలవర్షం కురిపించారు. తర్వాత కోర్టు అధికారుల విజ్ఞప్తి మేరకు ఆయన అరెస్టు గడువును పొడిగించడంతో యూన్ సుక్ యోల్ అనుచరులు తీవ్ర ఆగ్రహం చెందారు. గడచిన బుధవారంనాడు యోల్‌ను దర్యాప్తు అధికారులు అరెస్టు చేశారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ఆయన నిరాకరించడంతో అధికారులు తిరిగి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఈసారి 20 రోజులపాటు ఆయనను కస్టడీలో కొనసాగించాలని ఆదేశించింది. ఒక దేశాధ్యక్షుడు అరెస్టు కావడం దక్షిణ కొరియా చరిత్రలో ఇదే మొదటిసారి.



## నైజీరియాలో ట్యాంకర్ పేలి 70 మంది మృతి

**అబూజా :** సెంట్రల్ నైజీరియాలో ఒక ఇంధన ట్యాంకర్ పేలిపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న 70 మంది దుర్మరణం చెందారు. గ్యాసోలైన్‌ను మోసుకువెళుతున్న ఇంధన ట్యాంకర్ తిరగబడిపోయింది. దీంతో ఆ గ్యాసోలైన్‌ను తీసుకువెళ్ళేందుకు అనేకమంది ఆ ట్యాంకర్ దగ్గరకు వచ్చారు. నైజీరియాలో గ్యాసోలైన్ ఇంధనం ధరలు ఆకాశాన్ని అంటాయి. గ్యాసోలైన్‌ను తీసుకువెళ్ళేందుకు గుమిగూడిన జనం ట్యాంకర్ జ్వాలల్లో, అనంతరం జరిగిన పేలుడులో మరణించారు. ఇలాంటి ఘటనలు నైజీరియాలో జరగడం సర్వసాధరణమేనని అధికారులు చాలా తేలిగ్గా కొట్టిపారేశారు. నైజీరియాలో అన్ని రకాల ధరలూ ఆకాశాన్ని అంటాయి. ముఖ్యంగా ఇంధనం ధరలు ప్రజలకు అందుబాటులో లేవు. 60,000 లీటర్ల గ్యాసోలైన్‌ను మోసుకువెళుతున్న భారీ ట్రక్కు ఉదయం పది గంటల సమయంలో తిరగబడిందని ఫెడరల్ రోడ్ సేఫ్టీ ఉన్నతాధికారి కుమార్ సుక్వామ్ చెప్పారు. ఈ మంటల్లో సజీవదహనమైనవారు ఎవరో కూడా గుర్తించడం సాధ్యంకాలేదని ఆయన చెప్పారు.

## మూడు గంటలు ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి)

రోజుకు 600 లారీలలో ఆహార వస్తువులు గాజాలోకి వస్తాయి. 2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌లో జరుగుతున్న ఒక మ్యూజిక్ ఫెస్టివల్‌పై హమాస్ ఉగ్రవాదులు సామూహిక దాడి చేశారు. 1,200 మందిని కాల్చి చంపారు. మరో 250 మందిని బందీలుగా తీసుకువెళ్ళారు. ఇక ఆ తర్వాత గాజాలో బందీలకోసం అన్వేషణ పేరుతో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు 46,899 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. మరో 1,10,725 మంది గాయపడ్డారు. 20 లక్షలమంది ప్రజలు ఇళ్ళువదలి పారిపోయి వేరేచోట తలదాచుకున్నారు. కానీ లాన్సెట్ పరిశోధన నివేదిక ప్రకారం గాజాలో 64,210 మంది మరణించారు. 65 శాతం నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. 70 శాతం రోడ్లు నాశనమయ్యాయి. ఈ కారణంగా గాజాలో మొత్తం 42 మిలియన్ టన్నుల చెత్తచెదారం, ధూళి పేరుకుపోయింది. ఇదిలా ఉండగా ఒప్పందం అమలు ప్రారంభం కావడానికి చివరి నిమిషాల్లో ఇజ్రాయెల్ సైనికుడి మృతదేహం ఒకటి బయటపడింది. 2014లో హమాస్ ఉగ్రవాదులు ఈ ఇజ్రాయెల్ సైనికుణ్ణి అపహరించి తీసుకువెళ్ళారు. ఈ మృతదేహం 11 ఏళ్ళక్రితం అపహరణకు గురైన ఇజ్రాయెల్ సైనికుడి మృతదేహంగా ఐడిఎఫ్ గుర్తించింది. అదేవిధంగా హమాస్ వద్ద ఇంకా 97 మంది ఇజ్రాయెలీ బందీలు ఉన్నారని నేతన్యాహూ ప్రభుత్వం బలంగా వాదిస్తున్నది. ఒకవైపు ఒప్పందం అమలు గడువు దాటిపోయిన తర్వాత కూడా ఆగ్రహంతో ఊగిపోయిన ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ గాజా ప్రాంతంలో, సెంట్రల్ గాజాలో ఖాన్‌యూనిస్ నగరంలో గగనతల దాడులు కొనసాగించింది. ఈ దాడులలో 10 మంది పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే తాము దాడులు కొనసాగిస్తామని మరోవైపు హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌కు హెచ్చరిక చేశారు. ఇదిలా ఉండగా గాజాలో యుద్ధ విరమణ ఒప్పందంపట్ల ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా ఖొమైనీ హర్షం ప్రకటించారు. కాగా లెబనాన్ అధ్యక్షుడు ఒక ప్రకటన చేస్తూ జనవరి 26వ తేదీ నాటికి ఇజ్రాయెల్ దక్షిణ గాజా నుండి తన సైన్యాన్ని తొలగించాలని కోరారు.

## హౌసింగ్‌బోర్డు పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా గృహ నిర్మాణ సంస్థను బలోపేతం చేశామన్నారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశలవారీగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గ్యారంటీ పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు రూ.5లక్షల స్కీమ్‌తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, ఇందుకు గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని, మరింత కష్టపడి పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి, సీనియర్ నాయకులు కంది రవీందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, కుమార్, రమేష్, రఘు, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.450 కోట్లు పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటిపిహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పర్ల్ పార్క్‌లను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటి లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలోనే అందుబాటులోకి వస్తుంది. ఐటిపిహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## ఆదిలాబాద్‌లో రోడ్డు ప్రమాదం
### 47 మంది భక్తులకు గాయాలు



**నార్నూర్ :** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. మాలేపూర్ ఘాట్‌లో యాత్రికులతో వెళ్తున్న వాహనం బోల్తాపడడంతో 47 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గుడిహత్నూర్ మండలం సూర్యగూడ గ్రామానికి చెందిన 60 మంది ఆదివాసీలు జంగుబాయి ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## డిసిఎం బ్రేక్‌లు ఫెయిల్
### అదుపుతప్పి బోల్తా : 35 మందికి గాయాలు

**ఘట్కేసర్:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ జాతీయ రహదారిపై డిసిఎం బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో 35 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఉప్పునూతల గ్రామానికి చెందిన 35 మంది యాదగిరి గుట్టకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## విజేత భారత్

(మొదటి పేజీ తరువాయి)

కనబరిచింది. దీంతో 34–0తో తిరుగు లేని ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత రెండో టర్న్‌లో నేపాల్ పుంజుకోవడం వల్ల 35–24తో ముగిసింది. ఇక మూడో టర్న్‌లో భారత్ మళ్లీ దూకుడు ప్రదర్శించడం వల్ల, వరుసగా పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి (49) దూసుకెళ్లింది. చివరి టర్న్‌లో నేపాల్ 16 పాయింట్లు సాధించడం వల్ల, భారత్ 38 పాయింట్లతో అద్భుత విజయాన్ని అందుకుని ఛాంపియన్‌గా అవతరిం చింది. మరోవైపు పురుషుల ప్రపంచ కప్‌లోనూ భారత్ విజయం సాధించింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఫైనల్ పోరులో ప్రత్యర్థి నేపాల్‌పై విజయఢంకా మోగించింది. 54–36 తేడాతో నేపాల్ జట్టును చిత్తు చేసి ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది.

## ఆమరణదీక్ష విరమణ

(మొదటి పేజీ తరువాయి)

మన్‌దీప్ సింగ్ సిద్ధు, పాటియాలా సీనియర్ ఎస్‌పి నానాక్ సింగ్ ఆధ్వర్యంలో మొత్తం 121 మంది రైతులు జూస్ సేవించి దీక్షను విరమించారు. ఇదిలా ఉండగా, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రియ రంజన్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కేంద్ర బృందం శనివారం రాత్రి రైతు నేత డల్లేవాల్, ఎస్‌కెఎం (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులతో భేటీ అయింది. ఫిబ్రవరి 14వ తేదీన చండీగఢ్‌లో చర్చలను పునరుద్ధరిస్తామని, చర్చల్లో పాల్గొనేందుకు రావాలని రైతు నేతలను ఆహ్వానించారు. ప్రతిపాదిత సమావేశం ప్రకటన నేపథ్యంలో డల్లేవాల్ వైద్య సహాయానికి అంగీకరించారు. అనంతరం ఆయనను వైద్య చికిత్సల కోసం తరలించారు. అయితే పంటల కనీసమద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేంత వరకు నిరవధిక నిరాహారదీక్షను డల్లేవాల్ విరమించరని రైతు నేతలు స్పష్టం చేశారు.

**చర్చల ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం : ఎస్‌కెఎం**

రైతులతో చర్చలు జరపాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను సంయుక్త కిసాన్ మోర్చా గొప్ప విజయంగా అభివర్ణించింది. వైద్య సహాయం తీసుకోవాలన్న నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ డల్లేవాల్ నిర్ణయాన్ని స్వాగతించింది. ఈ మేరకు ఆదివారం ఎస్‌కెఎం ఒక ప్రకటనను విడుదల చేసింది. రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020–21లో జరిగిన రైతుల నిరసనలకు నాయకత్వం వహించిన బృందం, రైతుల ఐక్యత పెరుగుతున్నందున ప్రభుత్వం చర్చలు జరపవలసి వచ్చిందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నిరసన తెలపాలని పిలుపునిస్తూ, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని ఎస్‌కెఎం డిమాండ్ చేసింది. రద్దయిన వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావడానికి చేసే ప్రయత్నమే వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన చట్టం (ఎన్‌పిఎఫ్ఎఎం) అని పేర్కొంది. సోమవారం ఎంపి కార్యాలయాల వద్ద కిసాన్ ధర్నా నిర్వహించడానికి బదులుగా పార్లమెంటు సభ్యులకు ఇమెయిల్ ద్వారా మెమోరాండమ్‌లను పంపాలని రైతు సంఘం అన్ని విభాగాలకు పిలుపునిచ్చింది.

అదేవిధంగా 26న నిర్వహించతలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేసింది. 24న న్యూఢిల్లీలో ఎస్‌కెఎం జనరల్ బాడీ సమావేశం జరగనుంది. 'దేశంలోని రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం మానుకోవాలని ఎస్‌కెఎం మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది దేశంలోని రైతులు తమ డిమాండ్లలో ఐక్యంగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం వాటిని నెరవేర్చాల్సిన అవసరం ఉందని, అప్పటివరకు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని రూపాల్లో ప్రజాస్వామ్య ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించింది.

## సింగపూర్‌లో సిఎం బిజీబిజీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ పార్కును అభివృద్ధి చేయనుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. చివరి రోజున సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బిఎఫ్) ప్రతినిధులతో ముఖాముఖి సంభాషణలు, చర్చలు జరిపింది. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, సిఇఒ ప్రదీప్తో బిశ్వాస్, డిబిఎస్ కంట్రీ హెడ్ లిమ్ హిమ్ చౌన్, డిబిఎస్ గ్రూప్ హెడ్ అమిత్ శర్మ, బ్లాక్ స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండి, చైర్మన్ గౌతమ్ బెనర్జీ, బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ సీనియర్ ఎండి పెంగ్ వీ టాన్, మెయిన్ హార్డ్ గ్రూప్ సిఇఒ ఒమర్ షాజాద్‌తో చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో పెట్టుబడులు ఉన్నఅవకాశాలు, ప్రభుత్వ విధానాలను వారికి వివరించారు.

**దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం**

దావోస్‌లో సోమవారం జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి డి.శ్రీధర్‌బాబు, అధికారుల బృందం పాల్గొననుంది. ఇందు కోసం సిఎం బృందం ఆదివారం రాత్రి సింగపూర్ పర్యటనను ముగించుకుని దావోస్‌కు వెళ్ళింది. ప్రపంచ వేదికపై తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటి చెప్పి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్య స్థానంగా పరిచయం చేసే భారీ లక్ష్యంతో రాష్ట్ర ప్రతినిధి బృందం దావోస్‌కు పర్యటనకు వెళ్ళింది. సిఎం బృందం సింగపూర్ పర్యటన విజయవంతం కావటంతో దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది.

## ఆర్థిక సమానత్వ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

సుస్థిరతలకోసం పోరాటం చేయండి, మీకున్న తెలుపు రంగు టీ–షర్టును ఈ ఉద్యమంలో భాగంగా ధరించండి, ఈ ఉద్యమంలో భాగస్తులు కండి'' అని ఎక్స్ వేదికగా ఒక వీడియోను రాహుల్‌గాంధీ పోస్టు చేశారు. ''నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈనాడు పేద ప్రజలను, కార్మిక వర్గాన్ని నరేంద్రమోదీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదు, ఆయన వాగ్దానభంగం చేశారు, ఆయన ప్రభుతవం పేదలకు, కార్మిక వర్గానికి మద్దతు ఇవ్వకుండా వెనుదిరిగింది, వారిమానాన వారిని బ్రతకమని గాలికి వదిలేసింది, ఎంపిక చేసుకున్న కొద్ది మంది పెట్టుబడిదారుల అభివృద్ధికోసమే ప్రభుత్వం తన సర్వశక్తులనూ ధారపోస్తున్నది'' అని ఎక్స్ వీడియోలో రాహుల్‌గాంధీ విమర్శించారు. మోదీ అనుసరిస్తున్న ఈవిధమైన వైఖరి కారణంగా దేశంలో అసమానతలు స్థిరంగా పెరుగుతున్నాయి. దేశంకోసం తమ రక్తాన్ని ధారపోస్తూ, శ్వేదం చిందిస్తున్న కార్మికుల స్థితిగతులు దుర్భరంగా మారాయి, బలవంతంగా వారిని అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడేటట్టు చేస్తున్నది. ఈ విధమైన పరిస్థితుల్లో వారికి న్యాయం చేసి వారి హక్కులను రక్షించేందుకు బలంగా మన గొంతెత్తి ప్రశ్నించడం మనందరి బాధ్యత, ఈ ఆలోచనలతోనే మేం ''వైట్ టీ–షర్టులు ధరించే ఉద్యమాన్ని ప్రారంభించాం'' అని ఎక్స్ వీడియో సందేశంలో రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు.

**హక్కుల సాధనకు రాహుల్‌గాంధీ పంచ మార్గదర్శక సూత్రాలు**

''నా దేశ యువకులకు, కార్మికవర్గ సహోదరులకు నేను విజ్ఞప్తి చేస్తున్నా, భారీ సంఖ్యలో ఈ ఉద్యమంలో మీరు భాగస్వాములుకండి, ఈ ప్రచారంలో చేరండి, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మీరు అర్థంచేసుకోండి, – https://whitetshirt.in/home/hin లింకులోకి వెళ్ళి పూర్తి వివరాలు తీసుకోండి లేదా 9999812024 ఫోన్ నెంబరులో సంప్రదించండి'' అని పేర్కొన్నారు. తెలుపు రంగు టీ–షర్టు అంటే కేవలం శరీరంపై ధరించే ఒక గుడ్డముక్క కాదు, కాంగ్రెస్‌పార్టీ అనుసరిస్తున్న కరుణ–దయాళుత్వం, ఐక్యత, అహింస, సమానత్వం, అందరి ప్రగతి అనే పంచ మార్గదర్శక సూత్రాలకు ఒక ప్రతిబింబం. ఈ విలువలు 8,000 సంవత్సరాలకాలంనాటి భారతదేశ విలువల స్ఫూర్తిని ప్రతిధ్వనింపజేస్తాయి, వేల సంవత్సరాలకాలం నాటి ఈ విలువలు సామరస్యం, భిన్న వైవిధ్యాల మూలపీఠంమీదే ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి, ఈనాడు పెరుగుతున్న అసమానతలు ఒక సిద్ధాంతం లేకుండా ఆదాయాలు, కులం, మతం పేరుతో వేళ్ళూనుకుంటున్నాయి'' అని రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు.

''మా చిత్తశుద్ధి పూర్తిగా ధర్మ సిద్ధాంతం, కర్మ, నిస్వార్థంగా సమాజానికి సేవ చేయడమే, మా చిత్తశుద్ధికి మేం ఇచ్చే నిర్వచనం అదే, కర్మ చేయడం అంటే హక్కులను నిలబెట్టేందుకు, న్యాయంకోసం పోరాటం చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించుకోవడమే'' అని పేర్కొన్నారు. పైన పేర్కొన్న పంచ సూత్రాలు ప్రతి వ్యక్తికీ విలువను ఇచ్చే సమాజాన్ని సృష్టిస్తాయి, కొద్ది మంది కోరికలకోసం అందరి స్వేచ్ఛను బందీ కాకుండా చూస్తాయి, అందువల్ల మనందరం ఈ విధమైన హుందాతో కూడిన జీవితాన్ని సాధించేందుకు మార్పుకు ఏజంట్లుగా మసులుకుందాం, ఈ తెలుపురంగు టీ–షర్టు దీనికి ఒక సంకేతం, సముచితమైన, న్యాయబద్ధమైన సమైక్య భారతావనికి ఇది పిలుపు, ఈ తెలుపు రంగు టీ–షర్టు ధరించడం ద్వారా విభజనమధ్య వంతెనలు నిర్మించే సమానత్వంతో కూడిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తిని మనం గౌరవిద్దాం'' అని రాహుల్‌గాంధీ వైట్‌షర్ట్ డాట్ ఇన్ వెబ్‌సైటులో పేర్కొన్నారు.

## నాది కాదు... ఆయనదే!

(మొదటి పేజీ తరువాయి)

(ఎఫ్ఇఒ) సంస్థకు రూ.46 కోట్లు బదిలీ అయ్యాయన్నారు. ఇదే విషయంపై హెచ్‌ఎండిఎ బోర్డు నిధుల దుర్వినియోగంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జనవరి 6న ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు మెమో జారీ చేసింది. దీనికి వివరణ ఇస్తూ జనవరి 24న ఆయన సిఎస్‌కు వివరణ లెటర్ రాశారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్, ఎక్స్ నెకట్స్ జెన్ సహా ఎంఎయుడి ఒప్పందాలు, డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన వివరాలను వెల్లడించారు. అప్పటి మున్సిపల్ మినిస్టర్ కెటిఆర్ ఆదేశాల మేరకే హెచ్‌ఎండిఎ బోర్డు నిధులను ఫార్ములా ఈ ఆపరేషన్‌కు చెల్లించినట్లు వివరించారు. ఇదే విషయాన్ని ఎసిబి, ఈడి అధికారుల విచారణలో అరవింద్‌కుమార్ వాంగ్మూలం ఇచ్చారు. కాగా ఎసిబి, ఈడి విచారణలో కెటిఆర్ మాత్రం అరవింద్‌కుమార్ వాంగ్మూలానికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చాడు. తాను నిధులు బదిలీ చేయమని ఎవరిని ఆదేశించలేదని, నిధుల బదిలీ విషయం మొత్తం అధికారులే చూశారని, నిబంధనలు కూడా వారికే తెలుసని, తనకేమి తెలియదని కెటిఆర్ వాంగ్మూలం ఇచ్చాడు. కేసు నుంచి తప్పించుకునేందుకు కెటిఆర్ ఈ విధంగా తప్పుడు వాంగ్మూలం ఇచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

# గ్రామ సభల్లోనే లబ్ధిదారుల ఎంపిక

పర్యాటక ప్రాంతంగా ఎర్రుపాలెం : ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లోనే జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి గ్రామసభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని రేషన్‌కార్డులు, ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఒక నిరంతర ప్రక్రియ అని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా రు. నర్సింహాపురం, బుచ్చిరెడ్డిపాలెం, బనిగండ్లపాడు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి బనిగండ్లపాడు రూ. 1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బనిగండ్లపాడు, ఎర్రుపాలెం మండలానికి కూడలిగా ఉందని బనిగండ్లపాడును కలిపే అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. బనిగండ్లపాడు అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. జూనియర్ కళాశాల భవనానికి నిధులు మంజూరు చేయనున్నామని ఆయన తెలిపారు. ప్రజల అవసరాల దృష్ట్యా ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రుపాలెం మండలం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్తిలా మలచుకోవాలన్నారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం (జమలాపురం) వద్ద ఏకో పార్కు , పేటచెరువు, ఇనిద్రమ్మ చెరువులను పర్యాటక ప్రాజెక్టులుగా రూపొందించనున్నామని విక్రమార్క తెలిపారు. ఈనెల 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎటువంటి షరతులు లేకుండా ఎకరాకు రూ. 12వేల చొప్పున రైతు భరోసా సాయం అందిస్తామన్నారు. నూతన రేషన్ కార్డులు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందిస్తామని ఆయన తెలిపారు. పెద్దగోపవరంలో రూ.48 లక్షలతో నిర్మించిన సహకార పరపతి సంఘం గోడౌన్‌ను, తక్కెళ్లపాడు, సకినవీడు గ్రామాల్లో సిసి రోడ్లకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.కళావతిబాయి, ఆర్డీవో నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో భట్టికి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలోనూ బ్యాండ్ మేళాలతో ఊరేగింపులు నిర్వహించారు.

రాష్ట్రంలో నంబర్‌వన్

# ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతా

హౌసింగ్ కాలనీకి మౌలిక వసతులు కల్పిస్తాం
నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్/పాలకవీడు:** యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్‌వన్ ఆదర్శ కాలనీగా హుజూర్‌నగర్‌లో నిర్మించే ఆదర్శకాలనీని తీర్చిదిద్దుతానని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి శ్రీసీతారామచంద్రస్వామి గుట్ట వద్ద రూ.14కోట్లతో నిర్మించనున్న ఐటీఐ కళాశాల నూతన బిల్డింగ్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. పక్కనే నిర్మిస్తున్న హౌసింగ్ కాలనీ పనులను పరిశీలించారు. ఆదర్శ కాలనీ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ హౌసింగ్ కాలనీకి కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. త్వరలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ హౌసింగ్ కాలనీ నిర్మాణం గత 10 ఏళ్ళుగా తన తపస్సు అని, త్వరలో మిగిలిన అన్ని పనులు పూర్తి చేస్తామని చెప్పారు. జాన్‌పహాడ్, పాలకవీడు మం డలంలో 5,560 ఎకరాలకు సాగునీరు అందించడం కోసం రూ.120 కోట్లతో జరుగుతున్న లిఫ్ట్ పనులను పరిశీలించడం జరిగిందని, ఆయా పను లు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చదువుకున్న యువత కొరకు రూ.40 కోట్ల తో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను మొదలు పెట్టామని, ఇప్పుడు రూ.14 కోట్లతో బేసిక్ ఐటీఐ కళాశాల బిల్డింగ్ కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఈ కళాశాల వలన ఎంతోమంది యువత ఉద్యోగాలు పొందగలుగుతారని మంత్రి చెప్పారు. విద్యా, వైద్యం, విపత్తు అన్ని విషయాలలో ముందుకుపోతున్నామన్నారు. అభివృద్ధిలో హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతానన్నారు. అనంతరం లింగగిరి గ్రామంలో లింగగిరి నుండి కల్మల్‌చెర్వు వరకు రూ.26 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే అమరవరం గ్రామంలో అమరవరం నుండి అలింగాపురం వరకు రూ.23 కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.మఠంపల్లి మండలంలోని చౌటపల్లి నుండి మేళ్ళచెర్వు వరకు రూ.10 కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఈఈ సీతారామయ్య, డీఈ తీగల రమేష్, ఏఈ, ఆర్‌డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నిరంతరంగా రేషన్‌కార్డులు ఇస్తాం...**

రాష్ట్రంలో అర్హులైనవారందరికీ రేషన్‌కార్డులు ఇచ్చే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతూనే ఉంటదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గాను మంత్రి సందర్శించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాల జాబితాలో పేర్లు రాని వారు అధైర్యపడవద్దని ఈ నెల 21వతేదీ నుండి జరిగే గ్రామసభలలో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలియజేశారు. గత ప్రభుత్వం రేషన్‌కార్డులను ఇవ్వడమే మర్చిపోయిందని ఇప్పుడు మేము 40 లక్షల మందికి మేలు జరిగేలా రేషన్‌కార్డులు అందించనున్నామన్నారు. జనవరి 26వతేదీన మొదలయ్యే ఈప్రక్రియ చివరి వ్యక్తికి రేషన్‌కార్డు అందేంత వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, ఇరిగేషన్ ఎస్‌ఈ రమేష్, డిటిడిఒ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శంకర్, మిషన్‌భగీరథ అధికారులు శ్రీనివాస్, ఆర్‌డిఒ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాగోబా జాతరకు మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఖేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరకు, నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో చేపట్టనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని కోరుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖను దేవాదాయ శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బాసర ఆలయ ఇంఛార్జి కార్యనిర్వహణాధికారి ఎన్.నవీన్ కుమార్, సహాయ కార్యనిర్వహణాధికారి ఆర్. సుదర్శన్, వేదపండితులు మంత్రి సురేఖను జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవ ఆహ్వాన పత్రికను మంత్రికి అందించి, వేడుకలకు ఆహ్వానించారు. జనవరి 28 నుంచి 31 వరకు నాగోబా జాతరను, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వసంత పంచమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మంత్రి సురేఖకి తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ ఆహ్వాన పత్రికను మంత్రికి చదివి వినిపించారు. వేదపండితులు మంత్రి సురేఖకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి, వేదాశీర్వచనం చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులతో కలిసి మంత్రి సురేఖ బాసర జ్ఞాన సరస్వతి వసంత పంచమి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం వేదపండితులు నవీన్ శర్మ, సంజయ్ ఆచార్యులు పాల్గొన్నారు.



## అవినీతి, అక్రమాలకు బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో రాష్ట్రంలో జరుగుతున్న, అవినీతి, అక్రమాలకు, దోపిడికి, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని, ఈ అవినీతి అంతం కావాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు, కార్యకర్తలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోపించారు. దేశంలో గత 10 ఏళ్లు అధికారంలో ఉన్న బిజెపి కేంద్ర మంత్రులపై, ప్రభుత్వంపై ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు కనీసం ఆరోపణలు కూడా రాలేదని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రజానీకం బిజెపిని ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని వెల్లడించారు. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి 8 పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని కిషన్‌రెడ్డి తెలిపారు.

# ఫిబ్రవరి 5న దేశవ్యాప్త నిరసనలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 4 లేబర్ కోడ్ల రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా జరుగు నిరసన ఆందోళనలో యావత్ కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని ఎఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జరిగింది. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావు, బి.చంద్రయ్య, పి.ప్రేంపావని, కె.ఏసురత్నం, కార్యదర్శులు బి.వెంకటేశం, సమ్మయ్య, కోశాధికారి సత్యనారాయణ రెడ్డిలు హాజరయ్యారు. దేశంలో బడా కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తుల అండదండలతో మూడవ సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన అహంకారపూరిత, పాశవిక, ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగించటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది.2025–26 బడ్జెట్‌లో అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల కోసం కనీసం రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరిస్తూనే 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు పెంచుటకు అనుకూలంగా నిర్ణయించటం, వారానికి 70 గంటలు, 90 గంటలు పనిచేయాలంటూ కార్మికుల శ్రమదోపిడికి ప్రోత్సహించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో జాప్యం చేయటాన్ని విడనాడి కనీస వేతన విధానాన్ని అమలు పర్చాలని, 73 షెడ్యూల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించి అమలు చేయాలని కోరింది. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు పాలకమండలిని నియమించాలని, అసంఘటిరంగ కార్మికుల సంక్షేమ బోర్డుకు పాలకమండలిలో కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని సమావేశం డిమాండ్ చేసింది.

# పేదల జోలికి వస్తే ఊరుకోం

ఎంపి ఈటెల రాజేందర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో కుమ్మక్కై పేదల ఇళ్లను కూల్చివేస్తేందుకు ప్రయత్నిస్తున్నారని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, దేనికంటే దానికి తాము సిద్ధమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఈటెల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూదేశంలో అతిపెద్ద మురికివాడలైన బాలాజీనగర్, జవహర్ నగర్‌ల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందని నివసిస్తున్నారని, ఈ నిరుపేదలు ఎంతో కష్టపడి కొనుక్కొని ఇళ్లు కట్టుకుంటే ఏ సంబంధం లేని రెవెన్యూ అధికారులు వాటిని కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1941లో సైనికుల కోసం 5977.3 ఎకరాల భూమిని 4 లక్షల యాభై వేలకు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం సేకరించి ఇవ్వగా, ఈ భూమి 1948 వరకు సికింద్రాబాద్ ఎస్టేట్ ఆఫీసర్ ఆధీనంలో ఉండేదని తెలిపారు. నిజాంపాలన అంతం అయ్యి స్వాతంత్రం వచ్చాక.. ఈ భూములను సైనికులకు సొసైటీకీ 1951 ఎంఈఒకు అప్పగించి రాష్ట్ర ప్రభుత్వాన్ని కేవలం కేర్‌గా మాత్రమే నియమించిందన్నారు. రక్షణ శాఖకు సంబంధించిన భూమిని సైనికులు అమ్ముకుంటే పేదలు కొనుక్కుని ఇళ్లు కట్టుకున్నారని వాటిని రెవెన్యూ అధికారులు ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. ఇదే ప్రాంతానికి గతంలో ఎంపిగా ఉన్న సిఎం రేవంత్‌రెడ్డికి ఈ విషయం తెలియదా అన్నారు. అసలు ముఖ్యమంత్రి పాలనపై ఏ మాత్రం పట్టులేదని, అందుకే అధికారులు ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారని విమర్శించారు. 1998 అరుంధతి నగర్‌లో 1705 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకున్నవారికి భూములు ఇచ్చారు. ఆ ఇళ్లను ఇప్పుడు కూల్చివేస్తామని అంటున్నారని ఇదెక్కడి న్యాయమన్నారు. వెంటనే కూల్చివేతలను ఆపివేయాలని ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలోమాజీ ఎంఎల్‌సి జనార్ధన్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ సైదిరెడ్డి, మురళీధర్ గౌడ్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, సత్యం, భూములకు సంబంధించిన ఇమాన్యుల్, జావేద్ పాల్గొన్నారు.

# ఏడాది దాటినా మంత్రి ఉత్తమ్‌కు 'సాగునీటి'పై అవగాహన రాలేదు

కృష్ణా జలాల పంపిణీపై బిజెపి, కాంగ్రెస్‌తో చర్చకు సిద్ధం: మాజీ ఎంపి వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృష్ణా జలాలను కెసిఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించడం ఆయన అవగాహన లేమికి నిదర్శనమని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ మంత్రి ఉత్తమ్‌కు సాగునీటి విషయాలపై అవగాహన పెంచుకోలేదని ఎద్దేవా చేశారు. బిజెపి కూడా కృష్ణా జలాలపై అవగాహన లేకుండా మాట్లాడుతోందని, సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీకి బిఆర్‌ఎస్ కృషి చేసిందని, దీనిపైన కాంగ్రెస్, బిజెపితో పాటు ఎవరితోనైనా తాము చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, గట్టు రాంచందర్ రావుతో కలిసి వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లోనే కెసిఆర్ ఆదేశం మేరకు అప్పటి ముఖ్యకార్యదర్శి జోషి సెక్షన్ 3 ప్రకారం కృష్ణా నీళ్ల పంపిణీ జరగాలని కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో కెసిఆర్ రాష్ట్రానికి అన్యాయం చేశారని ఉత్తమ్ వ్యాఖ్యానించడాన్ని వినోద్ కుమార్ ఖండించారు. సెక్షన్ 3 ప్రకారం కృష్ణా నీటి పంపిణీ జరగాలని ప్రధానికి ,కేంద్ర మంత్రులకు సిఎంగా కెసిఆర్ లేఖలు రాశారన్నారు. సెక్షన్ 3 ప్రకారం ఏడాదిలో నీటి పంపిణీకి సంబంధించి ట్రిబ్యునల్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, అందుకే సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని, మళ్ళీ ట్రిబ్యునల్ విచారణకు కేంద్రం అంగీకరించడంతోనో సుప్రీం కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకున్నామని వినోద్ కుమార్ వివరించారు. కృష్ణా జలాలపైన వివిధ సందర్భాల్లో కేంద్రంలోని ముఖ్యులకు కెసిఆర్ రాసిన లేఖలను మంత్రి ఉత్తమ్‌కు పంపిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సమస్యలపైన కాంగ్రెస్ పార్టీకి అవగాహన లేదన్నారు.

## ఆరోగ్యశ్రీ పదేళ్ల నిర్వీర్యం..

రూ.1130 కోట్ల బిల్లులను చెల్లించాం
: మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీని నీరు గార్చారని, ఇప్పుడు అదే పథకం అమలుపైన బిఆర్‌ఎస్ మాట్లాడడమంటే దొంగే, దొంగ.. దొంగ అని అరిచినట్టుగా ఉన్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో హాస్పిటల్లకు డబ్బులు చెల్లించలేదని, ప్యాకేజీల ధరలు సవరించలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం సుమారు రూ.730 కోట్ల బాకీ పెడితే, రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిలతో సహా మొత్తం రూ.1130 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను ఒక ఏడాదిలోనే చెల్లించినట్టు మంత్రి దామోదర రాజనర్సింహ తన ట్విట్టర్‌లో(ఎక్స్ వేదిక) పోస్ట్ చేశారు. ప్రతి నెలా నిధులను విడుదల చేస్తున్నామని, హాస్పిటల్ యాజమాన్యాలు లేవనెత్తిన ఇతర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

**పెండింగ్ బకాయిలను చెల్లించలేదు : హరీశ్‌రావు**

పెండింగ్ బకాయిలు విడుదల చేయక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిన దుస్థితి ఏర్పడిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నెట్వర్క్ ఆసుపత్రుల డిమాండ్లను పరిష్కరించి, పెండింగ్ బకాయిలు చెల్లించి, ఆరోగ్య శ్రీ సేవలను కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరమన్నారు.

## అమెరికాలో స్తంభించిన టిక్ టాక్




90 రోజులు ఉపశమనం : ట్రంప్

**వాషింగ్టన్ :** అమెరికాలో టిక్ టాక్ యాప్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అమెరికాలో ప్రముఖ యాప్ స్టోర్స్ నుండి శనివారం రాత్రి పొద్దుపోయాక టిక్ టాక్ యాప్‌ను తొలగించారు. ''క్షమించండి, టిక్ టాక్ ప్రస్తుతం మీకు అందుబాటులో ఉండదు'' అని ఆ యాప్ యాజమాన్యం ఒక నోట్‌ను యూజర్ల కోసం ముందుగానే విడుదల చేసింది. ''టిక్ టాక్‌కు ఒక పరిష్కారం సాధిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. మా మేనేజర్లు అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు, త్వరలో మీ ముందుకు వస్తాం'' అని ఆ నోట్‌లో పేర్కొంది. జనవరి 19 నుండి మా సేవలను నిలిపివేస్తున్నాం, అదీ తాత్కాలికంగా, త్వరలో మళ్ళీ సేవలు పునరుద్ధరిస్తాం, మీ మద్దతుకు మా కృతజ్ఞతలు'' అని టిక్ టాక్ పేర్కొంది.

170 మిలియన్ల మంది ప్రజలు అమెరికాలో టిక్ టాక్‌ను ఉపయోగిస్తున్నారు. టిక్‌టాక్‌పై బైడెన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీనిని ఫెడరల్ కోర్టు సమర్థించింది. టిక్‌టాక్‌ను ఏదైనా ఒక అమెరికన్ కంపెనీకి విక్రయించండి, లేదా నిషేధాన్ని అనుభవించండి అని అమెరికా ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. దీంతో శనివారంనాటితో టిక్ టాక్‌కు ఇచ్చిన గడువు ముగిసిపోవడంతో ఆ యాప్ కనిపించకుండా అదృశ్యమైపోయింది. మరోవైపు కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ 90 రోజులపాటు టిక్ టాక్‌కు కోర్టు నిషేధ ఉత్తర్వుల నుండి ఉపశమనం కలిగిస్తామని చెప్పారు. నిషేధాన్ని నిలిపివేస్తూ బైడెన్ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోతే శనివారం నుండి అమెరికాలో టిక్ టాక్ సేవలు అంతర్థానం అవుతాయని ఆ యాప్ నిర్వాహకులు ముందుగానే ప్రకటించారు. కానీ బైడెన్ ప్రభుత్వం అచేతనంగా వ్యవహరించింది.



# ఎవరి వ్యూహం.. ఈ ప్రకటన

దామోదర్ ఉన్నట్లా...? మరణించినట్లా..?

మావోయిస్టుల భవితవ్యం ప్రశ్నార్థకం

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సజీవంగా ఉన్నారా లేక ఎన్‌కౌంటర్‌లో మరణించారా అన్నదానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. ఈనెల 16న ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు అలియాస్ దామోదర్ మరణించినట్లు మావోయిస్టు దక్షిణ బస్తర్ ఏరియా కార్యదర్శి గంగ పేరుతో ఒక ప్రకటన విడుదలైంది. ఈ ప్రకటనను మావోయిస్టులే విడుదల చేశారా లేక పోలీసులు వ్యూహాత్మకంగా ఈ ప్రకటన వచ్చేలా చేశారా అన్నది అంతు చిక్కడం లేదు. రూ.75 లక్షల రివార్డు కలిగిన తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శి దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఒక చిన్న ప్రకటన చేసి మావోయిస్టులు చేతులు దులుపుకుంటారా ఒకవేళ దామోదర్ మరణిస్తే అతని మృతదేహం ఏమైంది మావోయిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు పోలీసులే ఈ ప్రకటన విడుదల చేయించారా అన్న చర్చ సాగుతుంది. మరో పక్క ఒక వేళ ఈ ప్రకటన గంగ ఇచ్చింది నిజమైతే ఎన్‌కౌంటర్‌లో మరణించకుండానే మరణించినట్లు చెప్పడం వెనక మావోయిస్టుల వ్యూహం ఏమైనా ఉన్నదా అన్న దానిపై కూడా చర్చ సాగుతుంది. ఎందుకంటే గతంలో ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడు ఇటువంటి ప్రకటనలు అనేకం రావడం వాటిలో కొన్ని నిజాలు లేకపోవడం జరిగింది. మావోయిస్టు అగ్రనేతలకు సంబంధించి పలుమార్లు పొరబడిన సందర్భాలు ఉన్నాయి. చొక్కారావు అలియాస్ దామోదర్ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కల్వపల్లి గ్రామానికి చెందిన వారు. ఈ కుటుంబానికి చెందిన ముగ్గురు మావోయిస్టు ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. బడే నాగేశ్వరరావు, బడే మురళి కూడా మావోయిస్టు పార్టీలో పని చేస్తూ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. దామోదర్ అత్యంత చురుకైన నాయకునిగా పేరు తెచ్చుకున్నాడు. గతంలో కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఏరియా కార్యదర్శిగా ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, పెద్దపల్లి ఏరియా మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా పని చేశారు. దాడులకు వ్యూహం పన్నడంలో సిద్ధహస్తునిగా పేరున్న దామోదర్ 2024 జనవరి 10న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హరిభూషణ్ మృతి తర్వాత చొక్కారావుకు ఈ బాధ్యతను అప్పగించారు. సాయుధ బలగాలు పన్నిన వ్యూహంలో చిక్కుకుని మావోయిస్టులు విలవిలలాడుతున్నారు. ఒకప్పుడు దండకారుణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు నేతలు ఒక్కొక్కరుగా ప్రాణా లు కోల్పోతున్నారు. మావోయిస్టుల వ్యూహం ఫలించడం లేదు. ప్రస్తుత సాయుధ బలగాల దూకుడు చూస్తుంటే మావోయిస్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. లొంగిపోవటాలు తప్ప సాయుధ దళాలలోకి దాదాపు రిక్రూట్‌మెంట్ నిలిచిపోయింది. అటవీ సమీప గ్రామాల్లో మావోయిస్టులకు నమ్మకమైన రక్షణ దొరికేది ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అటవీ సమీప గ్రామాల్లో పోలీసులు తిష్టవేసి మావోయిస్టుల సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నారు. భారతదేశ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువుగా సాగిన ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యం ఇప్పుడు పోలీస్ బూట్ల చప్పుళ్లతో దడదడలాడుతున్నది. వేలాది మంది సాయుధ పోలీసులు దండకారుణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. 2026 నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని లేకుండా చేస్తామన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మాటలకు అనుగుణంగా సాయుధ బలగాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. మావోయిస్టు ఉద్యమంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన వారిలో ఎక్కువ మంది తెలంగాణ వారే. తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం ఇటీవల కాలంలో అంతగా ప్రభావితం చేయకున్నా నాయకత్వం మాత్రం ఇక్కడి నుంచే ఉండడం గమనార్హం. అంకితభావం కలిగి ఉద్యమంపై పట్టు బిగించి పోలీస్ బలగాలను ముప్పుతిప్పలు పెట్టి మూడు దశాబ్దాలుగా సాయుధ పోరాటాన్ని నడిపించిన వారిలో తెలంగాణ నేతలే ఎక్కువగా ఉన్నారు. మహోత్తర చరిత్ర కలిగిన సాయుధ పోరాట మహోద్యమం ఇప్పుడు సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. ఇటువంటి స్థితిలో చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా మరణిస్తే మావోయిస్టు ఉద్యమానికి తీరని దెబ్బ. తెలంగాణ అబూజ్‌మడ్‌గా చెప్పుకునే కాల్వపల్లి బిడ్డ దామోదర్. యుద్ధతంత్ర నిపుణుడిగా పేరొందిన ఆయన ఎన్‌కౌంటర్ పట్ల వస్తున్న ఈ ప్రకటన అటు పోలీసుల్లోనూ, ఇటు మావోయిస్టుల్లోనూ కలకలం రేపుతుంది. బస్తర్ పోలీసులు మాత్రం ఇంత వరకు దామోదర్ మృతిని నిర్ధారించకపోవడం గమనార్హం.

## రైతు కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మరణించిన రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో ఇప్పటి వరకు 402 మంది రైతులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని రైతులను కోరారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటించడం దుర్మార్గమని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా అందరికీ రుణ మాఫీ, రైతుభరోసా, అన్ని పంటలకూ రూ.500 ల బోనస్ లాంటి హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని, ఇందుకు సిఎం బాధ్యత వహించాలన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనమని హరీశ్‌రావు తెలిపారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగి పోతున్నారని, వారు తమ వద్ద ఉన్న భూములను కుదవ పెట్టి, అప్పులు తీసుకొస్తున్నారన్నారు.




# ప్రగతిశీల సాహిత్యమే మార్గదర్శకం

ప్రేమ కబుర్లు... హృదయ వేదనలు... మనిషుల మధ్య అగాథాలను సృష్టించే విద్వేషాలు కాదు, అతి సామాన్యుడి జీవితంలోనూ గుణాత్మక మార్పులు తీసుకొచ్చే ప్రగతిశీల సాహిత్యం ప్రస్తుత సమాజంలో అత్యవసరం. ఒకవైపు శాస్త్ర పరిశోధనలు వేగంగా ముందుకు దూసుకెళుతుంటే, మరోవైపు మూఢనమ్మకాలు అదే స్థాయిలో వేళ్లూనుకుంటున్నాయి. గతంలో లేని ఎన్నో పిచ్చి నమ్మకాలు ఇటీవల కాలంలో వింటున్నాం... చూస్తున్నాం. శాస్త్రీయ విజ్ఞానం కొద్ది మందికే పరిమితం కావడం... వాటి గురించి ప్రజల్లో అవగాహన కల్పించే రచనలు లేకపోవడం మన దౌర్భాగ్యం. 'వేదాల్లోనే అన్నీ ఉన్నాయష' అని కరటక శాస్త్రి పాత్రతో అనిపిస్తాడు రచయిత గురజాడ అప్పారావు తన 'కన్యాశుల్కం' నాటకంలో. ఇప్పటికీ చాలా మంది ఆలోచనా విధానం అదేకావడం బాధాకరం. తగినంతగా శాస్త్రీయ విజ్ఞాన సాహిత్యం రాకపోవడమే ఈ పరిస్థితికి ఒక కారణం. కొన్ని వేలు.. లేదా వందల సంవత్సరాల క్రితం నాటి పుస్తకాలను, సాహిత్యాన్ని, గ్రంథాలను నేటికీ ప్రామాణికంగా తీసుకోవడంలో అర్థం లేదు. అప్పట్లో వారు తాము గమనించి, గ్రహించిన విషయాలను ప్రస్తావించి ఉండవచ్చు. నేటి సమాజానికి అప్పటి అభిప్రాయాలు లేదా సిద్ధాంతాలు పూర్తి భిన్నంగా ఉండవచ్చు. మతం లేదా సంప్రదాయం పేరుతో నాటి ఆలోచనలనే ఇప్పటికీ ప్రజల నెత్తిన రుద్దడం సరికాదు. ప్రమాదకరం కూడా. కాంతివేగాన్ని గూర్చి వేదాలు చెప్పాయనీ, సూర్యుడికీ, భూమికీ మధ్య ఉన్న దూరం గూర్చి వేదాల్లో ఉందనీ, కుజగ్రహంలో నీళ్ల గూర్చి మనకు తెలుసనీ, ఓపెన్ హైమర్ అనే శాస్త్రవేత్త అణుబాంబును పేల్చిన తర్వాత.. భగవద్గీతలోనూ అణుశక్తిని గురించిన విషయాలున్నాయనీ వాదించే వారిని ఏమనాలి? టివి చానెళ్లు వచ్చి... ప్రతి అంశాన్నీ డబ్బుతో ముడిపెట్టడం పెరిగిన తర్వాత, ఇలాంటి అర్థంలేని ప్రచారాలు పెరిగాయి. శాస్త్రవేత్తలను పిలిస్తే ఆర్థకంగా లాభం ఉండదని మతాధికారులనో, జోతిష్కులనో పిలిపించడం ఆనవాయితీగా మారింది. విధానం ఏదైతేనేం.. డబ్బు వచ్చిపడుతున్నది. సత్యాన్ని శాస్త్రీయంగా తెలుసుకునే అవకాశం ప్రజలకు లేకుండా... రానీయకుండా అడ్డుకుంటున్నారు. చాలా మంది రచయితలకు విరివిగా ప్రచారమవుతున్న మూఢనమ్మకాలు కనిపించకపోవడానికి కారణం ఏమిటో? చాలా మంది వాదనలకు హేతుబద్ధత ఉండడం లేదు. 'జోతిష్యం' పేరుతో ప్రజలను భయభ్రాంతులను చేయడం నిత్యకృత్యమైంది. జోతిష్యం సమష్టి అంశమైనప్పటికీ, దానిని వైక్తిక అంశంగా మార్చేశారు. గ్రహణాలు ఎలా ఏర్పడాతాయో చాలా మందికి తెలుసు. ఖగోళ శాస్త్రంపై అవగాహన ఉన్నవారికి ఇంకా వివరంగా అర్థమవుతుంది. కానీ, ఆ సమాచారాన్ని కూడా వ్యాపారంగా మార్చేస్తున్న వారు.. ఎన్నిరకాలుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారో చూస్తునే ఉన్నాం. నిద్రలేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ అడుగడుగునా అనుమానాలు ప్రోదిచేసుకుంటూ, అసహనంతో, అనవసర భయంతో రోజులు వెళ్లదీసే పరిస్థితికి మనిషిని నెట్టేస్తున్నవైనాన్ని గమనిస్తునే ఉన్నాం. మానవ హితాన్ని కోరుకుంటే, ఈ కుళ్లును కడిగేయడానికి తక్షణ ప్రయత్నం మొదలుకావాలి. విప్లవాత్మక ఆరోచనలకు, అభ్యుదయ భావాలకు బీజాలువేసే బలీయమైన శక్తుల్లో సాహిత్యం ఒకటి. ఒక అక్షరం ఎన్నో మెదళ్లను కదిలిస్తుంది. ప్రగతిశీల సాహిత్యం మనిషి పురోవృద్ధికి తోడ్పడుతుంది. ఆధునిక విజ్ఞానం విస్తరిస్తున్నకొద్దీ ఎదురవుతున్న సవాళ్లు పెరుగుతున్నాయి. లెక్కలేనన్ని ప్రశ్నలు వచ్చిపడుతున్నాయి. వాటికి సమాధానం వెతుక్కుంటూ, హేతుబద్ధమైన విశ్లేషణలు చేసుకుంటూ ముందుకు సాగడాన్ని మించిన పురోగవృద్ధి ఏముంటుంది? శాస్త్రవేత్తలు సంవత్సరాల పరిశోధనలు, అధ్యయనాలు జరిపి అందించిన సమాచారాన్ని కూడా ప్రజలకు అందించే పరిస్థితి లేదు. సైన్స్‌కు సంబంధించిన రచనలు రాకపోలేదు. ఇంతకు ముందు వచ్చాయి... ఇప్పటికీ వస్తున్నాయి. కానీ, వాటి సంఖ్య చాలా పరిమితంగా ఉంది. మిగతా సామాజిక అంశాలతో పోలిస్తే, ప్రగతిశీల, పరిశోధనాత్మక రచనలు నామమాత్రమే. ప్రపంచం వ్యాప్తంగా చాలా దేశాల్లో సైన్స్‌కు ప్రాధాన్యత పెరుగుతున్నదిగానీ, మన దేశంలో ఇంకా ఆ పరిస్థితి లేదు. భూమి గుండ్రంగా ఉందంటే నమ్మని వారు ఇప్పటికీ ఉన్నారు. మానవ పరిణామ క్రమం గురించి డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్ని కొట్టిపారేసే వారి సంఖ్యకు కొదువ లేదు. అయితే, వారంతా డార్విన్ సిద్ధాంతాన్ని వడపోసి, లోపాలు గుర్తించి, వాటిని సరి చేస్తూ ఏవైనా కొత్త ప్రతిపాదనలు చేయడం లేదు. మతపరమైన అంశాలను ప్రామాణికంగా తీసుకొని, డార్విన్ సిద్ధాంతం తప్పని మొండిగా వాదిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని మించిన తిరోగమనవాదం వేరొకటి లేదు. ఇది కేవలం విద్యా సంబంధమైన అంశం కాదు.. మనిషి ఆలోనా సరళినని, తద్వారా సమాజాన్ని ప్రభావితం చేసే కీలక పరిణామం. ఇలాంటి ఎన్నో సమస్యలు సాతీకారుల రచనా వస్తువుగా మారాలి. అత్యధికుల శ్రమను అతి కొద్దిమంది అనుభవిస్తున్న రాజ్యంలో అవిశ్రాంత పోరాటాలకు సామాన్యుడిని సిద్ధం చేయాల్సిన బాధ్యత రచయితలదే. చైతన్యవంతులనను చేసే **బాధ్యత కూడా వారిదే.**

**'బలవంతులు దుర్బల జాతిని**
**బానిసలను కావించారు**
**నరహంతలు ధరాధిపతులై**




చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి' అంటాడు శ్రీశ్రీ. బలవంతుల ఆధీనం నుంచి సామాన్యుడిని విడిపించాలి.. దోపిడి వర్గ కబంధహస్తాల నుంచి సగటు జీవికి విముక్తిని ప్రసాదించాలి. అందుకు పోరాటం ఒక్కటే మార్గం. శతాబ్దాల అణచివేతకు అలవాటుపడి, భయంతోమగ్గిపోతూ, బలవంతుడిని ఎదురించలేక వణికిపోయే అణగారిన ప్రజలల్లో మార్పు కోసం పోరాట తత్వాన్ని నింపడానికి, ధిక్కార స్వరం వినిపించేలా ప్రోత్సహించడాకి అనువైన సాహిత్యం ప్రస్తుతావసరం. దానిని ప్రగతిశీల సాహిత్యం అని పిలిచినా, మరే ఇతర పేరు పెట్టినా సమస్య లేదు. పేరు కంటే సాహిత్య పరమావధి ముఖ్యం. దోపిడి అనేది అనాదిగా కొసాగుతున్నది. అందుకే, అణతివేతకు వ్యతిరేక పోరాటం ఒక నిరంతర ప్రక్రియ. నిజమైన సాహితీకారుడు నేలవిడిచి సాము చేయడు. చరిత్ర మొత్తం వర్గ పోరాటాలమయమని మార్క్సిజం చెప్తున్నది. నేటికీ అదే విధానం కొనసాగుతున్న వైనాన్ని మనం కళ్లతో చూస్తునే ఉన్నాం. మనిషి సామాజిక స్థితి అతనిలోని చైతన్య స్థాయిని నిర్ధారిస్తుంది. దినందినం బతుకు పోరాటం చేసే బడుగుజీవి కష్టాలు, కన్నీళ్లతో కాలం గడుపుతాడే తప్ప, తెగించి పోరాడడానికి సాహసించడు. అయితే, సరైన ప్రేరణ లభిస్తే మాత్రం, ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడతాడు. ఆ ప్రేరణ రచయితల వల్లే సాధ్యమవుతుంది. వ్యాసాలు... పద్యాలు... పాటలు.. గేయాలు.. నవలలు... కథలు.. ఇలా ఎన్నో రకాల సాహితీప్రక్రియలు మనుషుల్లో పరివర్తనకు బీజం వేస్తాయి. అక్షరానికి ఉన్న శక్తి అలాంటిది. ఆచరణాత్మక మార్పు లేనంతకాలం దోపిడీ వ్యవస్థ నుంచి, అణచివేత నుంచి విముక్తి లభించదు. ఉద్యమాలతోనే ఈ మార్పు సాధ్యమవుతుంది. బాధితులు చైతన్యవంతులైతేనే ఉద్యమ నిర్మాణాలు జరుగుతాయి. సాహిత్యాన్ని మించిన చైతన్య జ్వాలను రగిలించే శక్తి ఎక్కడా లేదు. ఆధునిక చరిత్రలో ఎన్నో విప్లవాలు జరిగాయి. క్రూరమైన పాలన నుంచి, విపరీతమైన దోపిడి నుంచి, అంతులేని అణచివేత నుంచి ఎన్నో దేశాలు.. ఎన్నో ప్రాంతాలు విముక్తిపొందాయి. పంథాలు వేరు కావచ్చు.. సిద్ధాంతాల్లో వైవిధ్యాలు ఉండవచ్చు... విధానాల్లో వైరుధ్యాలు కనిపించవచ్చు.. కానీ, ప్రతి విప్లవ గమ్యం దోపిడిని అరికట్టడమే. ప్రతి పోరాట లక్ష్యం అణచివేత నుంచి విముక్తి పొందడమే. ఏ ప్రాంతంలోనైనా... ఎలాంటి ప్రజా పోరాటానికైనా.. ఇంధనం మాత్రం సాహిత్యమే. సిద్ధాంత వ్యాసాలు, స్ఫూర్తిని నింపే పాటలు ఏ విధంగా ప్రజలను కదిలించాయో మనకు తెలుసు. ఒక్క మాటలో చెప్పాలంటే, పోరాటాలకూ, సాహిత్యానికీ మధ్య ఉన్న సంబంధం అనివార్యం... అజరామరం. ప్రగతిశీల సాహిత్యం అంటే కేవలం ఉద్యమాలకు ఊపిరిపోసేది మాత్రమే కాదు.. దోపిడి రాజ్యాన్ని కూలదోసిన తర్వాత ఏర్పడే కొత్త సమాజ తీరుతెన్నులను వివరించేది కూడా. సుదీర్ఘమైన సామాజిక దశలను, తిరుగుబాటు తర్వాత నెలకొన్న పరిణామాలను అర్థం చేసుకొని, భవిష్యత్ సమాజాన్ని ఆవిష్కరించేది కూడా ప్రగతిశీల సాహిత్యమే. ఇలాంటి సాహిత్యం ప్రజలను మారుస్తుంది. సమాజాన్ని మారుస్తుంది. వికాసానికి బాటులు వేస్తుంది. వెరసి, సమసమాజ స్థాపనకు బీజాలు వేస్తుంది. ఏ సమాజమైనా.. ఏ సిద్ధాంతమైనా మార్పులకు అతీతం కాదు.. కాకూడదు. ఏదీ లోపరహితం కాదు.. భేషజాలు లేకుండా వాస్తవాలను అంగీకరించి తీరాలి. పెరుగుతున్న సాంకేతికత నుంచి మారుతున్న జీవన విధానాల వరకూ కాలానుగుణంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో సిద్ధాంతాలు కూడా మారాలి. మూల సూత్రాలకు, ప్రధాన లక్ష్యాలకు భంగం వాటిల్లని మార్పును ప్రోత్సహించాలి. ఈ బాధ్యత కూడా రచయితలదే. మార్పు అంటే విధ్వంసం, హింస కానవసరం లేదు. ప్రజల ఆలోచనల్లో మార్పు వస్తే, సమాజం కూడా మారుతుంది. 'చర్విత చర్వణం' అనిపించినా... ప్రజల్లో మార్పు రావాలంటే ప్రగతిశీల సాహిత్యం అవసరమని చెప్పక తప్పదు.

**– సత్యశ్రీ**



## గ్రాంసీని అర్థం చేసుకోవాలి..

ఆంటానియో గ్రాంసీ... మనకు సామాన్యంగా అర్థం కాదు.. కానీ, అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, అతని రచనలు ఒకొక్కరికీ ఒక్కో రూపంలో దర్శనమిస్తాయి. ఎవరికి తోచిన రంగు వారు పులిమేస్తుంటారు. కొందరికి ఆయన వ్యాసాలు, రచనల్లో మార్క్సిజం పునాదులు కనిపిస్తాయి. మరికొందరికీ మార్క్సిజం విధానాలపై ధిక్కార స్వరాలు వినిపిస్తాయి. అతనిని కొందరు ప్రగతిశీల పాంథకుడు అన్నారు. మరికొందరు అతనిపై 'రివిజనిస్టు' ముద్ర వేశారు. ఎవరి కోణం వారిది. ఎవరి వాదన వారిది. అయితే, ఫాసిస్టు భావజాలం ఉన్నవారంతా ఎప్పుడూ మార్క్సిస్టు ఆలోచనలను, సిద్ధాంతాన్ని విమర్శించడంలోనే నిమగ్నమవుతారన్నది నిజం. దోపిడీ వ్యవస్థను సమర్థిస్తూ, సమభావనను వ్యతిరేకించడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తునే ఉంటారు. కొంత మంది ప్రముఖుల పేర్లను నిర్లజ్జగా ఉపయోగించుకుంటారు. వారి పట్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపడమేగాక, మార్క్సిజాన్ని అలాంటి మేధావులే వ్యతిరేకించారనే భావనను వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. ఆ బృందం చాలాకాలం పాటు ఉపయోగించుకున్న ఒకానొక పేరు ఆంటానియో గ్రాంసీ. ఇటలీకి చెందిన గ్రాంసీ వ్యాసాలు, రచనలకు ఊహాజనితమైన కొత్త రూపాన్నిచ్చారు. కావలినంత బురద చల్లారు. నిజానికి గ్రాంసీని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. అతని ఆలోచనలను మార్క్సిజం మీద విసుగుగానూ, విమర్శగానూ, అసంతృప్తిగానూ జరిగిన ప్రచారాన్ని నమ్మినంత కాలం అతను రాతల్లో లోతులను కనిపెట్టలేం. సామ్రాజ్యవాద మద్దతుదారులు అభివర్ణించిన విధంగానే గ్రాంసీ నిజయంగానే మార్క్సిజాన్ని, సోషలిజాన్ని విమర్శించివుంటే, ముస్సోలినీ ఫాసిజానికి వ్యతిరేంగా ఎందుకు స్వరం పెంచాడు? ఎందుకు ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రయత్నం కొనసాగించాడు? ఎందుకు జైలు జీవితం గడిపాడు? 1891 జనవరి 22న, ఇటలీలోని అలెస్‌లో జన్మించిన అతను, 1937 ఏప్రిల్ 27న తన 46వ ఏట మృతి చెందడానికి కొద్దికాలం ముందు వరకూ జైల్లోనే ఎందుకు ఉన్నాడు? నిజానికి మార్క్సిజాన్ని గ్రాంసీ ఆచరణాత్మక తత్వశాస్త్రంగా భావించాడు. మార్క్సిజం అనేది గుడ్డి నమ్మకం కాదు, అది సమాజ గమనాన్ని అర్థం చేసుకునే ఒక శాస్త్రీయ పద్ధతి, కార్యాచరణకు కరదీపిక అంటాడు ప్రఖ్యాత శాస్త్రవేత్త జెడి బెర్నాల్. మార్క్సిజం–లెనినిజాన్ని ఒక పిడివాదంగా కాకుండా, సృజనాత్మక శాస్త్రంగా, నూతన సమాజ నిర్మాణానికి దారి చూపే మార్గదర్శిగా అన్వయించుకోవడమెలాగో గ్రాంసీ రచనలు తెలియజేస్తాయన్నది వాస్తవం. గ్రాంసీ చివరి క్షణం వరకూ ముస్సోలినీ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుతునే ఉన్నాడు. అతను ఎన్నడూ మార్క్సిజం మూల సూత్రాల నుంచి వైదొలగలేదు. సోషలిస్టు సమాజ నిర్మాణ ఆలోచనలను వదులుకోలేదు. జైళ్లకు బెదరలేదు.. శిక్షలకు వెరవలేదు.. గ్రాంసీని సక్రమంగా అర్థం చేసుకోలేని కొందరు రివిజనిస్టులు, అతను తొలుత మార్క్సిస్టుగానే ఉన్నప్పటికీ, ఆ తర్వాత ఆలోచనా ధోరణిని మార్చుకున్నాడని విపరీతంగా ప్రచారం చేశారు. చర్చోపచర్చలకు నాంది పలికారు. కానీ, వారి ఆశయం నెరవేర లేదు. మార్క్సిజాన్ని గ్రాంసీ పూర్తిగా వ్యతిరేకించాడని నిరూపించలేకపోయారు. మార్క్స్ ప్రతిపాదించిన వర్గ పోరాటాలతో కూడుకున్న సమాజం స్థానంలో, అణగారిన వర్గాల సమాజాన్ని చేర్చాలన్న 'సబాల్‌ట్రన్ భావన'కు గ్రాంసీ ఆద్యుడని అంటారు. ఈ కోణంలో గ్రాంసీ సిద్ధాంతాన్ని కమ్యూనిస్టుల్లో కొందరు సమర్థిస్తే, మరికొందరు వ్యతిరేకిస్తారు. కానీ, సామ్రాజ్యవాదానికి, జాత్యహంకారానికి వ్యతిరేకంగా అతను చేసిన పోరాటాన్ని ఎవరూ తక్కువ చేయరు. గ్రాంసీ రచనలను విశ్లేషించే ముందు, అతని కాలంలో, ఇటలీ పరిస్థితులను అర్థం చేసుకోవాలి. మార్క్సిజాన్ని అన్వయించుకున్న తీరును గ్రహించాలి. ప్రధాన సిద్ధాంతాలకు, వాదనలకు భంగం కలిగించని ఆచరణ వైరుధ్యాలను భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదు. నాటి ఇటలీ ఫాసిస్టు సమాజానికీ, నేడు మన దేశంలో నెలకొన్న పరిస్థితులకూ దగ్గరి పోలికలు ఉన్నాయన్నది వాస్తవం. అందుకే, గ్రాంసీని అధ్యయనం చేయాల్సిన అవసరం, మౌలిక భావనలను గుర్తించాల్సిన ఆగత్యం ఏర్పడింది. తన ఖైదు సమయంలో, గ్రాంసీ 30 కంటే ఎక్కువ నోట్‌బుక్స్, 3,000 పేజీల చరిత్ర, విశ్లేషణలు రాశాడు. సహజంగానే జైలు అధికారుల పరిశీలన, సెన్సార్‌షిప్ తర్వాతే అవి బయటకు వచ్చేవి. అందుకే, అతను విభిన్న పదజాలాన్ని వాడాడు. సరికొత్త రచనా శైలిని అనుసరించాడు. తద్వారా జైలు అధికారుల కఠిన ఆంక్షలు, పరిశీలన నుంచి అతని నోట్స్ దాదాపు సురక్షితంగానే బయటకు వచ్చాయి. అయితే, లోతైన వివరణ ఇవ్వడానికి జైలు నుంచి బయటపడిన తర్వాత గ్రాంసీకి ఎక్కువ సమయం లేకపోయింది. కొన్ని నెలల్లోనే అతను మృతి చెందాడు. అందుకే, గ్రాంసీ సంక్లిష్టమైన రచనలు, విశ్లేషణలపై ఇప్పటికీ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే కొంతమంది అతనిని నియో మార్క్సిస్టుగా పేర్కొంటారు. కొద్ది మంది అతనిని రివిజనిస్టుగా కూడా అభివర్ణిస్తారు. ఎవరి అభిప్రాయాలు, వాదనలు ఎలావున్నా, సామ్రాజ్యవాద విధానాన్ని గ్రాంసీ ఖండించాడన్నది నిజం. ముస్సోలినీ విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పాడన్నది నిజం. రాజీలేని తన ఆలోచనా విధానాలతో ఫాసిస్టులకు కంటకంగా మారాడన్నది నిజం. జైలులో చిత్రహింసలు అనుభవించింది కూడా నిజమే. దేశకాల పరిస్థితులకు అనుకూలంగా సాంప్రదాయ విధానాలకు, ఆలోచనలకు భిన్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లి ఉండవచ్చు. అంత మాత్రాన అతని చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు. అతనిని అర్థం చేసుకోవాలి.




# జీవితానుభవాలే 'పరిపూర్ణ' రచనలు

నంబూరి పరిపూర్ణ... పరిచయం అవసరం లేని పేరు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు దాసరి నాగభూషణం భార్య. దాసరి శిరీష, దాసరి అమరేంద్ర, దాసరి శైలేంద్రల తల్లి (వీరిలో శిరీష, అమరేంద్ర రచయితలే). అయితే, అంతకంటే ముందు, ఆమె పోరాట యోధురాలు. భయం అంటే ఏమిటో ఆమెకు తెలియదు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, మరోవైపు రచయిత్రిగా కూడా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె రాసిన కథలు, నవలలు, వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. పుస్తకాలుగా కూడా వచ్చాయి. 'వెలుగుదారులలో' అన్న పేరిట ఆమె ఆత్మకథ 2017 లో పుస్తకంగా వచ్చింది. 1931, జులై 1న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా, బొమ్ములూరు గ్రామంలో నంబూరి లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు జన్మించిన పరిపూర్ణ ప్రాథమిక విద్యాభ్యాసం బండారిగూడెంలో, తర్వాత విజయవాడలో, హైస్కూలు చదువు మద్రాసులో, రాజమండ్రిలో కొనసాగింది. ఇంటర్మీడియట్‌ను కాకినాడలోని పిఆర్ కాలేజీలో పూర్తి చేసిన ఆమె, ఏలూరులోని సెయింట్ థెరెసా మహిళా కళాశాలలో టీచర్ ట్రైనింగ్ పొందారు. అనంతరం ప్రైవేటుగా బిఎ పట్టాను అందుకున్నారు. 1949లో కమ్యూనిస్టు నాయకుడు దాసరి నాగభూషణరావుతో వివాహమైంది. 1955–58 మధ్యకాలంలో అధ్యాపక వృత్తి చేపట్టి నూజివీడు, ఏలూరు, గోపన్న పాలెం లలో పనిచేశారు. 1958 నుండి 1989 దాకా, సుమారు మూడు దశాబ్దాలు ప్రభుత్వోద్యోగిగా పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లలో పనిచేశారు. సామాజిక కార్యకర్తగా కూడా పరిపూర్ణ అనేక సంవత్సరాలు కృషి చేసింది. వామపక్ష ఉద్యమాలలో విద్యార్థి కార్యకర్తగా, నేతగా (1944–1949) పనిచేసి, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా నిర్బంధం, అజ్ఞాత జీవితం (1950–52) అనుభవించారు. 'ఆలంబన' సేవాసంస్థతో ఇరవై ఏళ్ళకి పైగా అనుబంధం కలిగి క్రియాశీలక పాత్ర పోషించారు. 2024, జనవరి 26వ తేదీన బెంగళూరులో తన 92వ యేట తుదిశ్వాసను విడిచిన పరిపూర్ణ రచనలు సామాన్య జీవితాలకు అద్దం పడతాయి. జీవితంలో ఎదురైన సంఘటనలు, తాను దగ్గరగా చూసిన అంశాలనే కథలుగా మలచుకున్నానని ఆమె ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. చిన్నతనం నుండే స్టేజీ నాటకాలలో పాల్గొనడం అలవాటు ఉన్న పరిపూర్ణ 1942 లో విడుదలైన 'భక్త ప్రహ్లాద' తెలుగు చిత్రంలో చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో జి.వరలక్ష్మి వంటి ప్రముఖ నటుల సరసన ప్రహ్లాదుడి పాత్ర వేసింది. 1943లో బాలాంత్రపు రజనీకాంతరావు ప్రోద్బలంతో రేడియో నాటకాలలో పాల్గొన్నది. 1944 లో కమ్యూనిస్టు పార్టీ ప్రచార కార్యక్రమాలలో భాగంగా రాజమండ్రిలో ప్రచార గీతాలు పాడటం, నాటకాల ప్రదర్శనలో పాలు పంచుకుంది. 1986లో అక్కినేని కుటుంబరావు దర్శకత్వంలో వచ్చిన టెలీఫిల్మ్ 'ఇద్దరూ ఒక్కటే' లో ప్రధానపాత్ర పోషించింది. సత్రాజు ప్రసన్నకుమార్ సంగీత దర్శకత్వంలో 2004లో 'స్వర పూర్ణిమ' పేరిట ఆమె పాటల ఆల్బం విడుదలైంది.




### రచనల జాబితా

- మాకు రావు సూర్యోదయాలు, నవలిక, 1985.
- ఉంటాయి మాకు ఉషస్సులు, కథా సంపుటి, తొలి ముద్రణ 1998, మలిముద్రణ 2018.
- కథా పరిపూర్ణం, కథా సంకలనం, 2006 (తన సంతానం శిరీష, అమరేంద్ర, శైలేంద్రలతో కలిసి).
- శిఖరారోహణ, వివిధ సామాజిక అంశాలపై, స్త్రీ సమస్యలపై వ్యాసాలు, కథల సంపుటి, 2016.
- వెలుగుదారులలో, ఆత్మకథ, 2017.
- పొలిమేర, నవల, 2018.
- నంబూరి పరిపూర్ణ 91 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఒక దీపంవేయి వెలుగులు, నంబూరి పరిపూర్ణ జీవితం, సాహిత్యం, వ్యక్తిత్వం' అన్న పుస్తకం సాహితీమిత్రుల, కుటుంబ సభ్యుల కూర్పుతో 2022 ఆగస్టులో ముద్రితమైంది.

## ఈ వారం కవితలు

### భారత రాజ్యాంగం

ఆగ్రవర్ణ అధికారం
చతుర్వర్ణ శాసనం
ఇదే కదా మనువాదం
మనకిచ్చే బహుమానం
క్షత్రియులే పాలకులంటా
వాణిజ్యం వ్యవసాయం వైశ్యులదంటా
వేదం నాదం విద్యాబోధన
అంతా బ్రాహ్మణుల సొత్తంటా,

వర్ణ వ్యవస్థ అడుగునపడి
శూద్రులు ఊడిగం చేయాలంటా
ఇదే కదా మనుస్మృతి
మనకిచ్చే బహుమతి
వర్ణం అర్హతకు గీటురాయి
కాదన్నది భారత రాజ్యాంగం
తరతరాల వర్ణవివక్ష గాయాలను
రిజర్వేషన్ల మందుతో మాన్పుతున్నది
మన భారత రాజ్యాంగం
గాయాలు మానిననాడు
మందుతో పనిఏముందును
అంతరాల దొంతరలు పూడ్చిన నాడు
రిజర్వేషన్లతో పనిఏముందును
ప్రజాస్వామ్యం లౌకికవాదం
సామ్యవాదాలకు శ్రీకారం మన
రాజ్యాంగం ప్రపంచాలకే తలమానికం
మన భారత రాజ్యాంగం

**– బొమ్మగాని నాగభూషణం**

### కాలం ఒకేలా వుండదు

నిన్ను నడిపే కాలం నువ్వు నడిచే కాలం
మన కళ్ల ముందు క్షణాలు
క్షణాలుగా
కదిలిపోయే కాలం కరిగి పోయే కాలం
ఇప్పుడు ఎప్పుడు ఎల్లప్పుడూ....
ఒకేలా వుండదు..ఒక్కరి కోసం వుండదు
కాలం మనదేలే అనుకుంటే పొరపాటే
కాలం వెంట మనం నడుస్తుంటాం
మన వెంట కాల మెప్పుడూ నడవదు
మనలా అస్సలు నడవదు

ఈ రోజు వున్నట్టే రేపు కూడా వుండదు
కాక వుండదు రేపన్నది ఎప్పుడూ
ఓ అస్పష్ట చిత్రం వర్తమానంలోకి
వచ్చే వరకూ అది ఒఠి ఊహ
ఈ రోజు నువ్వు నిలబడ్డట్టే
రేపూ నిలబడతానని అనుకోకు
కాలపు తులాభారంలో
నువ్వు ప్రతీ సెకనూ తూచబడతావు
నీ చిత్తశుద్ధి పనులే
నీ గెలుపుకు గీటురాయి

భూమ్మీది నువ్వు ఆకాశంలోకి ఎగరటం
ఆకాశం నుంచి రెప్పపాటులో
భూమ్మీదికి పడిపోవటం
వికృతమూ కాదు వింతేమీ కాదు
నాయకుడా....ప్రజా తీర్పు పదిలం
మాటల గారడీలు మూట గట్టుకో
కాలం గీసే గీతల్ని నువ్వెప్పుడూ
కాలిక్యులేట్ చేయలేవు
కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు

కాలంతో ప్రయాణం చెయ్ అంతే
నీ విజయం కాలమున్నంతకాలం
నిలుస్తుందను కోకు కాలం నువ్వెక్కిన
బుల్లెట్టు బండి కాదు కాలంపై స్వారీ
కుదరదుకాక కుదరదు
కాలం నిన్ను తుడిచేయక ముందే
కాలంతో సఖ్యతగా వుండు
గుర్తుపెట్టుకో..
కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు..!

**డా.కటుకోఝ్వల రమేష్,**
**9949083327**

### ఎర్రచీమలం!

ఎర్రచీమలం! ఔను! మేము
ఎర్రచీమలం!! ఎర్ర చీమలం!

సర్వజీవులను జీవులుగా గౌరవిస్తూ
శ్రమదోపిడీని వ్యతిరేకిస్తూ
లింగ వివక్షలను నిరసిస్తూ
అసమానతల్ని నిషేధిస్తూ
సమత్వాన్ని సాధించే ఎర్రచీమలం!!
ఔను మేము ఎర్రచీమలం!!

పందొమ్మిది వందల ఇరవై ఐదున
ఆవిర్భవించే 'సిపిఐ'గా మన దేశాన
అభ్యుదయ మార్గాన జనాన్ని నడప
మార్గనిర్దేశనంచేస్తూ 'భాకపా'గా
పరిఢవిల్లే ఎర్రచీమలం!
ఔను!! మేము ఎర్రచీమలం!!!

వర్గ నిర్మూలనకు పక్రమిస్తూ
కార్మిక కర్షక వర్గాలనేకం చేస్తూ
మూఢనమ్మకాల నిర్మూలిస్తూ
సత్యాన్వేషణకు చదువును చదును చేస్తూ
సాగే ఎర్రచీమలం!
ఔను!! మేము ఎర్రచీమలం!!!

భువి, భుక్తి, విముక్తి సాధించ
అమానవీయ పాలకుల నిర్మూలించ
ఉద్యమాల కవాతు నిర్మించ
దండు కట్టిన ఎర్రచీమలం!
ఔను మేము ఎర్రచీమలం!!

అమానుష నిజాము అంతంకై
సాయుధ సమరము పంతంతో
తెలంగాణ విముక్తిలో ముందు నిలిచి
బానిస సంకెళ్ళను విరిచి
సాధించిన ప్రగతిశీల ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!

నిస్వార్థానికి నిలయులం
త్యాగాలకు మారుపేరులం
అవినీతికి చరమ గీతికలం
అంకితభావాలకు నిలువుటద్దాలం
సమసమాజ సాధనకై ప్రాణమిచ్చే
ఎర్రచీమలం
ఔను! మేము ఎర్రచీమలం!!

ప్రజా క్షేమానికై శిక్షలకు, జైలు శిక్షలకు
హింసలకు, చిత్రహింసలకు
వెన్ను చూపనివాళ్ళం
కుల మత సర్పాలపాలిటి నెమళ్ళం
చెడువాళ్ళను ఏరిపారేసే హంసలం
సామ్యవాద సాధనలో
సౌమ్యవాదం వదులుకుంటాం
ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!

జనం గోసను వాళ్ళ యాసల్లోనే
వ్యక్తీకరణతో సాహిత్యాకాశాన
విహరించే అభూత శక్తులకు స్వస్తితో
భూమార్గం పట్టించి సామాన్యులను
అసామాన్యులుగా వర్ణనతో
ప్రజలకిష్టులుగా కమ్యూనిష్టులుగా
అభ్యుదయవాదంతో రచనలు సాగించే
అరసం ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!

చీకటి రాజ్యాలనేలే వారిపై కన్నెర్ర చేస్తాం
ఎర్ర సూర్యులమై
ధగధగ మండుతూ కాల్చేస్తాం
అధోగతుల పాల్టేసే
ఆధిపత్యాల కూల్చేస్తాం
జనం బాగోగులను పట్టించుకోని వారిని
పేల్చే ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!

అన్యాయాలను ఎదిరించడం
అక్రమాలను ప్రశ్నించడం
అప్రజాస్వామ్యాలను నశింపజేయడం
లక్ష్యంగల ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!

జగతి ప్రగతికి అహర్నిశలూ
ఎర్ర సూర్యులమై నినదిస్తాం
ఆధిపత్యం ప్రపంచవ్యాప్తం పరిసమాప్తం
అరుణ పతాకమై రెపరెపలాడతాం
ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!
విజయం సాధించే వరకు
ఎత్తిన ఎర్రజెండాను
వంద వత్సరాలుగా దించని
అవిశ్రాంత యోధులం ఎర్రచీమలం!
ఔను! మేము ఎర్రచీమలం!!

**డా. రాపోలు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం,**
**9441779688**

# 'రైడ్‌రాజ్'..'టాక్స్ టెర్రరిజం' రహిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి

### బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు

**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించింది. మోదీ ప్రభుత్వ తిరోగమన విధానాలు భారతదేశంలోని పెట్టుబడి దారులలో విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేసిందని ధ్వజమెత్తింది. ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సులువైన వ్యాపార నిర్వహణను అసౌకర్యంగా మార్చాయని ఆరోపించింది. రానున్న ఎన్నికలలో 'రైడ్ రాజ్'ను, 'టాక్స్ టెర్రరిజాన్ని' నిర్మూలించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భారతీయ తయారీ రంగంలో ఉద్యోగాలను రక్షించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వేతనాలు, కొనుగోలు శక్తిని పెంచడానికి నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని కోరింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (ఇన్‌ఛార్జి, కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ మాట్లాడుతూ భారతదేశంలో సులభతరమైన వ్యాపారం మెరుగుపరచుకోవాలని మోదీ ప్రభుత్వం గత కొంతకాలంగా తన ఆకాంక్షను ప్రకటిస్తున్నదని, అయితే గత దశాబ్దకాలంలో ప్రైవేట్ పెట్టుబడులు తగ్గిపోవడం గమనార్హం అన్నారు.ఇది రికార్డు స్థాయికి పడిపోయిందన్నారు. కనిష్టస్థాయిలను నమోదు చేయడం భారతదేశం నుంచి విదేశీతీరాలకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన వ్యాపారవేత్తలనుంచి ఉపశమనం పొందడం జరుగుతోంది'. జిఎస్‌టి, ఆదాయపు పన్ను రెండింటినీ కవర్‌చేసే ఒక బైజాంటైన్ (ఇస్తాంబుల్) శిక్షాత్మక, ఏకపక్ష పన్ను విధానం ఇప్పుడు భారతదేశ శ్రేయస్సుకు గొప్ప ముప్పుగా పరిణమించింది. అంతేకాకుండా వ్యాపారనిర్వహణను అసౌకర్యంగా మార్చడానికి దోహదం చేసింది' అని జైరామ్ రమేష్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.పెట్టుబడిలో అతిపెద్దభాగమైన ప్రైవేట్ డొమెస్టిక్ పెట్టుబడి 2014నుండి బలహీనంగా ఉన్నదని, మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఇది స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) పరిధిలో2530 శాతం మాత్రమేనని జైరామ్ రమేష్ అన్నారు. గత దశాబ్ద కాలంలో ఇది 2025శాతం జిడిపి శ్రేణికి కుప్పకూలింది. పెట్టుబడులు మందగించిన నేపథ్యంలో అధిక నికరవిలువ వ్యక్తులు పెద్దయెత్తున వలసవెళ్లారు. గత దశాబ్దంలో దేశం నుంచి17.5లక్షల మందికి పైగా భారతీయులు ఇతర దేశాలకు తరలివెళ్లి అక్కడి పౌరసత్వం పొందడం శోచనీయమన్నారు. 2020నుంచి 2025వరకు 21,300 డాలర్‌మిలియనీర్లు భారతదేశాన్ని విడిచివెళ్లిపోయారని జైరామ్ రమేష్ మోదీ ప్రభుత్వాన్ని నిందించారు. ఇదంతా మూడు కారణాల వల్ల సంభవిస్తోంది. మొదటిది క్లిష్టతరమైన జిఎస్‌టి కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన సెస్సులు సహా మంచి, సరళమైన ట్యాక్స్ రేట్ల పేరుతో 100 వరకు ఉన్నటువంటి వివిధ రకాల ట్యాక్స్ రేట్లు వల్ల ఇదంతా జరుగుతోందన్నారు. రేట్లు అనేక రెట్లు పెరిగిన కారణంగా 2023 ఆర్థిక సంవత్సరంలతో రూ.1.01లక్షల కోట్లు ఉన్న జిఎస్‌టి ఎగవేత కాస్తా రూ.2.01లక్షల కోట్ల మేరకు జిఎస్‌టి ఎగవేత ప్రమాదకరస్థాయికి మారి గందరగోళం నెలకొందని జైరామ్ రమేష్ తెలియజేశారు. మోసపూరిత సంస్థలు 18,000 బయటపడ్డాయని, ఇంకా చాలా వరకు



గుర్తించబడలేదని ఆయన చెప్పారు. రెండవది, దీనికి విరుద్ధంగా వాదనలు ఉన్నప్పటికీ చైనీస్ దిగుమతిలో 20232024లో భారతదేశం రికార్డు స్థాయిలో 85బిలియన్ డాలర్ల వాణిజ్యలోటుతో నిరంతరం కొనసాగుతోందన్నారు. ఇది భారతీయ తయారీ రంగాన్ని ముఖ్యంగా కార్మిక ప్రోత్సాహక రంగాలను దెబ్బతీసిందని రమేష్ చెప్పారు. మూడవ అంశాన్ని ప్రస్తావిస్తూ బలహీనమైన వినియోగం, స్తబ్దుగా ఉన్న వేతనాలు వ్యక్తిగతంగా ఉచితంగా అందుబాటులో ఉన్నప్పటికీ భారతదేశంలతో వినియోగ వృద్ధిని తగ్గించివేశాయన్నారు. తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో జైరామ్ రమేష్ పెట్టిన పోస్ట్‌లో ఆయన మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తిరోగమన విధానాలను ఎండగట్టారు. 202526సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం నేటి (జనవరి 19)నుంచి 13రోజులలో సమర్పించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించింది.

## పోలింగ్ ప్రక్రియలో ఇసి చిత్తశుద్ధి,నిబద్ధత

### మన్ కీ బాత్ లో ఎన్నికల సంఘానికి ప్రధాని మోదీ అభినందనలు



**న్యూఢిల్లీ:** న్యాయబద్ధంగా పోలింగ్ ప్రక్రియ నడిపించేందుకు ఎన్నికల సంఘం చిత్తశుద్ధి నిబద్ధత ప్రదర్శిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. ప్రజల అధికారాన్ని పటిష్టం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞాన శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకుంటున్నందుకు, అదేవిధంగా న్యాయబద్ధమైన పోలింగ్ ప్రక్రియలో చిత్తశుద్ధి–నిబద్ధత చూపిస్తున్నందుకు ఎన్నికల సంఘంపై మోదీ ప్రశంసలు కురిపించారు. ఆకాశవాణి, దూరదర్శన్ ఆదివారం ఉదయం ప్రసారం చేసిన నరేంద్రమోదీ ''మన్ కీ బాత్'' నెలవారీ కార్యక్రమంలో ఎన్నికల సంఘాన్ని ఆయన ప్రశంసల్లో ముంచెత్తారు. కొత్త సంవత్సరంలో ప్రసారమైన మోదీ మొదటి ''మన్ కీ బాత్'' కార్యక్రమం ఇదే. 1961 నాటి ఎన్నికల నిబంధనలకు చేసిన సవరణలపై ప్రతిపక్షాలు ఇటీవల తరచు విమర్శలు చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విశ్వసనీయతను, ఎన్నికల సంఘం చిత్తశుద్ధిని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల సంఘం బిజెపి అనుకూలంగా వివక్ష చూపిస్తోందని ప్రతిపక్షాలు తరచు విమర్శలు చేస్తున్నాయి. ఈ పూర్వరంగంలో మరో ఆరు రోజుల్లో (జనవరి 25వ తేదీన) రానున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్ కీ బాత్ ప్రసంగంలో ఎన్నికల సంఘం పనితీరును మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. ఈ ప్రశంసల ద్వారా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పరోక్షంగా ఆయన సమర్థించారు.
జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందనీ, ఆ రోజున భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిందనీ మోదీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘానికి అంతకు సమానంగా ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యానికీ భారత రాజ్యాంగ రూపకర్తలు ఎంతో ప్రముఖస్థానాన్ని ఇచ్చారని మోదీ అన్నారు. ''మొదటిసారి 1951–52 లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం అసలు బతికిబట్టకదుతుందా? అని కొంత మంది సందేహం వ్యక్తం చేశారు, కానీ ఈ భయాలన్నీ అసత్యాలని మన ప్రజాస్వామ్యం రుజువు చేసింది, వీటన్నింటి తర్వాత భారతదేశం ప్రజాస్వామ్యానికి మాతృమూర్తిగా మారింది'' అని మోదీ అన్నారు. ''గడచిన దశాబ్దాలలో దేశ ప్రజాస్వామ్యం పటిష్టవంతమైంది, ప్రగతి సాధించింది, అందువల్ల ఎన్నికల సంఘానికి నేను నా కృజ్ఞతలు తెలియజేయదలచుకున్నాను, ఎప్పటికప్పుడు మన ఎన్నికల ప్రక్రియను ఎన్నికల సంఘం ఆధునీకరిస్తున్నది, న్యాయబద్ధంగా అరమరికలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు కేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తన చిత్తశుద్ధిని ప్రదర్శిస్తున్నది'' అన్నారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉందనీ, ఈ ఏడాది 75వ గణతంత్ర దినోత్సవాన్ని దేశం చేసుకుంటున్నదనీ, రాజ్యాంగ అసెంబ్లీలో సభ్యులుగా పనిచేసిన ప్రముఖులందరికీ తాను వందనాలు చెబుతున్నాననీ అన్నారు. అంతరిక్ష రంగంలో ఈ ఏడాది భారత్ గొప్ప విజయాలు సాధిస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత పెరిగిందన్నారు. అంతరిక్షంలో మొక్కలు మొలిపించేందుకు, ఆకులు విరబూయించేందుకు మన శాస్త్రవేత్తలు విజయవంతమైన కృషి చేశారన్నారు. భవిష్యత్తులో గగన్‌యాన్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కులమతాలకు అతీతంగా ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో ప్రజలు పాల్గొంటున్నారన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ కుంభమేళా ప్రతి భారతీయుడికీ గర్వకారణమని అన్నారు. ఈనెల 23న సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయనకు స్మరించుకున్నారు.

## సిఆర్‌పిఎఫ్ డిజిగా జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్ నియామకం



**న్యూఢిల్లీ :** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా అసోం పోలీస్ చీఫ్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది మంత్రిత్వశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన సింగ్ అసోం– మేఘాలయ కేడర్‌కు చెందిన వారు. సిఆర్‌పిఎఫ్ డిజిగా సింగ్ నియామకాన్ని కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదించింది. దీంతో సింగ్ ఈనెల 18వ తేదీ నుంచి నవంబరు 30, 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు. డిసెంబర్ 31, 2024న అనిష్ దయాల్ సింగ్ పదవీ విరమణ చేసిన తర్వాత సీనియర్ ఐపిఎస్ అధికారి వితుల్ కుమార్ దళానికి అధికారిక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## పడవ మునక ముగ్గురు మృతి

### నలుగురు గల్లంతు

**కతిహార్ :** బీహార్ కతిహార్ జిల్లాలోని గంగానదిలో పడవ మునిగిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గల్లంతయినట్లు అధికారులు తెలిపారు. 17 మందితో ప్రయాణిస్తున్న పడవ అహ్మదాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ సమీపంలో మునిగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం నుంచి పది మంది సురక్షితంగా బయటపడ్డారన్నారు. అందులో అత్యధికులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరారని చెప్పారు. గల్లంతయిన నలుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తుకు ఆదేశించామని జిల్లా మేజిస్ట్రేట్ మనీష్ కుమార్ మీనా మీడియాకు తెలిపారు. బాధితుల్లో ఇద్దరిని పవన్‌కుమార్ (60), సుధీర్ మండల్ (70)గా గుర్తించారు. మరో వ్యక్తిని గుర్తించాల్సి ఉంది.

## కేజ్రీవాల్ కాన్వాయ్‌పై దాడి... బిజెపి గూండాల పనే : ఆతిశీ



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ స్పందించారు. ఈ దాడి బిజెపి గూండాల పనేనని ఆరోపించారు. దాడి చేసిన వారికి ఆ పార్టీకి చెందిన వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. రోహిత్ త్యాగి, సాంకీ అనే ఇద్దరి వ్యక్తుల ఫొటోలను అతిశీ విడుదల చేశారు. వారే ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. శనివారం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. కాషాయ పార్టీకి చెందిన గూండాలు ఈ దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడిన రాహుల్ అలియాస్ సాంకీకి బిజెపి నేత పర్వేశ్ వర్మతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయన ప్రచారంలోనూ దుండగుడు పాల్గొన్నాడు. అతడిపై హత్యాయత్నం, దోపిడీ వంటి అనేక కేసులున్నాయి. అలాంటి నేరస్థులను కేజ్రీవాల్‌పై దాడికి పంపించినట్లు స్పష్టమవుతోంది. పర్వేశ్ వర్మతో రోహిత్ త్యాగి దిగిన ఫొటోలు ఉన్నాయి. అతడిపైనా తీవ్ర నేరారోపణలు ఉన్నాయి అని అతిశీ ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. అదే సమయంలో కొందరు దుండగులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. ఓటమి భయంతోనే బిజెపి ఈదాడికి పాల్పడినట్లు ఆప్ ఆరోపించింది.

## యుపిఎస్‌సి పరీక్ష పిటిషన్‌పై సహాయం చేసేందుకు 'అమికస్ క్యూరీ'

**న్యూఢిల్లీ :** సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన సమాధానాల 'కీ'లు, మార్కులను వెల్లడించాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)ని ఆదేశించాలని కోరుతూ పలువురు సివిల్ సర్వీస్ ఔత్సాహికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సహాయం చేసేందుకు సుప్రీం కోర్టు అమికస్ క్యూరీని నియమించింది. 2023 సివిల్ సర్వీస్ (ప్రిలిమినరీ) పరీక్ష సహా దాదాపు అన్ని పూర్వ పరీక్షలలో యుపిఎస్‌సి మార్కులు, కట్ ఆఫ్ మార్కులను నిర్వహించి మొత్తం పరీక్ష ప్రక్రియ ముగిసినప్పుడు మాత్రమే సమాధానాల 'కీ'లు బహిర్గతం చేసేది. న్యాయమూర్తులు పిఎస్.నరసింహ, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సీనియర్ అడ్వకేట్ జైదీప్ గుప్తాను ఈ విషయంలో సహకరించేందుకు అమికస్ క్యూరీగా నియమించింది. పిటీషన్ కాపీని తమకు అందజేయాలని పిటిషనర్లను కోరింది. ఈ విషయంలో కోర్టుకు 'అమికస్ క్యూరీ'గా సహకరించాలని కోర్టు ముందున్న సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తాను మేం అభ్యర్థించాం. గుప్తా దీనిని దయతో అంగీకరించారు అని ధర్మాసనం జనవరి 15నాటి ఆర్డర్‌లో వెల్లడించింది. విచారణ సందర్భంగా 17మంది యుపిఎస్‌సికి చెందిన 17మంది ఆశావహుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ బహిర్గతం చేయని యుపిఎస్‌సి ప్రవర్తనలో పారదర్శకత లోపించిందని అన్నారు.

## 'ఇండియన్ స్టేట్' వ్యాఖ్యలకు రాహుల్‌పై ఎఫ్‌ఐఆర్



**న్యూఢిల్లీ :** దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందంటూ కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయనపై అసోంలోని గువహటి పాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. రాహుల్ వ్యాఖ్యలు దేశ సార్వభౌమాధికారానికి, ఐక్యత, దేశ సమగ్రతకు ప్రమాదకరం కలిగి స్థాయని పేర్కొంటూ భారతీయ న్యాయసంహిత లోని 152, 197(1) సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదైంది. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దేశంతో పోరాటం సాగిస్తున్నామని ప్రకటించడం ద్వారా నిందితుడు ఉద్దేశపూర్వకంగానే విచ్ఛిన్నకర శక్తులను, ప్రజలపై తిరుగుబాటు చర్యలను రెచ్చగొట్టినట్టే అని ఫిర్యాదుదారు ఆరోపించారు. వరుస వైఫల్యాలతో నైరాశ్యంతోనే రాహుల్ ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగారన్నారు. ప్రజాస్వామ్య విధానాల ద్వారా ప్రజా విశ్వాసం పొందలేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ స్టేట్‌పై అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. విపక్ష నేతగా ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసాన్ని పెంపొందించాల్సిన నేత.. ఇందుకు బదులుగా తన హోదాను దుర్వినియోగం చేసుకుంటూ తప్పుడు ప్రచారం, తిరుగుబాటు చర్యలకు పాల్పడటం దేశ సమగ్రత, సార్వభౌమాధికారానికి ముప్పు అని తన ఫిర్యాదులో చాటియా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ గత బుధవారంనాడు న్యూఢిల్లీలో నూతన కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, నిజమైన స్వాతంత్ర్యంపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని, తాము ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపితో పాటు భారతదేశంపై కూడా పోరాడుతున్నామని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు విమర్శల దాడికి దిగారు. దేశంతో పోరాడుతున్నామంటూ చెప్పడం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపం ఇప్పుడు బయటపడిందని బిజెపి ధ్వజమెత్తింది.

## మహాకుంభమేళాలో అగ్నిప్రమాదం



**ప్రయోగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. సెక్టార్ 19లోని గుడారాల్లో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో 18 టెంట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. దగ్ధమైన 18 టెంట్లలో మంటలను అదుపు చేయడానికి 15 అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దించినట్లు కుంభమేళా చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రమోద్ శర్మ తెలిపారు. కొంత సమయం తరువాత మంటలు అదుపులోకి వచ్చాయని, ఆ ప్రాంతంలో పరిస్థితి అదుపులో ఉందని శర్మ తెలిపారు. ముందుగా, మహా కుంభమేళాలోని సెక్టార్ 19లో రెండు ఎల్‌పిజి సిలిండర్లు పేలిపోయాయని, శిబిరాల్లో పెద్ద అగ్నిప్రమాదం జరిగిందని అఖారా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి భాస్కర్ మిశ్రా తెలిపారు. సీనియర్ అధికారులు అక్కడికక్కడే ఉండగా, అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పగలిగాయని ప్రభుత్వం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఘటనపట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు మహాకుంభమేళా నిర్వాహకులు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అధికార యంత్రాంగం తక్షణ సహాయ, సహాయ చర్యలను అందిస్తోందని, అందరి భద్రత కోసం తాము గంగా మాతను ప్రార్థిస్తున్నామని ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రభావిత ప్రాంతం నుండి దట్టమైన నల్లటి పొగ ఆకాశాన్నంటుతున్న క్లిప్‌ను కూడా షేర్ చేశారు.

# భూములిస్తే ఇళ్లు కట్టిస్తా..

### ప్రధాని మోదీకి కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ : ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం సంయుక్త గృహ నిర్మాణ పథకాన్ని ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేజ్రీవాల్ మోదీకి లేఖ రాయడం గమనార్హం. కాగా, ఆదివారం కేజ్రీవాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఢిల్లీ ప్రభుత్వానికి అత్యధిక సబ్సిడీ రేట్లకు భూమిని కేటాయించాలని ప్రధాని మోదీని కోరనన్నారు. అందులో ఉద్యోగుల కోసం ఇళ్లు నిర్మించ వచ్చన్నారు. వారి చివరి దశ సర్వీసు కాలం వరకు వాయిదాలు చెల్లించేందుకు సులభమవుతుందన్నారు. పదవీ విరమణ తరువాత ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేజ్రీవాల్ లేవనెత్తారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పదవీ విరమణ తరువాత ఉద్యోగులు సౌకర్యవంతంగా, గౌరవంగా జీవించేందుకు జాయింట్ గృహ నిర్మాణ పథకాన్ని ప్రతిపాదించానని చెప్పారు. ఈ పథకం ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంసిడి, ఎన్‌డిఎంసి ఉద్యోగులకు అమలు చేసి, ఆ తరువాత ఢిల్లీ వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు అమల చేయవచ్చని కేజ్రీవాల్ తెలిపారు. కేజ్రీవాల్ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం ఎన్‌డిఎంసి పరిధిలో ఉండడం విశేషం. కాగా, ఢిల్లీ ప్రభుత్వానికి సొంతంగా భూమి లేదని అందువల్ల కేంద్ర ప్రభుత్వం సమకూరిస్తే ఎన్నికల అనంతరం అధికారంలోకి రాగానే ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆప్ సుప్రీం పేర్కొన్నారు. ఢిల్లీలో ముఖ్యంగా పేదలకు ఇళ్ల సమస్య



అతి పెద్దదిగా మారింది. సొంత ఇళ్లు కట్టుకోవడం లేదా అద్దెకు తీసుకోవడం దాదాపు అసాధ్యంగా మారిందన్నారు. ఇళ్లు అద్దెకు తీసుకునేందుకు గానీ, సొంత ఇళ్లు కొనుగోలు చేసేందుకు గానీ ఉద్యోగుల పెన్షన్ సరిపోదన్నారు. పదవీ విరమణ తరువాత మురికివాడల్లో సఫాయి కర్మచారాలు నివసించడాన్ని తాను స్వతహాగా చూశానన్నారు. అందువల్ల ఈ పథకానికి చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశానన్నారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకమైనందున మోదీ అంగీకరిస్తారని ఆశిస్తున్నానని కేజ్రీవాల్ చెప్పారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ఇప్పటి వరకు ఆప్ 9 వాగ్దానాలు చేసింది.

**మరోసారి డాక్యుమెంటరీ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు...**

అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పార్టీ నాయకుల అరెస్టు ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించడాన్ని మరోసారి ఢిల్లీ పోలీసులు అడ్డుకునే యత్నం చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. అయితే, అన్‌బ్రేకబుల్ డాక్యుమెంటరీని ప్రదర్శించడానికి పార్టీ అనుమతి కోరలేదని, నగరంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు కారణంగా దీనిని అనుమతించలేమని శనివారం పోలీసులు ప్రకటించిన విషయం విదితమే. ఆప్ రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, డాక్యుమెంటరీ ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి పోలీసులు అనుమతి నిరాకరించారని చెప్పారు. ఏ నియమం ప్రకారం అనుమతి నిరాకరించారో తాను ఎన్నికల సంఘాన్ని అడగాలనుకుంటున్నానన్నారు. బహిరంగ సభ, ఎన్నికల ప్రచారం లేదా ఓటు కోసం విజ్ఞప్తి చేయబోవడం లేదన్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో వినూత్న 'పబ్లిసిటీ స్టంట్స్' !

- పోటాపోటీగా ఆప్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు సృజనాత్మక వస్తువుల ఆర్డర్లు
- టీషర్ట్స్, ఫంకీ సన్‌గ్లాసెస్, టోపీలపై మోదీ, కేజ్రీవాల్ చిత్రాలు, పార్టీ పేర్లు, సంతకాలు ప్రింట్
- ఆర్డర్లు, కొనుగోళ్ల కోసం సదర్‌బజార్‌లో 'క్యూలు'

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం తీవ్రస్థాయికి చేరుకుంది. ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయపార్టీలు అధునాతన వస్తువుల బహుకరణ ఎరవేసేందుకు పోటీపడుతున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనునాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడబోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయపార్టీలైన ఆమ్ ఆద్మీపార్టీ (అధికార ప్రభుత్వం), బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను ఆకర్షించేలా, వాటిని వారు ఉపయోగించడానికి అనువైనరీతిలోనే కాకుండా ఎన్నికల ప్రచారానికి కూడా ఉపయోగపడేలా అధునాతన వస్తువుల సృజనాత్మక తయారీకి వ్యాపారపరమైన ఆర్డర్లు ఇవ్వడంలో తలమునకలయ్యాయి. ఓటర్ల ఊహలకు అనుగుణంగా వారిని ఆకర్షించేలా చమత్కారమైన క్యాచ్ ఫ్రేజెస్, వన్ లైనర్లతో సృజనాత్మకంగా రూపొందించిన వస్తువులను డిజైన్‌చేసేందుకు సంబంధిత వ్యాపారులకు ఆర్డర్లు ఇస్తున్నారు. శీతాకాలానికి అనుకూలమైన హూడీలు, రంగురంగుల స్టోల్స్, టీషర్టులు, స్కార్ఫ్స్ , ఫంకీ సన్‌గ్లాసెస్, కీచైన్లు, కస్టమ్ మేడ్ కార్ ఫ్లాగ్స్, కటౌట్లు, పెన్నులు, పోస్టర్లు, మౌజ్‌ప్యాడ్లను ఓటర్లు, పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.'పార్టీ లోగోలు, నినాదాలతో అలంకరించబడిన ఈ అధునాతన వస్తువులను కేవలం ప్రచారసాధనాలుగా వినియోగించడానికి మాత్రమే కాదు. మద్దతుదారులను మరింత వ్యక్తిగతంగా, శక్తివంతమైన రీతిలో నిమగ్నం చేయడానికి కూడా ఇది ఒక మార్గం'అని నాయకుడు ఒకరు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ హూడీలు, స్టోల్స్ పై వారి సంతకం, నీలం, పసుపు రంగులో వస్తాయి. ఆర్డర్లు ఇచ్చిన ఈ వస్తువుల ముందుభాగాన ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ముఖం, వెనకభాగాన పార్టీ లోగో వస్తాయి. ఇన్‌స్టంట్‌గా తయారుచేసిన అధునాతన వస్తువులు తయారీచేయబడి బయటకు వస్తాయి అని సదర్‌బజార్‌లో ఉండే ఒక కీలక సరఫరాదారు విక్రమ్ చెప్పారు. ఆమ్ ఆద్మీపార్టీ తరపు కస్టమర్లు కీచైన్లు, రిస్ట్‌బ్యాండ్‌లు, బ్యాడ్జీలు, కారు ఫ్లాగ్స్ ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. 'మేం ర్యాలీలలో ఉపయోగించేందుకు 2,000నుంచి 2,500వరకు పెద్ద ఫ్లాగ్స్‌ను, 5,000మేరకు చిన్న ఫ్లాగ్స్‌ను ' తయారు చేస్తున్నాం' అని విక్రమ్ చెప్పారు. వాటి ధర అనేది వారు ఆర్డరు ఇచ్చిన వస్తువుల సైజ్ ఆధారంగా ఉంటుందని తెలియజేశారు. ప్రారంభధర తక్కువ మొత్తంలో రూ.2.5లక్షల నుంచి ఉంటుందని, ఒక్కో వస్తువుకు రూ.165ధర పలుకుతుందని చెప్పారు. భారతీయ జనతా పార్టీ ప్రచారంలో చమత్కారాన్ని జోడించింది. ఫంకీ ఆరెంజ్ సన్‌గ్లాసెస్‌పైన తెలుపురంగులో పార్టీ పేరు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. నరేంద్రమోదీ చిత్రాలను కలిగి ఉన్నటువంటి టీషర్ట్‌లను బిజెపి ఆర్డర్ చేసింది. కాగా కాంగ్రెస్ పార్టీ వినియోగవస్తువుల వైపే మొగ్గు చూపుతోంది.పార్టీ గుర్తు ఉన్నటువంటి మౌజ్ ప్యాడ్లు, పెన్నులు, కీచెయిన్లపై పార్టీ సింబల్ ఉండేలా పెద్దయెత్తున ఆర్డర్లు ఇచ్చిందని ఒక అమ్మకందారు చెప్పారు. సప్లయర్లు 60శాతం పెరుగుదలను నివేదించడంతో గత కొన్నివారాలుగా రాజకీయ వస్తువులకు డిమాండ్ బాగా పెరిగిందని, ఎన్నికల సీజన్ అంతా మాకు అత్యంత రద్దీ తాకిడి ఉంటుందని. ఈ సమయంలోనే మేం ఎంతో బిజీగా ఉంటామని, కాలంతో పోటీపడతామని సదర్‌బజార్‌కు చెందిన సప్లయర్ అనిల్ సేథీ చెప్పారు. ఈ ఏడాది ప్రచార వస్తువుల తయారీలో అత్యంత సృజనాత్మకత, వైవిధ్యం అసాధారణంగా ఉన్నాయని సేథీ తెలియజేశారు. నామినేషన్లు, ర్యాలీల కోసం అభ్యర్థులు ప్రజలు, అభ్యర్థులు రాజకీయ పార్టీల కండువాలు, దండలు, జెండాలు, మరెన్నో వస్తువులను భారీ సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ర్యాలీల సందర్భంగా టీషర్ట్‌లు, టోపీలు, పోస్టర్లు, బ్యానర్లు, పార్టీ సింబల్ కటౌట్లు, నాయకుల ఫేస్ కటౌట్లకు అధికమొత్తంలో డిమాండ్ ఉందని అనిల్‌సేథీ వివరించారు.




## సైఫ్‌పై దాడి నిందితుడికి 5 రోజుల పోలీస్ కస్టడీ



**ముంబయి :** సైఫ్ అలీఖాన్‌పై ముంబయి నివాసంలో దాడికి పాల్పడిన నిందితుడికి ముంబై కోర్టు జనవరి 24వ తేదీ వరకూ పోలీస్ కస్టడీ విధించింది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు నిందితుడిని బాంద్రాలోని హాలిడే కోర్టు ముందు ముంబై పోలీసులు హాజరుపరిచారు. ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున దొంగతనం కోసం ముంబై బాంద్రా ఏరియాలోని సైఫ్ ఇంట్లోకి అడుగుపెట్టిన నిందితుడు ఆ క్రమంలోనే సైఫ్‌పై పదునైన బ్లేడుతో పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. శరీరంపై ఏడు చోట్ల గాయాలైన సైఫ్ ఆ వెంటనే నగరంలోని లీలావతి ఆసుపత్రిలో చేరారు. అక్కడే ఆయనకు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం లేదని వైద్యులు ప్రకటించారు. నిందితుడి కోసం గాలించిన ముంబై పోలీసులు థానే జిల్లాలోని హీరానందని ఎస్టేట్ వద్ద అతన్ని ఆదివారం ఉదయం పట్టుకున్నారు. నిందితుడిని బంగ్లాదేశ్‌కు చెందిన మహమ్మద్ షరిఫుల్ ఇస్లాం షెహజాద్‌గా గుర్తించామన్నారు. అతను బిజాయ్ దాస్‌గా పేరు మార్చుకుని ఇండియాలోకి అడుగుపెట్టినట్టు తెలిపారు. చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ ఐదు నెలల నుంచి ముంబైలో ఉన్నట్టు చెప్పారు. కాగా, నిందితుడు బంగ్లాదేశ్ పౌరుడని పోలీసులు చెప్పడాన్ని బిజాయ్ దాస్ తరపు న్యాయవాది తోసిపుచ్చారు. తన క్లయింట్ ఆరు నెలల క్రితం ఇక్కడక వచ్చినట్టు పోలీసులు చెప్పిన కథనంలో నిజం లేదని. ఏడేళ్లుగా అతని థానేలో తన కుటుంబ సభ్యులతో ఉంటున్నాడని చెప్పారు. ఇది పూర్తిగా 43ఎ ఉల్లంఘన కిందకు వస్తుందని, సరైన ఇన్వెస్టిగేషన్ జరగలేదని తెలిపారు. తన క్లయింట్‌కు 5 రోజుల పోలీస్ కస్టడీ విధించినట్టు చెప్పారు. ఇదే సమయంలో నిందితుడికి సంబంధించిన నివేదిక 5 రోజుల్లో సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించిందని తెలిపారు.

## అగ్నిప్రమాదంలో నలుగురు మృతి



**ఘజియాబాద్ :** ఆదివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా ఘజియాబాద్‌లోని ఒక ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు సహా నలుగురు నిద్రలో సజీవ దహనం అయ్యారని అధికారులు తెలిపారు. లోనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాంచన్ పార్క్ ప్రాంతంలోని బహుళ అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. ఉదయం 7.06 గంటలకు లోనీ అగ్నిమాపక కేంద్రానికి ఈ సంఘటన గురించి సమాచారం అందిందని, మూడు అగ్నిమాపక యంత్రాలు సేవలందించాయని అగ్నిమాపక శాఖ తెలిపింది. స్థలానికి చేరుకున్న తర్వాత, ఇంటి రెండవ, మూడవ అంతస్తులలో మంటలు చెలరేగాయని, ప్రజలు లోపల చిక్కుకున్నారని తేలింది. ఇల్లు రద్దీగా ఉండే లేన్‌లో ఉంది, అందువల్ల అగ్నిమాపక యంత్రాలను బయట నిలిపి ఉంచారు. ఇరుకైన మెట్లు, ఇంట్లోని పొగ వల్ల పైకి వెళ్లడం కష్టమైందని, ఇంటి గోడలు విరిగిపోయాయని, పక్కనే ఉన్న ఇళ్ల ద్వారా గొట్టం పైపుల ద్వారా నీటిని చల్లడం ప్రారంభించారని అగ్నిమాపక శాఖ తెలిపింది. భవనం టెర్రస్‌పై నలుగురు వ్యక్తులు కనిపించారు. వారిలో ఇద్దరు ఆయేషా, ఆమె నాలుగేళ్ల కుమారుడు అయాన్ గాయపడగా, మిగిలిన ఇద్దరు షానవాజ్, షంషాద్‌లను సురక్షితంగా బయటకు వచ్చారని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పిన తర్వాత, అగ్నిమాపక సిబ్బంది ఇంటి లోపల నాలుగు మృతదేహాలను కనుగొన్నారని చీఫ్ ఫైర్ ఆఫీసర్ రాహుల్ పిటిఐకి తెలిపారు. బాధితులను షానవాజ్ భార్య గుల్బహర్, వారి ఇద్దరు మైనర్ కుమారులు, అదే ఇంట్లో నివసించే వారి బంధువులలో ఒకరి కుమారుడుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.



## సిఎం సహాయనిధి అండ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఆపదలో ఉన్న వారికి సిఎం సహాయనిధి అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాట అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని పలువురికి సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలు కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సిఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆరోగ్యం పట్ల పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సిఎం సహాయనిధి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాంమూర్తి యాదవ్, ధరావత్ వెంకన్న నాయక్, కౌన్సిలర్లు ఎండి షఫిఉల్లా, వెలుగు వెంకన్న, నాయకులు గట్టు శ్రీనివాస్, వల్దాస్ దేవేందర్, అరవింద్ రెడ్డి, కరుణాకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

## ఫౌండేషన్ స్థాపించడం అభినందనీయం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మంచి సమాజాన్ని తయారు చేద్దామనే ఉద్దేశ్యంలో జనయేత్రి ఫౌండేషన్‌ను స్థాపించడం అభినందనీయమని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని రామచంద్రగూడెం ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనయేత్రి ఫౌండేషన్ చతుర్థ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. జనయేత్రి ఫౌండేషన్ మంచి రిజల్ట్ సాధించాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ షీటీం సహకారంతో సేవలందించడం చాలా సంతోషకరమన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫౌండేషన్‌కు పోలీసుల సహకారం ఉంటుందన్నారు. అదేవిధంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, వైషమ్యాలకు తావు లేకుండా, సహృదయంతో సేవానిరతిని పాటిస్తూ నిస్వార్థంగా పేదలకు, విద్యార్థులకు, రోగులకు, అభాగ్యులకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, సాజిదాఖాన్, నర్ర లక్ష్మీ సామ్రాజ్యం, చలమల హైమావతి, అజ్మత్‌ఖాన్, చిలివేలు శంకర్, హమీద్, జాడి రాజు, బాలాజీ, తులసీరామ్, నాగుర్, వెంకట్రామ్‌నాయక్ పాల్గొన్నారు.

## ప్రజల పక్షమే 'ప్రజాపక్షం'



**ప్రజాక్షం/చింతపల్లి :** ప్రజలతో మమేకమై, ప్రతి నిత్యం ప్రజా సమస్యలు వెలికి తీస్తూ ప్రజలపక్షం వహించే పత్రిక ప్రజాపక్షం జాతీయ దిన పత్రిక అని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పుల దావలయ్య అన్నారు. మండల పరిధిలోని వింజమూరు గ్రామంలో ఆదివారం ప్రజాపక్షం పత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దావలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా పని చేసి, ప్రజాసమస్యలు పరిష్కరించుటకు కృషి చేయాలన్నారు. కొద్దికాలంలోనే ప్రజాపక్షం పత్రిక ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెకంటి రామకృష్ణ, ఏర్పుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డ నర్సయ్య సేవలు చిరస్మరణీయం




**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ దొడ్డ నర్సయ్య పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లులు అన్నారు. ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డ నర్సయ్య 26వ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఖార్సైన కమ్యూనిస్టు యోధుడు, పేదల పెన్నిధి దొడ్డ నర్సయ్య అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సిపిఐ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్‌కె సాయిబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, కొండల్, అలివేలు పాల్గొన్నారు.

## అర్హతలు ఉన్న వారందరికీ పథకాలు

**ప్రజాపక్షం/ ఉండవల్లి :** అర్హతలు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతాయని మండల అభివృద్ధి అధికారి తిరుపతన్న అన్నారు. ఈనెల 21 నుంచి గ్రామసభల ద్వారా రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా ఆత్మీయ భరోసా అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు లేని వారందరికీ ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ప్రభుత్వాన్ని బంధనల మేరకు రేషన్ కార్డు. ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని తెలిపారు. ఇప్పటివరకు ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న వారికే కాక మళ్లీ దరఖాస్తులు గ్రామ సభలు అందజేయొచ్చని కూడా తీసుకొని పరిశీల నిమిత్తం అర్హతలు ఉన్న వారికి అందజేస్తామని తెలిపారు. దూర ప్రాంతాలు ఉన్న వారికి కూడా సభల ద్వారా ప్రజల అంగీకారం మేరకు తుది నిర్ణయము తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 24 వరకు మండంలోని అన్ని గ్రామ పంచాయతీలోనూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండలంలోని నాలుగు టీమ్ల ద్వారా 16 గ్రామపంచాయతీలో నూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హతలు ఉన్న ప్రతి వారి కూడా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరికృష్ణ ,డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ వ్యవసాయ అధికారి అనిత పశువైద్యాధికారి శిరీష పాల్గొన్నారు.

## ఎఐటియుసిలో 100 మంది టిప్పర్ లారీ డ్రైవర్లు చేరిక

### ఎఐటియుసి బలోపేతానికి కార్మికులు కృషి చేయాలి : మేకల శ్రీనివాస రావు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఎఐటియుసి బలోపేతానికి కార్మికులు కృషి చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఎఐటియుసి ప్రాంతీయ అధ్యక్షులు దంతాల రాంబాబు అధ్యక్షతన టిప్పర్ లారీ డ్రైవర్లు 100 మంది ఎఐటియుసిలో చేరారు. వారికి ఎఐటియుసి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి సాధించిన 42 కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సవరణల పేరుతో రద్దు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. సింగరేణి కార్మికులను ప్రభత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలు, అదాని, అంబానీ సంస్థల బాగు కోసం కార్మిక చట్టాలను సవరణలు చేయడంతో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్ల వెంట తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి పోరాట ఫలితమే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు ఎండి జానీమియా శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం నాయక్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ప్రాంతీయ గౌరవ అధ్యక్షులు




చామల అశోక్ కుమార్, ఎండి జానీమియా, గాలి కృష్ణ, తాళ్ళ సైదులు, టిప్పర్ లారీ డ్రైవర్స్ నరేష్, నాగరాజు, లింగస్వామి, యాదగిరి, కృష్ణ, పాషా, బ్రహ్మచారి, సైదులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం పూర్తిస్థాయి అమలుపై పోరాటం

### ఎమ్మెల్సీ కోదండరాం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** భారత స్వాతంత్ర సంగ్రామ ఆంక్షల ప్రతిబింభమే భారత రాజ్యాంగమని ఆ భారత రాజ్యాంగం పూర్తి స్థాయి అమలు కోసం మరో పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 75 సంవత్సరాల భారత రాజ్యాంగం గమ్యం, గమనంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఉపన్యసించారు. భారత రాజ్యాంగం ప్రతి ఆర్టికల్ ఎంతో శాస్త్రీయంగా, మేధోమథనంతో చర్చలు జరిపి తయారు చేసుకున్నదని చెప్పారు. ఈ రోజు దేశంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం అందుబాటులో తీసుకవచ్చేందుకు ఇచ్చిన ఒక అల్టిమెటమే భారత రాజ్యాంగమని అన్నారు. కొంత మంది ఈ రాజ్యాంగం జీవన ఆధార గ్రంథమైతే అవినీతి పాలకులకు ఇది ప్రతిబంధకంగా మారిందని అందుకే ఈ అవినీతి పాలకులు రాజ్యాంగం మార్చడానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగం జీవించే హక్కుతో పాటు అన్ని రకాల స్వేచ్ఛను, రాజకీయ, ఆర్థిక సమానత్వాన్ని వాగ్దానం




చేసిందని దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మరో వక్త సెంటర్ ఫర్ దళిత్ స్టడి చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఏ ఒక్కరికి సంబంధించిన వ్యక్తి కాదని భారత దేశ చారిత్రాత్మక పరిణామాలను, వివిధ రకాల వ్యవస్థలను అధ్యానం చేసి ప్రజలందరికి న్యాయం జరిగేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఈ రోజు ఇన్ని సెక్షన్ల ప్రజానికం అనుభవిస్తున్న ఓటు హక్కు అనేది అంబేద్కర్ ఎంతో సాహసంతో రాజ్యాంగంలో పొందుపర్చిన అంశం అన్నారు. ఆర్టికల్ 3 మూలంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్న విషయాన్ని మరచిపోవదన్నారు. మండల్ కమిషన్ లాంటి కమిషన్లను ఏర్పాటు చేసుకునే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. దీంతోనే బిసి రిజర్వేషన్లు ఈ మేరకన్న అమలు అవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్సార్ న్యాయశాస్త్ర ఆచార్యులు మాడభూషి శ్రీధర్, కుంట్ల ధర్మార్జున్, తండు నాగరాజు గౌడ్, కిరణ్ ముదిరాజ్, కుంచం చంద్రశేఖర్, ఎం గోపి పాల్గొన్నారు.




## త్రిబుల్ రైడింగ్ చేస్తే కఠినచర్యలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ద్విచక్రవాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనదారులను ఆపి అవగాహన కల్పించారు. త్రిబుల్ రైడింగ్ ద్వారా జరిగే ప్రమాదాలు గురించి వివరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. యువత త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, హెల్మెంట్ ధరించకుండా డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు జరిగి ఉజ్వల భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డుభద్రత నిబంధనలను పాటించాలన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆదివారం పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖ్ గ్రామం, చౌటుప్పల్‌లోని డి నాగారం, చౌటుప్పల్ మున్సిపాలిటీ, నారాయణపూర్ మండలంలోని కొత్లాపురం గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వివిధ పథకాల అమలు కోసం సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న తీరును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంబిస్తున్న విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. తప్పిదాలకు తావు లేకుండా నిర్దేశిత గడువు లోగా ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.సర్వే నెంబర్ లో రైతులకు సంబదించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందించిన సర్వే నెంబర్ లోని రైతులకు సంబంధించిన పట్టా భూములను అసైన్డ్ భూముల వివరాల నమోదు స్వయంగా చూసి పలు సూచనలు చేశారు. భూముల స్థితిని బట్టి రైతులకు ఇబ్బంది లేకుండా సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సాగుకు యోగ్యం కాని భూములకు రైతు భరోసా వర్తించదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నాలుగు పథకాలు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన అందరికి రేషన్ కార్డు అందజేయడం జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ప్రజా పాలల్లో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించడం జరు



గుతుందన్నారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుంది అన్నారు. గ్రామ సభలో, వార్డులో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటిని కూడ పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. పేదవాని సొంత ఇంటి కల నిజం చేయడం కోసం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ సభల ద్వారా ఈ నాలుగు పథకాల ప్రాథమిక అర్హుల ఎంపిక జరుగుతుందన్నా రు. నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకురే విధంగా పారదర్శకంగా ఈ సర్వే చేపట్టినట్టు తెలిపారు. అదే విధంగా ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పాల్గొన్నారు.



## నాణ్యత కలిగిన ఆభరణాలను సరసమైన ధరలకు అందించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వినియోగదారులకు నాణ్యత కలిగిన ఆభరణాలను సరసమైన ధరలకు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో లలిత జ్యువెలరీ షాపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణ, వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందుతుందని, ఇక్కడ అన్ని రకాల ప్రముఖ దుకాణాలు నెలకొల్పుతున్నారని, దీనిలో భాగంగా లలిత జ్యువెలరీ షాపు కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనేక రకాల మోడల్స్‌తో ఆభరణాలు లభించడం వల్ల ఈ ప్రాంత ప్రజలు హైద్రాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అదేవిధంగా లలిత జ్యువెలరీ ఎండీ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ షాపులో బంగారు నగపై తరుగులో రెండు శాతం, వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.6వేలు తగ్గింపు ఉందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్, కౌన్సిలర్ ఇలియాస్, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, గుడిపాటి శ్రీనివాస్, జైని ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఎన్‌ఆర్ఎస్ కళాశాల సహకారం అభినందనీయం

**ప్రజాపక్షం/కోదాడ:** వాలీబాల్ క్రీడాకారులకు కోదాడ ఎన్‌ఆర్ఎస్ ఐఐటి పౌండేషన్ కళాశాల వారు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో కళాశాల వారు అందించిన ఐదువేల రూపాయల గల వాలీబాల్స్‌ను క్రీడాకారులకు అందించి మాట్లాడారు. ఇటీవల సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం జట్టు తరుపున కెప్టెన్ వహించిన తురకసాయి రాజును శ్యామ్, వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమ బహుమతి సాధించిన ఎస్ పవిత్రులను వీరు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి సలీంషరీఫ్, ఎన్‌ఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మైహోం ఎస్టేట్ మేనేజర్లు చెరకు అశోక్, విష్ణువర్ధన్‌రావు, ఎస్ఐ కె.వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఖలీద్, మందా శ్రీనివాసరావు, సూర్యనారాయణ, పి.కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## రేపటినుండి నాలుగు రోజులపాటు గ్రామసభలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ప్రత్యేక పథకాలను ప్రవేశ పెడుతున్న సందర్భంగా ప్రజల్లో నెలకొన్న అనుమానాలు అపోహలను తొలగించేందుకు పథకాల అమలులో స్పష్టమైన లబ్ధి ఎంపికకు ప్రజల నుండి సహకారం కోరుతూ జనవరి 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు అనగా నాలుగు రోజులు ప్రతిరోజు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడునట్లు, మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, మండల అభివృద్ధి అధికారి భాస్కర్, రెవెన్యూ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీలవారీగా పట్టణ, మండల వ్యాప్తంగా ఏ వార్డులు, ఏ గ్రామాలలో గ్రామసభ నిర్వహించబడునో జాబితాను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నోటీస్ బోర్డ్ పై ఉంచారు. ఆయా తేదీలలో జరిగే గ్రామసభలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ రేషన్ కార్డులు సంబంధించిన వివరాలను గ్రామ సభ ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.అంతేకాకుండా ఎవరైనా ఏ పథకం కోసమైనా లబ్ధి చేకూరడం కోసం దరఖాస్తు చేసుకోవాలని భావిస్తే వారు గ్రామసభ లోనే ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలో వారి దరఖాస్తులు ఇచ్చి రసీదు పొందవచ్చనీ పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా దరఖాస్తు చేసుకున్న నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## బాల కార్మికులుగా పని చేయిస్తున్న యజమానులపై కేసులు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** చట్ట విరుద్ధంగా బాల కార్మికులుగా మార్చి పనిచేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై భాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచంపల్లి పట్టణంలో ఆయన దాడులు నిర్వహించి టీవరల్ టీ స్టాల్ యజమాని తన టీ స్టాల్‌లో 16 సంవత్సరాల బాలుడైన బీహార్ రాష్ట్రానికి చెందిన మిథిలేష్ అనే వ్యక్తితో చట్ట విరుద్ధంగా పనిచేస్తుండగా పోచంపల్లి పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని టీ వరల్ యజమాని కొండాపురం గణేష్ పై, పోచంపల్లిలోని సురేష్ బైక్ మెకానిక్ షాపు యజమాని చింతల సురేష్ తన మెకానిక్ షాప్‌లో 17 సంవత్సరాల బాలుడైన చింతకింద అభిలాషను తన షాప్‌లో చట్టవిరుద్ధంగా పని చేపిస్తుండగా దాడులు చేసి చింతల సురేష్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చదువుకునే విద్యార్థుల చేత కార్మికులుగా పని చేయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

## సీజ్ చేసిన వాహనాల వేలం

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఈనెల 21 మంగళవారం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ నల్గొండ ఆధ్వర్యంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ దేవరకొండ నందు వివిధ కేసులలో సీజ్ చేయబడిన టూ విల్లర్, ఫోర్ విల్లర్ వాహనాలను వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఎస్. శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టూ విల్లర్ వాహనాలకు రూ. 10వేలు, ఫోర్ విల్లర్ వాహనాలకు రూ. 30వేల డిపాజిట్ చేసి ఉదయం 10 గంటలకు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

## మోసపూరిత వాగ్దానాలు సహించం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** కెటిఆర్ తలపెట్టిన రైతు మహాధర్నాకు పార్టీలకు అతీతంగా రైతులను పెద్ద ఎత్తున సమీకరించాలని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు.ఆదివారం పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసిన నల్లగొండ నియోజకవర్గ బిఆర్ఎస్ సన్నహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21న నిర్వహించే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అంటేనే మోసం అని మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా రైతులను తప్పుడు వాగ్దానాలతో మోసం చేస్తున్నదని, రైతు రుణమాఫీ కేవలం 35 శాతం మందికి మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కల్లు గీత కార్మిక అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షులు కటికం సత్తయ్య గౌడ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్




లు చీర పంకజ్ యాదవ్, బొర్ర సుధాకర్,మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్,సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి మాజీ ఎంపీపీ కరీం పాషా, నారబోయిన బిక్షం, లోడంగి గోవర్ధన్,పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, తిప్పర్తి, కనగల్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షుడు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ మారగోని గణేష్,కోఆప్షన్ సభ్యులు కొందూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## 'శ్రీ వాణి' విద్యాలయం స్వర్ణోత్సవాలు

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** క్రమశిక్షణకు, ఏకతకు చిహ్నమైన శ్రీవాణి విద్యాలయంలో చదువుకోవడం విద్యార్థులకు గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం భువనగిరి పట్టణం శ్రీ సాయి కన్వెన్షన్ హాల్లో శ్రీ వాణి విద్యాలయం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శ్రీ వాణి విద్యాలయం స్వర్ణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రార్ధన తో మొదలైన ఈ ఉత్సవాలు సాయంత్రం వరకు జాతీయగీతంతో ముగింపు జరిగింది. వివిధ హోదాల్లో పనిచేసిన విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన నాటి, నేటి ఉపాధ్యాయులను, సిబ్బందిని, ఆయాలను ఘనంగా సన్మానించారు. శ్రీవాణి విద్యాలయం ఏర్పాటుచేసిన ఫౌండర్ కమిటీ సభ్యులతో పాటు నేటి అభివృద్ధి కమిటీ వారికి జ్ఞాపికలతో సత్కరించారు. సుమారు 1500పైగా మంది విద్యార్థులు పాల్గొని గ్రూపులతో ఫోటోలు దిగారు. చిన్ననాడు ఆడుకున్న గోటీలు, గిల్లి కామ నుండి క్రికెట్ ఆధునిక క్రీడల ఎగ్జిబిషన్ను పలువురిని ఆకట్టుకుంది. దృశ్య రూపకాలు పాటలతో, నృత్యాలతో ఆద్యాంతం సభా ప్రాంగణం మారుమోగిపోయింది. స్కూల్లో చేసిన సభా కార్యక్రమాన్ని తో పాటు సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు. జూనియర్లను సీనియర్లను ఒకరినో కరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాల తెలుగు మీడియం నుండి ఆంగ్ల భాష మీడియంలోకి దినదిన అభివృద్ధి చెందాలని కోరుకుంటూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అందులో భాగంగా పాఠశాలకు నగదును అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నిర్వాహకులు పడమటి జగన్ మోహన్ రెడ్డి, దొంతలక్ష్మణ్, మంచాల శ్యాం, గంజి రమేష్, కాచం రాము, పొద్దుటూరి నాగేందర్, బెలిదే గణేష్, కొలుపుల వివేకానంద, లక్కిరెడ్డి పూర్ణచందర్, శ్రీవాణి, శిరీష బాలాంబల్, సరిత, శారద, లలిత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## 'భరోసా' నిబంధనలు సవరించండి

బికెఎంయు ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం

భట్టివిక్రమార్కకు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిబంధనలు సవరించాలని, జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాలతో ముడిపెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయరాదని వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం ఏన్కూరు మండల పర్యటనకు వచ్చిన భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత నిబంధనల ప్రకారం అనేక మంది అర్హులు లబ్ధిదారులుగా ఎంపికయ్యే పరిస్థితి లేదని తెలిపారు. సెంటు భూమి లేని వారు వేలాది మంది 20రోజులు పాటు జాతీయ ఉపాధి హామీ పథకం పనికి హాజరు కానివారు ఉన్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో సకాలంలో కూలీ డబ్బులు రానందున వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారని ఈవిషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పేదరికానికి ఉపాధి హామీ పని దినాలు కొలబద్ద కాదని వెంకటేశ్వరరావు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన భట్టివిక్రమార్క పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, పెరుమాళ్లపల్లి ప్రకాషరావు, తలారి రమేష్ పాల్గొన్నారు.

## పోరాటాలతోనే హక్కుల సాధన

తపాలా ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజు



**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాటాలతోనే హక్కులు సాధించబడతాయని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజు తెలిపారు. తపాలా ఉద్యోగుల సమావేశం ఆదివారం ఖమ్మంలో ఎడ్లపల్లి పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగింది. ఈసభలో జయరాజు మాట్లాడుతూ తపాలా ఉద్యోగులు కనీస సౌకర్యాలు లేకుండా నిత్యం పనిభారంతో సతమతమవుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆయన తెలిపారు. ఒకప్పుడు గౌరవంగా ఉండే పరిస్థితి నుంచి ఇప్పుడు వెట్టిచాకిరి చేసే పరిస్థితి ఏర్పడిందని జయరాజు తెలిపారు.కొన్ని హక్కులు సాధించామని మరికొన్ని హక్కులు సాధించాల్సి ఉందని జయరాజు తెలిపారు. సమావేశంలో మాజీ అధ్యక్షులు లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ అశాస్త్రీయ పని విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు అనివార్యమన్నారు. పోరాడేందుకు తపాలా ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో నాయకులు మహ్మద్, రామారావు, వెంకటరెడ్డి, కె. మహేందర్, ఎఎ ఖాన్, బండి ఎల్లారావు, సుభాష్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా లెనిన్ శ్రీనివాస్, జి. శేషగిరిరావు, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, రామారావు, అధ్యక్షులుగా మౌలాలి, కార్యదర్శులుగా ఎండి ఖాజామోహినుద్దీన్, కోశాధికారిగా వి.మహేష్ ఎన్నికయ్యారు.

## రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత



**ప్రజాపక్షం/పెనుబల్లి :** రోడ్డు భద్రత.. మన అందరి బాధ్యత అని ఎఎంవిఐ విజయశాంతి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా కల్లూరు చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించి రోడ్డు భద్రత.. మన అందరి బాధ్యత.. అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు రోడ్డుపై నడిపేటప్పుడు సరైన డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనం వ్యాలిడ్ ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితర డాక్యుమెంట్లు వాహనంలో ఉంచాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదని, మూల మలుపులో, ఓవర్‌టేక్ చేసేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వాహనం నడపాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వి.నిశ్చల, ఒఎస్ సీతారాములు, డిబిఎ సాహిల్ పాల్గొన్నారు.

## వర్గీకరణ కులాల సమస్య కాదు..

అణగారినవర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎస్సి వర్గీకరణ రెండు కులాల మధ్య సమస్య కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. దీనిని మాల, మాదిగ సమస్యగా చూపి వర్గీకరణను వాయిదా వేయడం కాని రెండు కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం కాని చేయడం సరైంది కాదన్నారు. జాషువా సాహిత్య వేదిక స్పర్శ సామాజిక అధ్యయన వేదిక బిసి సంఘాల ఐక్య వేదిక తెలంగాణ పీపుల్స్ జేఏసి ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణ మేధావుల సంఘీభావ సదస్సు ఆదివారం మంచికంటి భవన్‌లో జరిగింది. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకులు ఐవి రమణారావు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణను చూపి మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అట్టగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలన్న బిఆర్ అంబేడ్కర్ ఆశయానికి అనుగుణంగా మాదిగలు, మాదిగ ఉప కులాలు రిజర్వేషన్‌ను దక్కించుకునేందుకు వర్గీకరణ అవసరమన్నారు. మాల, మాదిగలు రెండు అణగారిన వర్గాలేనని రమణారావు తెలిపారు. ఎస్సి వర్గీకరణకు సంబంధించి సదస్సులు, సమావేశాలకు పరిమితం కాకుండా ఒక కార్యాచరణ ప్రకటించి లక్ష్య సాధన దిశగా పయనించాలన్నారు. 40 సంవత్సరాల నుండి ఎస్సి వర్గీకరణ కోసం పోరాడుతున్న మంద కృష్ణ మాదిగను అభినందిస్తూ ఆయన పోరాటాలకు సంఘీభావం తెలిపారు. ఈ సదస్సులో ఎంఎల్‌సి తాతా మధు, కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, సిపిఎం నాయకులు ఎం. సుబ్బారావు, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, ఎన్డి నాయకులు ఆవునూరి మధు, ఆప్ నాయకులు ఎన్. తిరమల్, వివిధ సంఘాల నాయకులు కోటా రాంబాబు, మనోహర్‌రాజు, నాగమల్లేశ్వరరావు, గురుమూర్తి, శ్రీనివాసరావు, మంద కృష్ణ తదితరులు ప్రసంగించగా మేకల సుగుణారావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి విజయ్, నామ పురుషోత్తం, వెంకటయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలు గుర్తించి అభివృద్ధి పనులు

సొంతభవనాలతో ప్రజాసేవలు సులభతరం

రవాణా సౌకర్యం మెరుగుపడితేనే అభివృద్ధి

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎప్పుడూ జరగని విధంగా ఏడాదిలోనే వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేశామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి రూ.4.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం మండలలంలో శేషగిరినగర్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆదివారం కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడారు. గ్రామీణ రహదారుల అనుసంధానం గ్రామీణ రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామమన్నారు. రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయన్నారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పేందుకు, సరైన పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం వలన ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నీరుగారే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అనతికాలంలో ప్రతి కేంద్రానికి సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు జిపి కార్యాలయాలు, నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. శేషగిరినగర్ జిపి కార్యాలయం ప్రారంభంతో ప్రజాసేవలు మరింత మెరుగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, ఎంపిడిఒ చలపతిరావు, ఎంపిఒ శ్రీనివాసరావు, ఎఇలు రఘురాం, వెంకటస్వామి, శివలాల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, వంగా వెంకట్, ఇలా సాగరపు వెంకటనరసయ్య, రాము, కరిష రత్నకుమారి, పడిగ భవాని, జర్పుల ఉపేందర్, సపావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఒత్తిడి నియంత్రించేందుకు క్రీడలు దోహదం





పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సిపి సునిల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని, పోలీసులకు విధి నిర్వహణలో ఒత్తిడి నియంత్రించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం పోలీస్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ సిబ్బందిలో నూతన ఉత్సాహం నింపేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపోటీల్లో రాణించి జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని సిపి ఆకాంక్షించారు. మూడురోజుల పాటు సాగే ఈపోటీల్లో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, కల్లూరు సబ్ డివిజన్లకు చెందిన సివిల్ పోలీసులతో పాటు, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్, స్పెషల్ వింగ్స్ సిబ్బంది మొత్తం 300 మంది క్రిడాకారులు పాల్గొనను న్నట్లు సిపి వెల్లడించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తున్న ఈపోటీల్లో 100,200,400,800,1500 మీటర్ల పరుగు పందెంతో పాటు కబడ్డీ, లాంగ్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, వాలీబాల్, టగ్ ఆఫ్‌వార్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. తొలిరోజు ఆదివారం ఖమ్మం టౌన్ వర్సెస్ కల్లూరు టీమ్‌ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీలను సిపి సునిల్‌దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి పోలీసు మీట్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు అడ్మిన్, నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ఎఆర్ అడిషనల్ డిసిపి విజయబాబు, ట్రైనీ ఐపిఎస్ రుత్విక్ సాయి, ఎసిపిలు సాంబరాజు, నర్సయ్య, సుశీల్ సింగ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

డిఎంహెచ్ఒ కళావతిభాయి

**ప్రజాపక్షం/మధిర రూరల్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని డిఎంహెచ్ఓ కళావతిభాయి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని దెందుకూరు పిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, హాజరు వివరాలు, పిహెచ్‌సికి వచ్చే ఓపి రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యంపై పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.సాయి, డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ కళావతిభాయి మాట్లాడుతూ రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మెరుగైన వైద్య సేవలందిందచడంతోనే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. విధి నిర్వహణలో రోగులతో వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చెరుకూరి దివ్యశృతి, సిహెచ్ఓ వి.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ లంకా కొండయ్య, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేట మండలం అప్పారావుపేట గ్రామ సరిహద్దుల్లో ఆదివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనలు ఢీకొని మొద్దుల గూడెం గ్రామానికి చెందిన తోకల శ్యామ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అప్పారావుపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి గండుగులపల్లి వెళ్తున్న ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదాన్ని గుర్తించి, తక్షణ స్పందించి తన సిబ్బందితో కలిసి ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తన కారులో దమ్మపేట ప్రాథమిక కేంద్రానికి తీసుకువచ్చారు. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో ఉండి ప్రథమ చికిత్స చేయించి గాయపడిన వారికి ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం కోసం ఏదైనా అవసరమైతే తనను సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా పారిశుద్ధ్య కార్మికులు

మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏసురత్నం డిమాండ్



**ప్రజాపక్షం/మధిర :** మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మున్సిపల్ కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం, సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మధిర మున్సిపల్ పరిధిలో ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల యూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. అలాగే కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, కాలనీల సంఖ్యకు అనుగుణంగా కార్మికులను పెంచాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడిగా రూ.5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్, కార్మికుడి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జిఒ నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు పెంచాలన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి నెలలో పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీ నారాయణ, సిపిఐ మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవి, ఎఐటియుసి మధిర డివిజన్ అధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరరావు, నాయకులు యంగల ఆనందరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగేంద్రం, నరేష్, బుజ్జి, శ్రీకాంత్,, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై పాలకులది సవతి తల్లిప్రేమ

రైతుసంఘం జిల్లా అధ్యక్ష,

ప్రధానకార్యదర్శులు రమేష్, గోవిందరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను బలిపశువులను చేస్తే చూస్తూ ఊరుకునేదిలేదని రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిన్నగోపతి గ్రామంలో ఆదివారం రైతుసంఘం గ్రామశాఖ మహాసభలో వారు పాల్గొని ప్రసంగించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో రైతులపట్ల పాలకులు సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 50 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చీడపీడల వలన, తుఫానులు సంభవించినప్పుడు రైతులు నష్టపోకుండా పంటలభీమా పథకం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు ఆరోగ్య భద్రత, వృద్ధాప్య పింఛన్ కల్పించాలని, రైతుల పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలఅన్నారు. పంటల పెట్టుబడి కోసం ఎకరానికి రెండు లక్షల రూపాయలు పావల వడ్డీ చొప్పున బ్యాంకుల్లో రుణసౌకర్యం కల్పించాలన్నారు. సమగ్ర భూసర్వేద్వారా సాదాబైనామాలో ధరఖాస్తు చేసుకున్న రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. మహాసభలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల నాయకులు దేరంగుల లక్ష్మయ్య, పొట్లపల్లి వెంకటశ్వర్లు, బండారు కొరివీరు తదితరులు పాల్గొన్నారు. రైతుసంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా గొడ్డుగొర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా దేరంగుల లక్ష్మయ్యతోపాటు 11 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## భూమిలేని నిరుపేదలందరికీ భరోసా

వ్యవసాయ కార్మిక సంఘం

ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ఆదినారాయణ డిమాండ్



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూలి బంధు పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రూ.12,000 వెంటనే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిలేని పేదలను కూలీలను గుర్తించటానికి గ్రామ సభలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సభల్లో భూమిలేని వ్యవసాయ కూలీలను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పని కార్డుకు కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనిచేయాలని లింకు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని , రాష్ట్రంలో 30 నుండి 40 శాతం మందికి ఉపాధి హామీ కార్డులు లేవని, ఉపాధి హామీ కార్డుకు, కూలీ బందుకు లింకు పెట్టడం ద్వారా అనేకమంది భూమిలేని నిరుపేద కూలీలు తీవ్రంగా నష్టపోతారని దండు వివరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాలకుర్తి వీరవీరయ్య, రాజశేఖర్, నరసింహారావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరామర్శ

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ 8వ వార్డులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నెగంటి నాగేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదివారం కన్నెగంటి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కన్నెగంటి నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, పాలేటి నర్సింహారావు, కట్ల సంతోష్, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, పోలా శ్రీనివాసరావు, బండారు తిరుపతిరావు, యడ్లపల్లి వీరయ్యచౌదరి పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యమే ప్రభుత్వ లక్ష్యం

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరు



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పర్యటనలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు సముచిత ప్రాధాన్యం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పడిన ఏడాది కాలంలో మహిళలకు పెద్దపీట వేసి అనే సంక్షేమ పథకాలు అమలు చేసిందని, నిరుపేదలు బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, ఆహార భద్రత కార్డులు అందజేస్తుందన్నారు. ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అన్నారు. మీ కుటుంబలో అనారోగ్య పాలై మెరుగైన వైద్యం చేపించుకోలేని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తుందన్నారు. రూ 16,75,000 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను 45 మంది లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరు అయిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేని ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాలుగు పథకాల సర్వేను వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం నల్లబెల్లి మండలంలోని నందిగామ ,రంగాపూర్ గ్రామంలో రైతు భరోసా ,రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇండ్లు ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యరాణి ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులు ఇంటింటా తిరిగి చేపట్టాలని సూచించారు . ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకంగా సర్వేను చేపట్టి ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గోవిందరాజన్ ,తహసిల్థార్ ఎం.క్రిష్ణా, ఎంపిడిఒ నరసింహమూర్తి ,వ్యవసాయాధికారి, ఎంపిఒ రవి, జూనియార్ అసిస్టేంట్ అశ్విని, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు .

## ఒంటి చేతితో మ్యాచ్ గెలిపించిన అమీర్

11 ఫోర్లు, 1 సిక్స్‌తో 75 రన్స్: నాటౌట్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** బాల్ ఏవిధంగా వచ్చినా బౌండరీకి వెళ్తుండటంతో బౌలర్లు మార్చి మార్చి బౌలింగ్ చేసినా ఫలితం లేకపోయింది. ఉర్దూ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉస్మానియా గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో అమీర్ బ్యాటింగ్ ప్రత్యేకంగా నిలిచింది. నిర్దిష్ట 8 ఓవర్ల మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టు 79 పరుగుల లక్ష్యాన్ని ముందు ఉంచింది. ఓపెనర్‌గా గ్రీస్‌లోకి వచ్చిన అమీర్ మొదటి నుంచి దూకుడుగా ఆడారు. మైదానం అన్ని వైపులా పరుగుల వరద సృష్టించాడు. 79 పరుగుల లక్ష్యంలో 75 పరుగులు అమీర్ చేయడం విశేషం. ఇందులో 11 ఫోర్లు, 1 సిక్స్ ఉంది. మరో 11 బంతులు మిగిలి ఉండగానే లక్షాయన్ని సునాయాసంగా చేరుకున్నారు. అమీర్ బ్యాటింగ్ చేస్తున్నంత సేపు బౌండరీ వద్ద అభిమానులు కేరింతలతో హోరెత్తించారు. అద్భుత బ్యాటింగ్ పటిమతో ఆద్యాంతం ఆకట్టుకొని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి

తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ డిమాండ్

**ప్రజాపక్షం / హన్మకొండ టౌన్ :** ఆరోగ్య శ్రీ నిధులను విడుదల చేయాలని తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఐఎంఎ హాల్‌లో విలేకరుల సమావేశాన్ని వైద్యులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి క్లెయిమ్‌లు రానందున అన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు జనవరి10 నుండి ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్సను నిలిపివేసాయి అని తెలిపారు. సేవలను నిలిపివేయడానికి కారణాలు తెలుపుతూ ఆసుపత్రులు వారి కన్సల్టేషన్ మొత్తాలను, జీతాలను చెల్లించలేనందున కన్సల్టెంట్‌లు పని చేయడానికి ఇష్టపడరు అని, గత ఆరు నెలలుగా ఆసుపత్రులు తమ మొత్తాన్ని చెల్లించలేక పోయినందున సరఫరాదారులు తమ సరఫరాలను నిలిపివేశారు అని, ఈ ప్రాతినిధ్యంలో మా ప్రతిపాదనలను ఆరోగ్య మంత్రికి, ఆరోగ్యశ్రీ సిఇఒకు కూడా ఫిర్యాదు చేశాం అని వైద్యులు తెలిపారు. వారి నాలుగు ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేశామని వైద్యులన్నారు. తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేష్, డాక్టర్ విజయచందర్ రెడ్డి, డాక్టర్ నాగార్జున రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ సుదీర్ కుమార్,డాక్టర్ సమర్థ రెడ్డి, డాక్టర్ మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ చైర్మన్



**ప్రజాపక్షం/ కమలాపూర్:** హన్మకొండ జిల్లా కేంద్రంలో 53వ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని కమలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్ల సత్యనారాయణ, ఇజ్జిగిరి దేవేందర్, నాంపల్లి ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

## 22వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని22వ వార్డు లక్ష్మీ నగర్ లో కౌన్సిలర్ ముంజాల రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులు, అదనపు పేర్లు రేషన్ కార్డులో చేర్పించే గురించి గతంలో ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు ఇవ్వనివారు వార్డులో ఆదివారం మున్సిపల్ కమిషనర్ కు దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద సంపత్, ఎస్కే పాషా, బాలాజీ రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, నదీముద్దీన్, వార్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్, కర్ణాకర్, శ్రీకాంత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ పట్టణంలోని 14వ వార్డుల్లో ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే యుద్ధాలతో సాధించలేనిది జ్ఞానవని, ఆ జ్ఞానాన్ని పొందిన మొదటి వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర అని కొనియాడారు. అణిచివేత, చిన్న చూపులకు గురైన అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరు సాధించలేనన్ని పట్టాలు సాధించి అపారమైన జ్ఞానాన్ని పొందారన్నారు. ప్రపంచ మేధావిగా అంబేద్కర్‌కు పేరుతుందని అలాంటి అంబేద్కర్ ఆశయాలను అమలు కోసం పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సచివాలయానికి గత ప్రభుత్వం అంబేద్కర్ సచివాలయంగా పేరు నామకరణ చేసిందని, అదే విధంగా దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో 10 లక్షల ఆర్థిక సహాయం కోసం దళిత బంధు తీసుకొచ్చిందన్నారు. తండాలు గ్రామ పంచాయితీలుగా చేయడం జరిగిందన్నారున. అంబేద్కర్ ఆశాయాలను లక్ష్యంగా ప్రతి ఒక్కరు మేధాసంపత్తిని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సపల్ ఛైర్ పర్సన్ పోకల జమున, వార్డు కౌన్సిలర్ పేర్ని స్వరూప, బాల్నె నర్సయ్య, డాక్టర్ సుగుణాకర్‌రాజు, చేవెల్లి సంపత్, ఊడుగుల నర్సింహులు, సాగర్, లక్ష్మ న్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హుల ఎంపిక అత్యంత కీలకం

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా పకడ్బందీగా సర్వేను చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. ఆదివారం వరంగల్ జిల్లాగీసుకొండ మండలం వంచనగిరి, ఉకల్ హావేలి గ్రామంలో, దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్ర స్థాయిలో సర్వే బృందాల పనితీరును తనిఖీ చేసి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులను అందించేందుకు సర్వేలో తప్పులు లేకుండా బాధ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి లబ్ధిదారుని వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన డేటాను సక్రమంగా నమోదు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి, వారికి ఉన్న వ్యవసాయ భూమి, కుటుంబ సభ్యుల వివరాలు, పథకాలకు అర్హత వంటి అంశాలను కలెక్టర్ సర్వే బృందాలతో కలిసి పరిశీలించారు. సర్వే ప్రక్రియలో ప్రజలను స్థానిక నాయకులను భాగస్వాములుగా చేసి, ప్రజలతో నేరుగా మమేకమవడం ద్వారా తగిన సమాచారం సేకరించాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా చూడటమే మన కర్తవ్యమని కలెక్టర్ అన్నారు. సర్వేలో జాప్యం లేకుండా త్వరితగతిన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా పథకం ద్వారా చిన్న రైతులకు, పేద రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గృహిణులకు, నివాసాలను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సంక్షేమాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో, మున్సిపల్ వార్డులలో పరిశీలనకు వచ్చే అధికారులు, సిబ్బందికు, పంచాయతీలలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి నుండి దరకాస్తుల స్వీకరిస్తామని, గతంలో ప్రజా పాలన కార్యక్రమంలో తెల్ల పేపర్‌పై స్వీకరించిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, పరిగణనలోకి తీసుకుంటామని, మిస్ అయిన దరఖాస్తుదారుడు గ్రామ సభలో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. నాలుగు పథకాల అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈనెల 26వ తేదీ నుండి అమలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అసత్య ప్రచారాలకు ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ కోరారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హత కలిగి దరఖాస్తూ చేయని వారు దరఖాస్తూ చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఓ రామ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు , ఎంపిడిఓ లు తదితరులుఉన్నారు.

## పథకాలకు నిజమైన లబ్ధిదారులు ఎంపిక

తహసీల్దార్, ఎంపిడిఒలకు సూచించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/చిట్యాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న నాలుగు ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్ధిదారులకు చేరే విధంగా స్థానిక తహసీల్దార్, ఎంపిడిఒలకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారు చెంచుపల్లిలో నాలుగు పథకాల సర్వేలో భాగంగా అధికారుల పనితీరుపై ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. నోడల్ అధికారి మండలంలో అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్ ఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి నాలుగు కొత్త పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో అర్హుల జాబితాను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేయాలని, లక్ష్మీపురం తండా చెంచుపల్లిలో జరుగుతున్న నాలుగు పథకాలలో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ ను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో పరిశీలనచేశానన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకువస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికారులు రూపొందించాలని ఆదేశించారు. మండల జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రజా ప్రభుత్వానికి ఏలాంటి చెడ్డ పేరు తీసుకురాకుండా గ్రామాలలోని ఇందిరమ్మ కమిటీలను కలుపుకొని సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా అమలుపరిచే విధంగా సర్వే ఉండాలని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నల్లబెల్లి హేమ, ఎంపిడిఒ జయశ్రీ, అధికారులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు కామిడీ రత్నాకర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## బల్దియా ఉద్యోగులకు క్రికెట్ పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని రెడ్డిపురం గ్రామశివారులోని టివిఎస్ఎస్ గ్రౌండ్‌లో బల్దియా ఉద్యోగులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ పోటీలను వర్ధన్నపేట ఎమ్మెల్యే ,విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణిలు ప్రారంభించారు. వారు సరదాగా కాసేపు క్రికెట్ ఆట ఆడి ఉద్యోగస్తులకు ఉత్సాహం నింపడం జరిగింది. అనంతరం డిఆర్ఎఫ్ , హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్ టీమ్స్‌లను పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో క్రీడలకు పెద్దపీట వేస్తు క్రీడకార్లకు ప్రోత్సాహకాలు అందిస్తూ ఒక్క ఫుట్ బాల్ క్రీడాకారిణిగా మక్కువ చూపుత్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపర్డెంట్ ఆనంద్, ఉద్యోగస్తులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టలేరు

పిసిసి సభ్యుడు రామానంద్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టలేరని, ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని పిసిసి సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తూ చదును చేయగా ఈ విషయం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి రాగా వారి సూచనల మేరకు నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని రాజేందర్ ఆధ్వర్యంలో టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, ఒబిసి వరంగల్ జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతిలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని అరాచకం లేదని, ముఖ్యంగా నర్సంపేట నియోజకవర్గం, పట్టణంలో భూ దందాలు రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూములను ఆక్రమించుకున్న చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని అన్నారు. పట్టణంలోని పాకాల రోడ్డు, మల్లంపల్లి రోడ్డు, నెక్కొండ రోడ్డుకు గల అసైన్డ్ భూములను ఆక్రమించుకున్న బీఆర్ఎస్ నాయకుల్లారా ఖబర్దార్ అన్నారు. గత పది సంవత్సరాల క్రితం మీ ఆర్థిక పరిస్థితులు ఏమిటి, ప్రస్తుతం మీ ఆర్థిక పరిస్థితులు ఏమిటి అనేది నర్సంపేట ప్రజలు గమనిస్తున్నారన్నారు. అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నర్సంపేట రాజకీయ చరిత్రను పరిశీలిస్తే మాతాత స్వర్గీయ పెండెం కట్టయ్య కాంగ్రెస్ పార్టీకి 60 సంవత్సరాలు పేద ప్రజల అభివృద్ధి తన ఊపిరిగా రాజకీయం చేసిన చరిత్ర మా కుటుంబానిది అని అన్నారు. సొంత ఆస్తులను అమ్ముకొని ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న చరిత్ర మా తాతయ్య పెండెం కట్టయ్య దని, స్థాయికి మించి విమర్శలు చేస్తే భవిష్యత్తులో తగిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నర్సంపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను కాపాడుతూ పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే కాంగ్రెస్ పార్టీ నాయకుల లక్ష్యంమని అదే గత ప్రభుత్వ బిఆర్ఎస్ నాయకులు పేద ప్రజల భూములను ప్రభుత్వ భూములను ఆక్రమించి కోట్ల రూపాయలు గడించిన టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, ములుకల వినోద సాంబయ్య, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పంబీ వంశీకృష్ణ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శులు బిట్ల మనోహర్, జన్ను మురళీ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ కార్యదర్శులు మోటం రవికుమార్, చిప్ప నాగ, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, బీరం భరత్ రెడ్డి, 8వ వార్డు అధ్యక్షులు గీరగాని రమేష్, 9వ వార్డు అధ్యక్షులు పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి, 20వ వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నిరుపేదలకు సంక్షేమ పథకాలు : కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రతి నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తాం, అర్హుల ఎంపికనే అత్యంత కీలకమని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ఆదివారం జనగామ మండలంలోన శామీర్‌పేట పసరమండ్ల గ్రామ పంచాయితీలు బచ్చన్నపేట, నర్మెట మండలాల పరిధిలోని పలు గ్రామాలు, జనగామ మున్సిపాల్టీ పరిధిలో ఐదవ వార్డు ఇందిరమ్మ కాలనీలో రైతు బరోసా, ఇందిరమ్మ అత్మీయ బరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంత మేరకు సర్వే జరిగింది, ఎన్ని ఇళ్లు పూర్తి అయ్యాయి వంటి పలు సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీసి సందేహాలను నివృత్తి చేసి బరోసా కల్పించారు. సర్వే ఎట్టి పరిస్థితిలోనూ నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని, పథకాల అమలులో సమన్వయంతో వ్యవహరించాలని, అబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అయినందున దీనిపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పథకాలను విస్తృత్తంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని, లబ్ధిదారుల ఎంపిక ముసాయిదా జాబితాను రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టబోతుందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వయించే గ్రామ సభల్లో అభ్యంతరాలను ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డులకు కొత్త సభ్యుల చేర్పులకు ధరఖసాస్తులను కూడా స్వీకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిరంతర పక్రియగా రేషన్ కార్డులను అందజేస్తామని, కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల్లో ఎవరైనా కుటుంబ సభ్యులు లేని వాటి ధరఖాస్తులను అదే విధంగా గతంలో మీ సేవా కేంద్రాల్లో కొత్త కుటుంబ సభ్యుల చేర్పుల కోసం మ్యుటేషన్స్ పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను క్షణంగా సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లాలో వంద శాతం పూర్తి అయ్యిందన, ఎంపిడో , మున్సిపల్ కమీషనర్‌కు లాగిన్‌లో సూపర్ చెక్‌లు కూడా పూర్తి పూర్తి అయినట్లు తెలిపారు. అలాగే గ్రామ సభలు నిర్వయించి వాటలో లబ్ధిదారుల ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తామని, అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఖచ్చితంగా స్వీకరిస్తామన్నారు. ఇంకా ఎవరైనా మోత్తానికే ఆర్జీ చేసుకోని వార ఉుంటే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చునని కోరారు. నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చే విధంగా పారదర్శకంగా ఈ సర్వే చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వయించే గ్రామ సభల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రైతు బరోసా కింద సాగుకు అనుకూలంగా లేని భూములను అత్యంత జాగ్రత్తంగా గుర్తించాలన్నారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేక అధికార రామారావునాయక్, తహశీల్దార్ హుస్సెన్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామ మనోహర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కాశీబుగ్గ యూనిట్ శాఖ సమావేశం యూనిట్ అధ్యక్షుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు తుమ్మ వీరయ్య అధ్యక్షతన సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్, అతిథులుగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రు సుధీర్‌బాబు, సదానందం, ఆహ్వానితులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజయ్య, మట్వాడ సెక్రటరీ కుమారస్వామి హాజరు కాగా 80 మందికి పైగా పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య తమ సందేశంలో లైఫ్ సర్టిఫికెట్, ఇన్‌కమ్ టాక్స్‌కు సంబంధించిన వివరాలను సోదాహరణంగా వివరించారు. తమ ఫోన్ల ద్వారా లైఫ్ సర్టిఫికెట్ ఎలా సమర్పించాలో తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రు సుధీర్‌బాబు, సదానందం తమ సందేశంలో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడిన యూనిట్ బాధ్యులు, కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజయ్య, మట్వాడ కార్యదర్శి కుమారస్వామి, కాశీబుగ్గ యూనిట్ ప్రధాన కార్యదర్శి ఎండి మదార్ సాహెబ్, కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, రత్నం, డేనియల్, యాదగిరి, బ్లూ చిప్ హన్మకొండ ప్రతినిధి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించుటకు చర్యలు తీసుకొంటున్నట్లు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం గా అన్ని గ్రామాలలో పరిశీలనకు వచ్చే అధికారులు, సిబ్బందికి, గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో తెల్ల పేపర్‌పై స్వీకరించిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు లు, పరిగణనలోకి తీసుకుంటామని, మిస్ అయిన దరఖాస్తుదారుడు గ్రా మ సభలో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. నాలుగు పథకాల అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ నెల 26వ తేదీ నుండి అమలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అసత్య ప్రచారాలకు ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ కోరారు. ఇది నిరంతరం ప్రక్రియ అని, అర్హత కలిగి దరఖాస్తు చేయని వారు దరఖాస్తు చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 'నేడు' ప్రజావాణి కార్యక్రమం రద్దు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ప్రతి సోమవారం జరుగనున్న ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు విచారణ ప్రక్రియలో జిల్లా, మండల స్థాయి అధికారులు భాగస్వాములైనందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయి విచారణ, 21వ తేది నుండి జరుగనున్న గ్రామసభలు నిర్వహణ విధులలో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

# పార్టీ ఫిరాయింపులను బిఆర్ఎస్సే ఆరంభించింది

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి సద్దాంహుస్సేన్



**ప్రజాపక్షం / వేలేరు :** బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఫిరాయింపులు మొదలు పెటింద్ది ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడడం కేవలం బిఆర్ఎస్ పార్టీ నాయకులకే చెందుతుందని హనుమకొండ జిల్లా వేలేరు మండలకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేలేరుగ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎండి సద్దాంహుస్సేన్ అన్నారు.ఆదివారం వేలేరు మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గ్రామశాఖ అధ్యక్షుడు కారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షుతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు,స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్ఎ కడియం శ్రీహరిపై జనగామ ఎంఎల్ఎ పల్ల రాజేశ్వర్‌రెడ్డి పార్టీ ఫిరాయంపులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. అసలు పార్టీ ఫిరాయింపులు మొదలు పెట్టింది మాజీముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు కాదాఅని ప్రశ్నించారు,స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంను అభివృద్ధి చేసింది కడియం శ్రీహరి మాత్రమేనని వేలేరు మండలానికి సాగునీరు కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా దాదాపుగా 52,కుంటలకు,చెరువులకు 700కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన విషయం విధితం కావడంలేదా ఇటీవలే మండలకాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయడమేకాకుండా గొల్లకిష్టంపల్లిలోని కస్తూర్భగాంధి పాఠశాలలో జూనియర్ కళాశాల నిర్మాణం కోసం 3 కోట్ల రూపాయల నిధులు మండలకేంద్రంలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా సిసి రోడ్ల నిర్మాణానికి 28 లక్షల రూపాలు నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసిన సంగతి మరచిపోయి పార్టీ ఫిరాయంపులని కడవియం శ్రీహరిపై పదేపదే మాట్లాడడం సరైంది కాదని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎండి సద్దాంహుస్సేన్, సంపత్, దుర్గరాజు, బైరి అనిల్, శ్రీకాంత్, సోషల్ మీడియా ఇంచార్జ్ ఎండి సలీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**సిఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చెక్కులను పంపిణీ చేశారు. 32 మంది లబ్ధిదారులకు గాను వాటివిలువ రూ.8,04,500/ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో రాని వారు ప్రైవేట్ లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకోవడం కోసం సిఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్య విద్య రంగాలకు అధిక ప్రాధాన్యతని ఇస్తున్నందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అప్పం కిషన్, మహేందర్ రామినేని రవీందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఫోకస్

# ఆరోగ్యం

## కళ్ల సమస్యలు ఎన్నో..



వృద్ధాప్యానికి చేరుతున్న కొద్దీ కంటిచూపు తగ్గుతుంది. చాలా సందర్భాల్లో శస్త్రచికిత అనివార్యమవుతుంది.. ఈ విషయాన్ని గుర్తించుకొని, 35–40 ఏళ్ల నుంచీ దృష్టి పరీక్షలు చేయించుకుని అవసరమైతే కళ్ల అద్దాలు తీసుకోవటం మంచిది. ఒక వయసుకు రాగానే కంటిలోని కార్నియా పొర దళసరిగా తయారై, శుక్లాలు రావటం కూడా సహజం. దీనికి ఇప్పుడు శుక్లాన్ని తొలగించి కంటిలోనే లెన్సును అమర్చే సమర్థమైన సర్జరీ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.ఇవి కాకుండా..వయసుతో పాటు కంటిలో నీటికాసులు పెరగటం,దృష్టికి కీలకమైన మాక్యులా పొరక్షీణించటం, మధుమేహం ఉంటే దాని కారణంగా రెటీనా పొర మీద రక్తం కమ్మటం వంటి రకరకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. సమస్యేమంటే ఈ సమస్యలు కొంత తీవ్రమైనవి,వీటివల్ల దృష్టి దెబ్బతినే అవకాశాలు చాలా ఎక్కువ. వీటికి ముందస్తు సంకేతాలు కూడా ఏమీ ఉండవు. వీటిని ముందే గుర్తిస్తే కచ్చితంగా నియంత్రణలోఉంచుకోవటం ద్వారాచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. కాబట్టి ఒక వయసు వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా తరచూ కంటి పరీక్ష, అదీ 'సంపూర్ణ నేత్ర పరీక్ష' చేయించుకుంటూ ఉండటం ఉత్తమం. ఈ పరీక్ష కోసం కంటిలో చుక్కల మందు వేసి, కనుపాప పెద్దదైన తర్వాత పరికరాలతో లోపలంతా క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఈ పరీక్షే ముఖ్యమని గుర్తించాలి.

## తలనొప్పికి కారణాలెన్నో..



ఏదో ఒక సమయంలో తలనొప్పి సమస్యను ఎదుర్కోని వారు సర్వసాధారణంగా ఉండరు. తల ఉన్నప్పుడు నొప్పి తప్పదుకదా! సహజంగా తలనొప్పి తాత్కాలికం. దానంతట అదే తగ్గుతుంది. అయితే, కొన్ని సందర్భాల్లో కొన్ని గంటలు... రోజులు.. వారాల పాటు వేధిస్తుంది. అలాంటి సమయంలో వైద్యులను సంప్రదించక తప్పదు. ఇంతకీ తలనొప్పి ఎందుకు వస్తుంది? ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేదు. ఎందుకంటే, ఈ సమస్యకు సవాలక్ష కారణాలున్నా యి. స్పృహతప్పటం, గందరగోళం, కంటి చూపులో మార్పులు లేదా ఇతర శారీరక బలహీనతలతో కూడిన తలనొప్పి రావచ్చు. లేదా మెడ బిగుసుకుపోవటం మరియు జ్వరంతో కూడిన తలనొప్పి లక్షణాలు ఉండవచ్చు. కొంత మందికి తగినంత నిద్ర లేకపోవడం వల్ల తలనొప్పి వస్తుంది. మరికొందరు తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు తలనొప్పితో బాధపడతారు. ఆందోళన, క్లస్టర్ తలనొప్పి, పార్శ్వశూల అనేవి తలనొప్పులలోని రకాలు. తల పగిలిపోయేంత, పార్శ్వశూల అనేవి రక్తనాళాలకు సంబంధించిన తలనొప్పు లు. ఈ రక్తనాళాలకు సంబంధించిన తలనొప్పులలో భౌతిక శ్రమ తలనొప్పి బాధను అధికం చేస్తుంది. తల చుట్టూ ఉండే కణజాలములోని రక్తనాళాలు ఉబ్బుతాయి లేదా వాస్తాయి. దానివల్ల తల నొప్పితో బాధపడతాము. తల పగిలిపోయేంత (క్లస్టర్) తలనొప్పి పార్శ్వశూల తలనొప్పి కన్నా తక్కువగానే వస్తుంది, దీనిని రక్తనాళాలకు సంబంధించిన తలనొప్పిగా పేర్కొంటారు. ఆందోళన వల్ల లేదా కండరం ముడుచుకోవటం వల్ల కలిగే తలనొప్పి అన్నది అత్యంత సాధారణమైనది. ఈ రకమైన తలనొప్పి స్థిరంగా ఉంటుంది. నుదురు, కణతలు, మెడవెనుక భాగం వరకూ వ్యాపిస్తుంది. కొన్ని సందర్భాల్లో దీర్ఘకాలం వేధిస్తుంది. సరణి (సైనస్) తలనొప్పులకు సరణి సంక్రమణం (అంటువ్యాధి) లేదా ఎలర్జీ వల్ల కలుగుతాయి. జలుబు లేదా ఫ్లూ జ్వరం తరువాత ముక్కు ఎముకలకు ఎగువన,దిగువన ఉండే గాలి కుహరాలు, సరణి మార్గాలు మంటకు గురి కావడం వల్ల సరణితలనొప్పి కలుగుతుంది. ఈ సరణి చిక్కబడటం లేదా క్రిమిపూరితం అయినా తలకు నొప్పి కలిగించేకారణమవుతుంది.ఈ నొప్పి తీవ్రంగా, కొనసాగుతూ ఉంటుంది, ఉదయాన్నే మొదలవుతుంది మరియు ముందుకు వంగితే మరింత దారుణంగా మారుతుంది. కాగా, తరచూ వచ్చే ఒక రకమైన తలనొప్పిని మైగ్రేన్ అని అంటారు. పార్శ్వ తలనొప్పి( మైగ్రేన్ తలనొప్పి ) ఇతర తలనొప్పులకు భిన్నంగా వుంటుంది. మైగ్రేన్ లక్షణాలు మనిషి మనిషికీ వేరు వేరు విధాలుగా ఉంటాయి. ఇది నరాల వ్యవస్థకు సంబంధించిన సాధారణమైన జబ్బు. మైగ్రేన్ లక్షణాలు సాధారణంగా ఉదయం నిద్ర నుంచి మేల్కొన్నప్పుడు వస్తుంటాయి. తేలిక పాటి తలనొప్పితో ప్రారంభమై తీవ్రమైన తలనొప్పి వస్తుంది. కొందరిలో వాంతి వస్తున్నట్లుగాను మరికొందరిలో వాంతులతో కూడిన తలనొప్పి వుంటుంది. అధిక వెలుతురును, శబ్దాలనూ భరించలేరు. కళ్ళముందు వెలుతురు చుక్కలాగా కనిపించవచ్చు. ఈ లక్షణాలు మొదలైన కొన్ని నిముషాలకు ముఖములో ఒక భాగములో కాని,ఒక చేయి కాని,ఒక కాలుకాని తిమ్మిర పట్టడము, సూదులతో గుచ్చినట్లు అనుభూతి కలుగుతుంది. కళ్ళు తిరగడం, బలహీనత, మాట్లాడడానికి కాస్త ఇబ్బంది పడడం జరగవచ్చు. ఈ లక్షణాలు సాధారణంగా 6గం నుండి 8 గం వరకు వుంటాయి. స్త్రీలకు బహిస్టు సమయంలో మైగ్రేన్ తల నొప్పి వస్తుంటుంది. ఈ సమస్య ఉన్నవారు ఉద్వేగం కలిగించే జీవన శైలి నుండి స్వల్ప మార్పులతో సాధారణ జీవిత విధానాన్ని అలవరచుకోవాలి. ఇంటిలో వున్నపుడు చీకటి గదిలో ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలి. ద్రవ పదార్థాలు, నీళ్ళు ఎక్కువ మోతాదులో తాగాలి. నీటిలో తడిపిన బట్టను తల మీద వేసుకొని విశ్రాంతి తీసుకుంటే కొంత ఉపశమనం ఉంటుంది. ఏదిఏమైనా తలనొప్పి కొన్ని రోజులు లేదా వారాలు వేధిస్తుంటే, తేలిగ్గా తీసుకోకుండా వైద్యులను సంప్రదించడం అత్యవసరం. సొంత వైద్యం ప్రతికూల ఫలితాలకు కారణమయ్యే ప్రమాదం ఉంది.

## రక్తపోటు.. మధుమేహం సరేసరి




ఈ మధ్యకాలంలో వయసుతో సంబంధం లేకుండా మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. మలివయసులో ఈ సమస్యలు అధికం. యుక్తవయసు నుంచీ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించటం ద్వారా వీటిని సాధ్యమైనంత వరకూ దరిజేరకుండా చూసుకోవచ్చుగానీ అన్నిసార్లూ వీటిని పూర్తిగా తప్పించుకోలేకపోవచ్చు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, పక్షవాతం వంటి రకరకాల సమస్యలు వెంటాడతాయి. కాబట్టి తరచూ పరీక్షలు చేయించుకుంటూ, చికిత్స కొనసాగిస్తూ వీటిని కచ్చితంగాఅదుపులో ఉంచుకోవాలి. అలాగే మలివయసులో ఎదురయ్యే మరో పెద్ద సమస్య క్యాన్సర్. స్త్రీలలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, పురుషుల్లో ప్రోస్టేటు గ్రంథి క్యాన్సర్ల వంటివి ఎక్కువ. వూపిరితిత్తులు, పెద్దపేగు క్యాన్సర్ల వంటివి ఇద్దరిలోనూ కనబడుతుంటాయి. ఒంట్లో ఎక్కడైనా గడ్డలు రావటం, వీడకుండా దగ్గు వేధించటం, మలవిసర్జన అలవాట్లు మారిపోవటం, రక్తం కనబడటం, బరువు తగ్గిపోవటం, పుండ్లు మానకపోవటం వంటి లక్షణాలేవైనా కనబడితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. యుక్తవయసు నుంచీ పండ్లు, ఆకుకూరలు, కూరగాయల వంటి సహసిద్ధమైన ఆహారం ఎక్కువగా తీసుకోవటం, బరువు పెరగకుండా చూసుకోవటం, నిత్యం వ్యాయామం చెయ్యటం వీటితో క్యాన్సర్తో సహా చాలా రుగ్మతలు, వ్యాధులు దరిజేరకుండా వృద్ధాప్యాన్ని హాయిగా ఆస్వాదించే అవకాశం ఉంటుందని గుర్తించాలి.

## ఊడే పళ్లు... బోసి నవ్వు..



వయసుతోపాటు పళ్లు ఊడడం సహజం. ఈ సమస్య లేని వారు చాలా అరుదు. ఊడే పళ్లు.. బోసి నవ్వే వయసు మీరిన వారి ప్రత్యేకతలు. ఇప్పటికీ మన సమాజంలో చాలామంది నమ్మే విషయం ఒక వయసు రాగానే అందరికీ దంతాలు వూడిపోతాయనీ, నోరు బోసిపోవటం తథ్యమనీ! ఇది చాలా తప్పు. చిన్న వయసు నుంచీ చక్కటి నోటి ఆరోగ్య పద్ధతులు పాటిస్తూ ఉన్న వారికి వృద్ధాప్యంలో పళ్లు వూడిపోవు. నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం, చక్కటి ఆహారం తీసుకోవటం ఈ రెండూ పాటిస్తే జీవితాంతం మన దంతాలు మనతోనే ఉంటాయని వైద్యరంగం ఎప్పటి నుంచో చెబుతోంది. రోజూ రెండుపూట్లా బ్రషింగ్ చేసుకోవటం, చక్కగా నములుతూ ఆహారం తీసుకోవటం, ఆహారం తీసుకోగానే నోటిని శుభ్రపరచుకోవటం, అప్పుడప్పుడు దంత వైద్యులకు చూపించుకుని దంతాల మీద గార పేరుకుంటే దాన్ని తొగించేందుకు స్కేలింగ్ చేయించుకోవటం.. ఈ జాగ్రత్తలు తీసుకుంటే చాలు! చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి రక్తం చిమురుస్తుండటం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే దంతవైద్యులకు చూపించుకుని చికిత్స తీసుకోవటం చాలా అవసరం. చిగుళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే దంత మూలం బలహీనపడి, దంతాలు వూడిపోయే అవకాశాలు పెరుగుతాయి. దంతాలు వూడితే ఆహారం తీసుకోవటం కష్టంగా తయారై, పోషకాహారం తినలేని పరిస్థితులూ తలెత్తుతాయి. దీనివల్ల మొత్తం ఆరోగ్యమే దెబ్బతింటుంది. వయసు పెరిగిన కొద్దీ నోరు పొడిబారటం ఎక్కువ అవుతుంది, దీనివల్ల దంతాల మీద రంధ్రాలు పడటం, చిగుళ్ల బాధల వంటివీ పెరుగుతాయి. కాబట్టి చిగుళ్ల సమస్యలు, దంతాలు పుచ్చిపోవటం, జివ్వుమనటం వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను చూపించుకుని, వాటిని చక్కదిద్దుకోవాలి. ఒకవేళ దంతాలు వూడినా ఇప్పుడు సమర్థమైన, శాశ్వతమైన కృత్రిమ దంతాలు (ఇంప్లాంట్స్) అమర్చే అవకాశం ఉంది కాబట్టి వృద్ధాప్యంలో దంత సమస్యలతో ఇబ్బందులు పడాల్సిన అవసరమే లేదని గుర్తించాలి. సాధారణ ఆరోగ్యం బాగుండేందుకు కూడా ఇది కీలకం!

## చెవులు వినిపించవు



ఒక వయసుకు వచ్చేసరికి వినికిడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో అధిక పౌనఃపున్యం ఉండే ధ్వనులు సరిగా వినపడవు. చాలామంది వినికిడి తగ్గిందన్న విషయాన్ని అంగీకరించటానికే ఇష్టపడరు. ఒకవేళ దాన్ని అంగీకరించినా, వైద్యులకు చూపించుకోవటానికి ఇష్టపడరు. కానీ దీనివల్ల నలుగురిలో కలవలేకపోవటం, ఎవరేమంటారోనని చిన్నతనంగా భావిస్తుండటం, సమాజానికి దూరం కావటం, క్రమేపీ కుంగుబాటులోకి జారిపోవటం వంటి సమస్యలన్నీ బయల్దేరతాయి. కాబట్టి వినికిడి తగ్గుతోందనిపిస్తే తోసేసుకుని తిరగటం కాకుండా.. వైద్యులకు చూపించుకుని అవసరమైతే తేలికపాటి వినికిడి యంత్రాల వంటివి తీసుకోవటం ద్వారా చక్కటి సామాజిక జీవితాన్ని గడపొచ్చని గుర్తించాలి. యుక్తవయసు నుంచీ పెద్దపెద్ద ధ్వనులు వినకుండా ఉండటం, చెవుల్లో ఇయర్ఫోన్స్ పెట్టుకుని అతిగా ధ్వని పెంచుకోకుండా ఉండటం చెవి ఆరోగ్యానికి ముఖ్యం.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

# ప్రమాదరహిత పట్టణంగా కొత్తగూడెంను తీర్చిదిద్దుదాం

ట్రాఫిక్ నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత

రోడ్డు భద్రత వారోత్సవాల సభలో ఎంఎల్ఎ కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాచలం :** సన్వయంతో పనిచేసి కొత్తగూడెం పట్టణాన్ని ప్రమాదరహితంగా తీర్చిదిద్దుదామని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. జాతీయరోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని కొత్తగూడెం క్లబ్లో ఆదివారం జరిగిన పోలీస్ సిబ్బంది, వ్యాపారులు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, పట్టణ ప్రముఖులతో ఏర్పాటు చేసిన సదస్సుకు ఎంఎల్ఏతో పాటు ఎస్పి రోహిత్రాజ్ హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణ కేవలం పోలీసుల బాధ్యతే కాదని, దీనిని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. మద్యం, నిర్లక్ష్యం, సెల్ఫోన్ డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమని చెప్పారు. ప్రతీ సెంటర్లో ప్రమాదాలను గుర్తించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, పార్కింగ్ స్థలాల కోసం ప్రభుత్వ శాఖలు స్థలాలు అన్వేషించిన నివేదికలు ఇవ్వాలన్నారు. చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి దు కాణాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, నిబంధనలకు అనుగుణంగా చిరువ్యాపారాలు సాగాలన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో అన్నిశాఖల బాధ్యత పెరుగుతుందని, సమన్వయంతో పనిచేసి సమస్యలు అధిగమించాలన్నారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాల కర పత్రాలను విడుదల చేశారు. కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, తహశిల్దార్ పుల్లయ్య, ఆర్డిఓ వెంకటనారాయణ, ఆర్అండ్బి డిఇ నాగేశ్వరరావు, కమీషనర్ శేషాంజన స్వామి, ఆర్డిసి డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, రమణమూర్తి, వి.మల్లిఖార్జున రావు, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, పల్లపోతు సాయి, అబీద్, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, రత్నకుమారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో త్వరలో కమ్యూనిజం స్థాపన తథ్యం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విఎస్ బోస్




**ప్రజాపక్షం/కాప్రా :** దేశంలో బిజెపి పార్టీ మతోన్మాదంతో కొనసాగిస్తున్న దుర్మార్గ పాలన స్థానంలో కమ్యూనిజాన్ని ప్రజలు త్వరలో స్థాపించుకొంటారని, దీనికి సిపిఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్ పిలుపునిచ్చారు. కేంద్రంలో మతోన్మాదంతో బిజెపి ప్రభుత్వం దుర్మార్గ పాలన, వంచన చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వందేళ్ల క్రితం భారతదేశంలో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)దేశానికి స్వాతంత్రం కోసం నిర్భయంగా పోరాడి ప్రజల మన్ననలు పొంది అదే పోరాట పటిమతో ఇప్పటికీ ప్రజలకు అండగా ఉంటూ వారితో మమైక్యమైందన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని జవహర్నగర్ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల నుండి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దశరథ్, శంకర్రావు అధ్యక్షతన ఆదివారం ఎర్ర చీరలు ధరించిన మహిళలు, ఎర్ర చొక్కాలతో యువకులు భారీ ర్యాలీ నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దుర్మార్గ పాలనలకు వ్యతిరేకంగా అన్యాయాలకు గురవుతున్న ప్రజలకు అండగా ఉంటూ దున్నేవాడికి భూమి అన్న నినాదంతో పోరాడి లక్షలాది మంది పేదలకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని దక్కేందుకు దోహదపడింది సిపిఐ మాత్రమే అని బోస్ తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శి ఉమామహేష్లు మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉంటూ పోరాడి భూములను పంచి పలు కాలనీలు ఏర్పాటు చేసిన ఘనత సిపిఐకే దక్కిందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడుతున్న పార్టీ సిపిఐ మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దశరథ్, శంకర్రావు, మండల కార్యదర్శి డి.యాదగిరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింహ, యాదయ్య గౌడ్,సహదేవ్, రాములు గౌడ్, రాజేశ్వరి, స్వరూప, ప్రజా నాట్య మండలి అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్,ప్రమీల, ఎఐవైఎఫ్ నేతలు లక్ష్మణ్, ఎల్లయ్య అజీజ్, రవినాయక్, సత్యం, బిసి సంఘ నేతలు వెంకటయ్య, లత క్రిష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనకు మద్దతు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** అఖిలపక్షాలు నిర్వహిస్తున్న ఆందోళనకు సిపిఐ మద్దతు ప్రకటిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. భువనగిరి బైపాస్ రోడ్డు ప్రభుత్వ ఐటిఐ దగ్గర అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని ఆదివారం వీరవెల్లి గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించాలని, తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. 20 వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నాకు సిపిఐ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. సిపిఐ మండల కార్యదర్శి మరిపెల్లి రాములు, మాజీ సర్పంచ్ కస్తూరి బిక్షపతి, ఉపసర్పంచ్ రేగు అంజయ్య, గాదె రాజు గోపాల్, చింతల వెంకటరెడ్డి, సర్దార్ శ్రీను, రేగు బీరప్ప రేగు శ్రీశైలం, సర్దార్ శంకరయ్య, పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల డిమాండ్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** అర్హత కలిగిన వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయనమ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆరిక సహాయం ఎలాంటి షరతులు,కొర్రీలు లేకుండా అమలు చేయాలన్నారు. పభుత్వం ఈ నెల 26వ తేదీ నుండి ప్రారంభించనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా , రైతు భరోసా ,రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాలు అర్హత కలిగిన నిజమైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని లేనిచో ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

# పంటలకు కనీస మద్దతుధర చట్టం చేయాలి






ఎఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం అమలు చేయాలని ఎఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రెండు ఏఐకెఎంఎస్ సంఘాల విలీనం అయిన సందర్భంగా కామ్రేడ్ మాధవన్నహాల్లో వి.కోటేశ్వరావు, బిక్షపతి అధ్యక్షతన విలీనసభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతాంగాన్ని పట్టించుకోవడం లేదని, మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందాన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి చట్టాలు మారుస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి రాష్ట్రంలో రైతులను రైతుభరోసా పెంచి, రైతును రాజును చేస్తామని, పోడు భూములకు పట్టాలిస్తామని, అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకూ ఇచ్చి హామీలు నెరవేర్చలేదన్నారు. కొత్తజాతీయ మార్కెట్ విధానాన్నిరద్దుచేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సభలో రాష్ట్రప్రధాన కార్యదర్శులు మండల వెంకన్న, గౌని ఐలయ్య, ఉపాధ్యక్షులు వెంటరామిరెడ్డి,ముక్తిసత్యం,రాజు,జడ సత్యనారాయణ, సహాయకార్యదర్శులు డేవిడ్కుమార్, లాల్ కుమార్, భూమన్న,కోశాధికారినందగిరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చింతకాని:** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టా ఉద్యమాలకు రైతులు సన్నద్ధం కావాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి చింతకాని మండలం రాఘు వాపురం ఏఐకేఎస్ గ్రామశాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మా ట్లాడుతూ దేశవ్యాప్తంగా 75శాతం వ్యవసాయరంగం ఉన్నప్పటికీ బడ్జెట్లో 50శాతం నిధు లు కేటాయించడమే రైతులను విస్మరించడమేనన్నారు. దేశ సరిహద్దులో రైతు నాయకులు జగ్జిత్సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నా కనీసం కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ చాలా మందికి కాలేదని, చనిపోయిన వారికి ,పట్టాదారు పాసుపుస్తకంలేని వారికి సాంకేతిక ఇబ్బందులు ఉన్నవారికి రుణమాఫీ అమలు కాలేదన్నారు. ఖరీఫ్ పూర్తయి రబీప్రారంభమైనా నేటికి రైతుభరోసా అందించ లేదన్నారు. ప్రభు త్వం తక్షణం ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసి రెండు సీజన్లకు సంభంధించి రైతుభరోసా ఎకరానికి రూ.12000/అందిచాలన్నారు.రైతాంగ సమస్యల కోసం నూతన ఉద్యమాలను రూపొందిస్తామన్నారు. అనంతరం ఏఐకేఎస్ గ్రామశాఖ నూతన అధ్యక్షుడుగా పుట్టబంతి సుదర్శన్, ప్రధాన కార్య దర్శిగా దొబ్బల బోసుతో పాటు మరో 9మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు.. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తెలంగాణ రైతుసంఘం జిల్లా కోశాధికారి కూచిపుడి రవి, సిపిఐ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, సహాయ కార్యదర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు మార్గం శ్రీను, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డ నరసయ్య ఆశయ సాధనకు పునరంకితమవుదాం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు




**ప్రజాపక్షం/హుజూర్నగర్ :** దొరలు, జమిందారులు జాకీర్దారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దళ కమాం డర్గా ఉండి పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడిన కామ్రేడ్ దొడ్డ నర్సయ్య ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలందరం పునరంకితమౌదామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు పార్టీ కార్యకర్తలను కోరారు. ఆదివారం కామ్రేడ్ దొ డ్డ నర్సయ్య 26వ వర్ధంతిని హుజూర్నగర్లోని సిపిఐ పార్టీ కార్యాల యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి,హుజూర్నగర్ మొదటి ఎమ్మె ల్యేగా ఈ ప్రాంతం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు,పోకల వెంకటేశ్వర్లు,దేవరం మల్లీశ్వరీ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు యల్లావుల రమేష్,దొంతగాని సత్యనారాయణ,జడ శ్రీనివాస్,సిపిఐ పట్టణ నాయ కులు మామిడి వెంకయ్య,జడ వెంకన్న, మత్తిని మల్లయ్య,గోధుమల ఈశ్వరాచారి, వెంకయ్య పాల్గొన్నారు.



## నేటి నుంచి విద్యుత్‌శాఖ ఆర్టిజన్ల రిలే నిరాహార దీక్షలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌:** టివిఏసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్‌సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ చేయాలని కోరుతూ శాంతియుత రిలేనిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జేఏసి నాయకులు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, అసోసియేషన్ సంఘాల నాయకులను ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగే దీక్షలకు మద్దతు తెలిపాలని కోరారు.ఆర్టిజన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వీలైనంత త్వరగా స్పందించి చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈకి శనివారం వినతి పత్రం అందజేశారు. టివిఏసి జేఏసి కరీంనగర్ జిల్లా ఆర్టిజన్ నాయకులు శివకృష్ణ, రాష్ట్ర నాయకులు రఘునాథ్‌రెడ్డి, జీవన్, అమానుల్లా, శ్రీనివాస్ నాయక్, సంతోష్, రహీమ్, చందర్ సింగ్, వేణు, పరశురాం, రవి, శ్రీకాంత్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

## న్యాయవాదుల క్రికెట్ పోటీలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః** గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని న్యాయవాదులకు క్రికెట పోటీలు నిర్వహించగా కరీంనగర్ జిల్లా స్పెషల్ కోర్టు (ఎసిపి) న్యాయమూర్తి కుమార్ వివేక్ పోటీలను ప్రారంభించారు. ఆదివారం స్థానిక లయోలా కళాశాల రేకుర్తిలో నిర్వహించిన న్యాయవాదుల క్రికెట్ పోటీలను న్యాయమూర్తులు లక్ష్మి కుమారి, బానోతు రాజేశ్వర్ క్రికెట్ పోటీలను ప్రారంభించి మొదట బ్యాట్, బౌలింగ్ చేసి న్యాయవాదులకు క్రీడాస్ఫూర్తి కలిగించారు. న్యాయవాదులు ఏ, బి, సి, డి, ఈ టీములుగా ఏర్పడి పోటీలు జరగగా ఫైనల్‌లో సి, డి టీమ్‌ల మధ్య పోటీలో సి టీం విన్నర్‌గా, డి టీం రన్నర్‌గా గెలిచారు. కార్యక్రమంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. క్రికెట్ ఇంచార్జిలుగా మడిపెల్లి రవి, టి.రఘువీర్‌లు, ముత్యాల తిరుపతిరెడ్డి, కామెంటేటర్‌గా న్యాయవాదులను అలరించారు. గెలిచిన టీంలకు ఈనెల 26న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ బహుమతులు అందజేస్తారు.

## బాధిత కుటుంబానికి నిత్యావసరాలు



**ప్రజాపక్షం/రామగిరిః** రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కారంగుళ్ళ మల్లయ్యకు గతంలో వెన్నెముక ఆపరేషన్ జరిగి సమస్యలతో నడవడానికి వీలు లేనంతగా కాళ్లు మొద్దు బారిపోయి నడవలేని పరిస్థితి,ఇతరత్రా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నా విషయం తెలుసుకున్న రేండ్ల శారద కుమారస్వామి దంపతులు బాధితులు మల్లయ్యను ఆదివారం పరామర్శించి తన సొంత ఖర్చులతో 25 కేజీల బియ్యం మరియు నిత్యవసర వస్తువులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా బాధితుడు మల్లయ్య రేండ్ల శారద కుమారస్వామి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పడాల మొగిలి గౌడ్, కాట శంకర్ గౌడ్, తాటి శంకర్ గౌడ్, ముత్యం నాగరాజుగౌడ్, కరెంగుళ్ళ రాజు పాల్గొన్నారు.

## 'ఫ్యాక్స్' నూతన భవనం ప్రారంభం



**ప్రజాపక్షం / చందుర్తి :** మండలంలోని సనుగులలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంఆధ్వర్యంలో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని , రామరావుపల్లిలో నిర్మించిన గోదాం లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాలు ప్రస్తుతం అన్ని రంగాలలో వాణిజ్య బ్యాంకులతో పోటీ పడుతున్నాయన్నారు.రైతుల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సహకార సంఘాలను ప్రోత్సహించారని గుర్తు చేశారు.ఈ నెల 26 నుండి నూతన రేషన్ కార్డులు,రైతు భరోసా ఎకరాకు రూ.12000,ఇందిరా ఆత్మీయ భరోసా ద్వారా వ్యవసాయ కూలీ కుటుంబాలకు రూ.12000 అందజేస్తామని, మన ప్రాంతానికి అదనంగా మరో 4696 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయన్నారు. ప్రజా ప్రతినిధులు,ఫ్యాక్స్ చైర్మన్,డైరెక్టర్లు,ఫ్యాక్స్ సీఇఓ,సిబ్బంది,అధికారులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## టైపింగ్ పరీక్షలు ప్రశాంతం



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని ఆదర్శటైపింగ్ ఇన్‌స్టిట్యూట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్‌మజీద్ విలేకరులకు తెలిపారు. హైయర్, లోయర్‌గ్రేడ్ విద్యార్థులకు శిక్షణ త ర్వాత రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ బోర్డు నిర్వహణలో శని,ఆదివారం విద్యార్థులకు పరీక్షలు సిరిసిల్లా జిల్లాలోని ఆగ్రహారం కళాశాల వద్ద జరిగాయన్నారు.పాసైన అభ్యర్థులు ఆదేనెల 31తేది వరకు టైపిస్టు,కాపిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.టైపింగ్ నేర్చుకోవడం వలన మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ పేర్కొన్నారు.

## ఆకాంక్షలకనుగుణంగా పథకాలు అమలు



**ప్రజాపక్షం/మంథని:** ప్రజల ఆకాంక్షలకుఅనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె మీడియాతో పాటు మాట్లాడుతూ అనేక ఏండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతంగా సాగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే మీ సేవ ద్వారా కుటుంబసభ్యుల మార్పులు, చేర్పులు దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సైతం పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు కొత్త రేషన్ కార్డుల కోసం మున్సిపల్ పరిధిలో నిర్వహించే గ్రామసభలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆమె వివరించారు. పట్టణ ప్రజలు ఎవరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందించే దిశగా కృషి చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

# గంగాధర గడ్డపై గోదావరి పరవళ్లు

### నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి జలాలు విడుదల



**ప్రజాపక్షం/గంగాధరః** రైతులు సాగు చేసిన యాసంగి పంటలకు చివరి మడి వరకు సాగు నీరు అందించడానికి గంగమ్మ తల్లి గంగాధర గడ్డపై అడుగు పెట్టింది. ఆదివారం సాయంత్రం నారాయణపూర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలను విడుదల చేయడంతో గోదారమ్మ పరవళ్లు తొక్కింది. చొప్పదండి నియోజకవర్గంలోని రైతుల సాగు చేసిన ఇంచు భూమి సైతం ఎండిపోకూడదన్న సదుద్దేశంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో మాట్లాడి ఎమ్మెల్యే నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయించారు. తాము సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సకాలంలో నీటిని విడుదల చేయించిన మేడిపల్లి సత్యంకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలోని రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురికావద్దని, రైతులు సాగు చేసిన చివరి మడి వరకు సాగునీరు అందిస్తామని భరోసా కల్పించారు. గత పదేళ్లలో బిఆర్‌ఎస్ పార్టీ ఏనాడూ జనవరి మాసంలో నీళ్లను విడుదల చేయించలేదన్నారు. పంటలకు నీరు అందించాలంటే రాళ్ల వాన పడి పంటలు నష్టపోయామని అనుకోవాలని రైతులతో దురుసుగా ప్రవర్తించిన చరిత్ర బిఆర్‌ఎస్ నాయకులదన్నారు. ప్రాజెక్టు వద్ద కరెంటు సమస్య ఉన్నా అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించామని తెలిపారు. నారాయణపూర్ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చొప్పదండి నియోజకవర్గం రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలున్నారు.

## వ్యవసాయ యోగ్యంకాని భూములను తొలగించాలి

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజా పక్షం/గంభీరావుపేట :** వ్యవసాయ యోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి తొలగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకలు, రేషన్ కార్డుల జారీ కోసం మండలంలో నర్మాల, గోరంటాలలో సర్వే కొనసాగుతుండా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భగంగా రికార్డ్స్ పరిశీలించారు. రైతు భరోసా పథకం సాగు చేసే రైతులందరికీ అందుతుందని స్పష్టం చేశారు. యోగ్యం కాని భూములను తొలగించాలి సూచించారు. రేషన్ కార్డులు పలువురు ప్రజలు కలెక్టర్‌ను కోరగా త్వరలోనే ఇస్తామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకలు అందుతాయని తెలిపారు. తహశీల్దార్ భూపతి, ఎంపిడివో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# శంకుస్థాపనలకు నిధులెక్కడివి?




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న మేయర్ సునీల్‌రావుకు ఎక్కడి నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ప్రశ్నించారు. కరీంనగర్ నగరపాలకసంస్థ పాలకవర్గం సమయం వారం రోజులు మాత్రమే ఉందనే ఉద్దేశ్యంతో మేయర్ సునీల్ రావు పలు డివిజన్లలో విచ్చలవిడిగా శంకుస్థాపనలు చేస్తున్నారని, వీటికి ఎక్కడి నుంచి నిధులు తెచ్చిపెడతారని ప్రశ్నించారు. ప్రజలను ఓట్ల కోసం తమ వైపు మలుచుకోవడానికే తప్ప ఈ పనులన్నీ నత్తనడక సాగుతాయని విమర్శించారు. గత రెండు సంవత్సరాల క్రితమే శంకుస్థాపనలు జరిగి చాలా వీధుల్లో రోడ్లు, డ్రైనేజీలుమధ్యలోనే నిలిచిపోయాయని, వాటిని చేపించే శక్తి లేని పాలకవర్గ సభ్యులుప్రస్తుతం శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 60 డివిజన్‌లలో చాలావరకుశాసనసభఎన్నికల ముందు కొబ్బరికాయలు కొట్టి పెండింగ్‌లో పెట్టి వాటిని వదిలేసారని, ఏ ఒక్క పని ముందుకు సాగలేదన్నారు. చాలా రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. గత సంవత్సర కాలానికి పైగా చాలా పనులు మధ్యలోనే నత్తనడకన సాగి ఆగిపోయాయని, పదవీకాలం పూర్తవుతుందనే ఆతృతతో త్వరగా అన్ని డివిజన్లలో తిరుగుతూ శంకుస్థాపన చేయడం విచిత్రంగా ఉందన్నారు. వారు చేసే శంకుస్థాపనలు అన్ని మున్సిపల్ పాలకవర్గం అనుమతి పొందినవా? లేవా? అనే అనుమానాలు ప్రజలకున్నాయన్నారు. వాటన్నింటినీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ నేతలు ప్రజల ముందుకు ఓట్ల కోసం ఈ శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప ఏ పని ముందుకు జరిగే అవకావం లేదన్నారు. మేయర్‌కు పలుమార్లు పలు సమస్యలపై విన్నవించినా గత రెండేళ్లుగా ఏ ఒక్క పనిని చేయలేదన్నారు. అలాంటిది ఇప్పుడెలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మేయర్ కొంత కాలం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరానికి నిధులు ఇవ్వడం లేదని ప్రెస్‌మీట్‌లు పెట్టి చెప్పిన సంధర్భాలు ఉన్నాయని, ఇప్పుడు వీటికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. మేయర్‌కు చిత్తశుద్ధి ఉంటే తన హయాంలోచేసిన పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం దండుగ అన్నోళ్లే.. నీళ్లు వదలడం విశేషం



### 'సుడా'మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్‌ః** కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగిపోయిందని, ఒక్క ఎకరాకు నీరు రాదని, కాళేశ్వరం దం డుగ అన్నవాళ్లే, నేడు కాళేశ్వరం నీళ్లు వదిలి లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుందని మాట్లాడటం సంతోషంగా ఉందని సుడా మాజీ చైర్మన్‌మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు వంగ నాగిరెడ్డి,అల్లం ఎల్లంలతో కలిసి మారెడ్డి రవీందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నీరు వదలడం సంతోషం అని, ప్రాజెక్ట్ ద్వారా లక్ష ఎకరాలకు నీరందుతుందని మీరే ఒప్పుకోవడం సంతోషంగా ఉందన్నారు. కెసిఆర్,హరీష్‌రావులు కాళేశ్వం కోసం రాత్రింబవళ్లు కష్టపడి ప్రాజెక్టులు పూర్తి చేశారన్నారు. మీరు అధికారంలోకి రాక ముందు కాళేశ్వరం మీద చాలా అబద్దాలు చెప్పారని కాళేశ్వరం దండుగ,కమీషన్ల కోసమే అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని,నేడు నీరు వదలడానికి పోటీ పడి పోటోలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూసేకరణ చేసి ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కెసిఆర్,హరీష్‌రావులకే దక్కుతుందని తెలిపారు. కెసిఆర్,హరీష్‌రావులను విమర్శిస్తే సహించమని,కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల కోసం కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత మాదని,సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ వ్యతిరేకి అని,తుపాకీ పట్టుకొని తిరిగి అదృష్టం కొద్దీ సిఎం అయ్యారన్నారు. ఓట్లు, సీట్ల కోసం ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికాంలోకి వచ్చావన్నారు. ఇప్పటికైనా కెసిఆర్,హరీష్‌రావులను విమర్శించడం మానుకో, లేని పక్షంలోగుణపాఠం తప్పదని హెచ్చరించారు. అర్బన్ మండల అధ్యక్షుడు ఎద్దు యాదగిరి, రూరల్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదగిరి,అల్లం కిషన్,మోహన్‌రెడ్డి,హంసకేతన్ పాల్గొన్నారు.

# పదేళ్లల్లో ఒక్క కార్డూ ఇవ్వలేదు : విజయరమణ



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వెళుతుంటే ప్రతిపక్ష టిఆర్‌ఎస్, బిజెపిలు ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నాయని విజయరమణరావు అన్నారు. గత 10 సంవత్సరాల కాలంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క హామీని అమలు పరచలేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు అప్పటి ము ఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును అందించారని బి.ఆర్.ఎస్ పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు అందించిన పాపాన పోలేదన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కొత్త కార్డులు అర్హులైన వారందరికీ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలను అమలు పరుస్తుంటే హరీష్ రావు, కెటిఆర్ తెల్లారి లేచింది మొదలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలుచేస్తున్నారనిఆగ్రహంవ్యక్తం చేశారు. వీరికి తోడు బిజెపి అని అన్నారు. 18 లక్షల 515 మంది గతంలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారని 12,07,558 మంది రేషన్ కార్డుల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జనవరి 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు స్థలం ఉన్న ప్రతి ఒక్క నిరుపేదకు అందిస్తామని అనంతరం ప్రభుత్వమే స్వయంగా ఇంటి స్థలం అందించి ఇల్లు నిర్మాణం చేసి ఇస్తుందని తెలిపారు. గ్రామ సభలలో రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుంటే అతి త్వరలో రేషన్ కార్డు అందించేందుకు అధికారు లు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు వస్తుందని తమ ప్రభుత్వ ప్రజాప్రతినిధుల బాధ్యత అని హామీ ఇచ్చారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి కార్డు అందించడమే లక్ష్యమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూప, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సారయ్య గౌడ్, సాయిరి మహేందర్, ధననాయక్ దామోదర్‌రావు,వేగోళం అబ్బయ్య గౌడ్,చిలుక సతీష్,చీకట్ల మొండయ్య, కల్లేపల్లి జానీ,పన్నాల రాములు,అమీర్ శెట్టి రాజలింగం, బిరుదు కృష్ణ, ముత్యాల రవీందర్,తిరుపతి, మేకల పోచం, దున్నపోతుల రాజయ్య, ప్రేమ్ చందర్‌రావు, రఫీక్, నల్లవెల్లి ప్రభాకర్, గుండా మురళి, గాదాసు రవీందర్, కుమార్ కిషోర్, ఈర్ల శేఖర్, లక్ష్మ ణ్, శోభ పాల్గొన్నారు.

## తైక్వాండో బెల్టులు, సర్టిఫికెట్ల ప్రదానం




**ప్రజాపక్షం/కోరుట్లః** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని నవజ్యోతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం మాస్టర్ తైక్వాండో క్లబ్ ఆదివారం తరపున తైక్వాండో కలర బెల్ట్ అప్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ సెక్రటరి మాస్టర్ ఎస్ సంతోష్ ఆధ్వర్యంలో దాదాపు 75మంది తైక్వాండో ప్లేయర్స్‌కి బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించి వారి వారి అర్హతను బట్టి బెల్టులు , సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వక్త మోటివేషన్ స్పీకర్ విజేత స్టూడెంట్స్ కౌన్సిలింగ్ సెంటర్ అధినేత పుప్పాల నవీన్ మాట్లాడారు.జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోలా గంగరావు మాస్టర్, వైస్ ప్రెసిడెంట్ పెండ్లి రాజేంధర్ మాస్టర్, ఎగ్జామినర్‌గా వ్యవహరించారని మాస్టర్‌క్లబ్ వ్యవస్థాపకులు, తైక్వాండో నేషనల్ రెఫరీ, తైక్వాండో నేషనల్ కోచ్, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్ అయిన నావంది రమేష్ మాస్టర్ తెలిపారు. అసిస్టెంట్ మాస్టర్స్ గజం దీక్షిత, రోహిత్, జశ్వంత్, నవజ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ సుజాత, అధ్యాపక బృందం , టీచర్ పావని పాల్గొన్నారు.

## నీటి విడుదల చేశామన్నది అబద్ధం



**ప్రజాపక్షం/చొప్పదండిః** రైతులను అబద్ధపు ప్రచారాలతో మోసం చేయొద్దని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో యాసంగి పంటలకు నీటిని విడుదల చేశామని సోషల్ మీడియాలో ప్రజాప్రతినిధులు అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్నారని, తీరా క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పంట పొలాలను పరిశీలిస్తే ఎండిపోయాయని రైతులు చూపిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు,ఎమ్మెల్యేలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ కాలక్షేపం చేస్తున్న దాన్ని చూస్తుంటే తెలంగాణ ఎడారిగా మారి అన్నమో రామచంద్ర అనే పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. నవీన్ రావు, విజయేందర్ రెడ్డి, ఆదిమల్లు మల్లేశం, శంకర్ గౌడ్ తదితరులున్నారు.

## సైబర్ నేరగాళ్లున్నారు.. జాగ్రత్త!

**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ముత్తారం ఎస్సై నరేష్ అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ పరిధిలోని బాలు కిరాణా షాప్ చౌరస్తా వద్ద ముత్తారం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ కళబృందం వారిచే అక్షరాస్యత, డయల్ 100,మూఢ నమ్మకాలు, బాల్యవివాహాలు,సీసీ కెమెరాల ఉపయోగాలు, చైన్ స్నాచింగ్, సైబర్ నేరాలపై రైతు ఆత్మహత్యలపై పాటలు పాడి అవగాహన కల్పించారు. వివిధ అంశాలపై పోలీస్ కళాజాత సభ్యులు అక్షరాస్యత, మూఢ నమ్మకాలు, సీసీ కెమెరాలు, చైన్‌స్నాచింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముత్తారం ఎస్సై నరేష్ మా ట్లాడుతూ గుడుంబా నివారణ చర్యలు గూర్చివివరించారు. హెడ్ కానిస్టేబుల్ మధునయ్య, పోలీస్ కానిస్టేబుల్‌రమేష్,అశోక్,హోంగార్డులు గోపాల్, లక్ష్మ ణ్, తాంద్రరాజు, కళాబృంద సభ్యులున్నారు.



## పట్టణాభివృద్ధికి సహకరించండి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి సహకరించాలని,వాకర్ సమస్యలను పరిష్కరిస్తామని, పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాకింగ్ చేశారు. పలు సమస్యలను (వాకింగ్ ట్రక్) వాకార్స్ సభ్యులు వారి దృష్టికి తేగా తొందరలోనే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని అలాగే అందరం కలిసి కట్టుగా ఉన్నప్పుడే పట్టణాన్ని అభివృద్ధి చేసుకోగలం అని అన్నారు. వాకర్స్ మరియు వాకర్స్ అసోసియేషన్స్ సభ్యులు, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదా?

### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లాగౌడ్ ధ్వజం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఓసిపి 5 యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న తీరుపై ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు కండ్లెర్ర చేశారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.ఒసిపి 5 లో ట్రేనింగ్ లేని ఆపరేటర్ లతో వాల్వోలను నడిపించి వాల్వో ప్రమాదానికి ఓసిపి 5 అధికారులు కారణమని వారు ఆరోపించారు అదేవిధంగా టెక్నిషియన్స్ లేకుండా మజ్దూర్ లతో పనులు చేయించుతున్నారని, వారు ప్రమాదాలకు గురయితె ఎవరు బాధ్యత వహిస్తారని వారు ఓసిపి 5 యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఓసిపి 5 లో అధికారుల నిర్వాకం వల్ల నిన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడని, ఓసిపి 5 యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఇట్టి ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు.ఓసిపి 5 యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారం లో గుర్తింపు సంఘం కు ప్రాధాన్యత ఇవ్వకుండా, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశాలలో కార్మికుల భద్రత పై తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకుండా ఇతర యూనియన్ లతో చెట్టాపట్టాలేసుకుంటూ ప్రమాదాలకు కారకులౌతున్నారని ఆరోపించారు.ఓసిపి 5 యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశాలను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఓసిపి 5 యాజమాన్యం పై సింగరేణి ఉన్నాతాదికారులకు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా కంపెనీ క్వార్టర్స్ ను రిపేర్ కోసం కార్మికులు దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి సమయం తీసుకుంటూ మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారనిఆరోపించారు. యూనియన్‌కు మెంబర్‌షిప్ కార్యక్రమం జయప్రదం చేయాలని, ఇతర యూనియన్‌లు చేసే మాటలు పట్టించుకోవద్దని కోరారు. ఏఐటియుసి నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, గుర్రం ప్రభుదాస్, గండి ప్రసాద్, ఉదయభాను, మాదిరెడ్డి శ్రీధర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూడి వెంకన్న, దొంత సాయన్న,కే.శ్రీనివాసరావు,బలుసురవి,చెప్యాల భాస్కర్, ఆకునూరి శంకరయ్య, గొడిశెల నరేశ్, చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్, కలవేణి రాజేశ్, ఏగోలపు శంకరయ్య, కొప్పులలింగయ్య, నంది నరేశ్,సదా మల్లేష్ ఉన్నారు.

## మంత్రి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుండి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలపై నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జుక్కతల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హాజరై పలు సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వానికి కొన్ని సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 21న చలో కలెక్టరేట్



**ప్రజాపక్షం/బాన్సువాడ:** ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 21న రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని ఆశా వర్కర్లు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రవిందర్ అన్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించడం తోపాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు లావణ్య, రజిత, పద్మ, వరలక్ష్మి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మిషన్ భగీరథ మెగా పైప్ లైన్ అల్లాదుర్గం మండలం చిల్వర శివారులో161 జాతీయ రహదారి పక్కన లీకేజీ కావడంతో వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు చెరువుల తలపిస్తున్న వ్యవసాయ భూములు గత 15 రోజుల నుండి తాగునీరు వృధా పోతున్న పట్టించుకోని మిషన్ భగీరథ అధికారం పలు పత్రికల్లో ప్రచురించిన కదలిక లేని యంత్రాంగం గతంలో అదే శివారులో పైపు పగిలి రహదారిపై వెళుతున్న చిల్వర గ్రామస్తులకు దెబ్బలు తగిలి గాయాలు అయిన విషయం విధితమే అయినా పలుమార్లు లీకేజీ కావడం ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి వెంబడి ఎక్కడ చూసినా మిషన్ భగీరథ నీరు లీకేజీ కావడం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

## పులిపిల్ల సంచారం.. ఆందోళనలో రైతన్నలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఠాణాకలాన్ రెవెన్యూ శివారులో బోధన్‌నిజామాబాద్ ప్రధాన రహదారి సమీపంలో పులి పిల్ల సంచరిస్తోంది. పంట పొలాల్లోకి వెళ్లిన బాపునగర్ గ్రామానికి చెందిన కొందరు యువకులకు పులి పిల్ల కంట పడింది. స్పిన్నింగ్ మిల్ సమీపంలో డాంబర్ ప్లాంట్ దగ్గర పులి పిల్ల కనిపించినట్లు యువకులు తెలిపారు. పులి పిల్ల సంచార చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి విషయాన్ని వెంటనే యువకులు అటవీ శాఖ అధికారులు సమాచారమిచ్చారు. ఆ ప్రాంతంలో పులి పిల్ల సంచారించడంతో పులిపిల్లతో పాటు తల్లి కూడ ఉంటుందని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. పులి పిల్ల జాడ కోసం అటవీ అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## పచ్చదనంతో వరి పొలాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఈ దృశ్యం చూడటానికి రెండు కళ్లు సరిపోవడం లేదు కదూ..! ఇంతటి పచ్చదనం చూసి ఎక్కడో ఉందని అనుకునేది.. మన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఆలీసాగర్ ఉద్యానవనం సమీపంలోని పంట పొలాలు. యాసంగిలో రైతులు వరి సాగు చేయగా పైరు పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని పొలం గట్లతో ప్రకృతి అందాలు అందంగా కన్పిస్తున్నాయి. కనుచూపు మేర పచ్చని పైరు కనువిందు చేస్తుంది. ఈ అందాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. ఈ దృశ్యాన్ని అలీ సాగర్ హరిత హోటల్ నుంచి చూస్తే చేలు భూమతకు పచ్చని చీర కట్టినట్లుగా ఉండటంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు కొద్దిసేపు ఆగి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. కొందరు ప్రకృతి ప్రేమికులు సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు.

## నర్సింగ్ రోడ్డు ప్రమాదంలో బచ్చురాజుపల్లివాసి మృతి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన చిమ్మనబోయిన రాజు కుమారుడు సురేష్ వయస్సు 27 సం॥ నర్సింగ్ మండలం వడ్డే గుడిసెల వద్ద యాక్సిడెంట్ అయి చనిపోవడం జరిగింది. ఇతనికి భార్య జయ 1సంవత్సరం కొడుకు ఉన్నాడు. సురేష్ మరణంతో గ్రామంలో విషాదశాల అమ్ముకున్నాయి. యాక్సిడెంట్ కు గల పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# నిజామాబాద్ పట్టణాభివృద్ధికి రూ.400కోట్లు

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ అర్బన్ అభివృద్ధికి రూ. 400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం జరిగిందని నిజామాబాద్ రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి, రాష్ట్రంలోనే ప్రథమ శ్రేణి జిల్లాగా ఉండాలన్నకోరికతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజామాబాద్ అర్బన్ అభివృద్ధికి రూ. 400 కోట్లు కేటాయించడం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం అండ్ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ చౌక్‌వద్దగల ప్రెస్‌క్లబ్ సమీపంలోని జిల్లా హెల్త్ అండ్ వాటర్ సప్లై శాఖ ఆధ్వర్యంలో అమృత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజామాబాద్ నగరం స్మార్ట్ సిటీగా ఎంపిక చేయడం జరిగిందని, ఒక్క నిజామాబాద అర్బన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు వెచ్చించి నగర సర్వతోముఖాభివృద్ధికి నడుం కట్టిందని అన్నారు. నిజామాబాద్ నగరం ప్రజల అవసరాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భూగర్భ మురికి కాలువ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం) ఇదివరలో కాంగ్రెస్ హయాంలో అండర్ డ్రైనేజీ పథకాన్ని కొనసాగిస్తు నిజామాబాద్ నగరం అంతటిని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంని మారుస్తు 43 లక్షల గృహాలకు అండర్ డ్రైనేజీ వ్యవస్థను అనుసంధానం చేస్తారని అన్నారు. తాగునీటి సదుపాయాన్ని నగర ప్రజలందరికి సుమారు నగరంలో 180 కి.మీల విస్తీర్ణంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి పైప్‌లైన్లు, ట్యాంకులు తదితర ఏర్పాట్లు చేస్తారని అన్నారు. ఇట్టి బృహత్ కార్యక్రమంలో భాగంగా ఈ అమృత్‌పథకం ఏర్పాటు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సంస్కృతి సంప్రదాయాలు మరిచి నేడు హంప ఆర్భాటాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు, అందుకు ప్రస్తుత సమాజం భారీ మూల్యాన్ని చెల్లించవలసి వస్తుందన్నారు. మరీ ముఖ్యంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడానికి ఒక గంట వ్యాయామానికి లేదా యోగా తదితర ఆరోగ్యకరమైన పనులకు కేటాయించాలని, దీనివల్ల ఆరోగ్యం బాగుంటుందని దాంతో వైద్య ఖర్చులు తగ్గుతాయని, అన్నారు. విందులు, వినోదాలు ఆర్భాటాలకు పోయి అధిక ధనాన్ని వెచ్చించవద్దని అంతేకాకుండా సెల్‌ఫోన్ల వాడకంతో ప్రయోజనాన్ని వదిలి అప్రస్తుతమైన విషయాలను వీక్షించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కావున మన సంస్కృతిని గౌరవిస్తు ప్రతి ఒక్కరు శాస్త్ర, సాంకేతిక పరంగా మంచి కొరకు ఎంత కావాలో అంత స్వీకరిస్తు అనవసర విషయాలకు తావివ్వకుండా ఉండాలని హితవు పలికారు.

**మహిళలకు ఆపత్కాలంలో భరోసానిచ్చే భరోసా కేంద్రం**

ఆపత్కాలంలో మహిళలకు భరోసా ఇచ్చి ఆత్మస్థైర్యాన్ని కల్పించేదే భరోసా కేంద్రం అని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ సమీపంలోని భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ భరోసా సెంటర్ జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి విషయాన్ని చేర్చే విధంగా చూడాలన్నారు. భరోసా కేంద్రాలకు వచ్చే బాధితులకు అన్ని రకాల సేవలు అందించడంతోపాటు మనో స్థైర్యాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంగా మనమీద ఉందన్నారు. అనంతరం భరోసా కేంద్రం విధి విధానాలను, బాధితులకు అందించే సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి జితేందర్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధు శర్మ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎస్‌సి, ఎస్‌టి బిసి కమిషన్ ఛైర్మన్ మహ్మద్ అలీ షబ్బీర్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సభాధ్యక్షులు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు, సుడా ఛైర్మన్ కేశ వేణు, రాష్ట్ర ఉర్దూ బోర్డు అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఏసిపిలు, భరోసా కేంద్రం సిబ్బంది, పోలీసు అదికారులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంటుకు హాజరైన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బోథ్:** బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో గత ఏడు రోజుల నుంచి జరుగుతున్న ఎమ్మెల్యే క్రికెట్ కప్ పోటీల బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ముందుగా ఫైనల్స్‌లో ఉన్న బోథ్,ఇచ్చోడ క్రికెట్ టీం లకు టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతిగా 15 వేలు లను బోథ్ ఎమ్మెల్యే సొంత డబ్బులతో ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు మంచి మార్గంలో నడవడానికి క్రీడల్లో ప్రోత్సాహిస్తున్నామని గత ప్రభుత్వం కెసిఆర్ సిఎం కప్ పేరుతో యువకులను ప్రోత్సాహించిందని గుర్తు చేశారు. క్రీడాకారులు కేవలం క్రీడల్లోనే పోటా పోటీగా ఆడాలని గెలుపు ఓటముల తరువాత ఆటను ఆట వరకే పరిమితం చేయాలని గొడవలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, శ్రీనివాస్, దివాకర్ రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

## రైతు భరోసా రేషన్ కార్డుల 'ఫీల్డ్ వెరిఫికేషన్' పరిశీలన



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ఆదివారం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కౌడిపల్లి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు భరోసా రేషన్ కార్డుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పకడ్బందీగా పారదర్శకంగా జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు పథకాల లబ్ధిదారులు ఈ ప్రక్రియ ద్వారా తమకు అందే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ సెక్రెటరీ వెంకటేశం అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు

### కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ జిల్లా మెదక్ మండలం పాతూర్ గ్రామంలో న్యూ రేషన్ కార్డ్ వెరిఫికేషన్ ను క్షేత్రస్థాయిలో ఆదివారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. నూతన రేషన్ కార్డులు జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన పేదలకు రేషన్ కార్డులను అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియని చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని తెలిపారు. ఇంతకుముందు జరిగిన సర్వేలలో ఎప్పుడు దరఖాస్తు ఇవ్వకపోయినా గ్రామ సభలో వాళ్ళ చేత కొత్త దరఖాస్తులు తీసుకోబడుతాయి. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యంగా వివరించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం రేషన్ కార్డ్‌ల లబ్ధిదారుల జాబితా సామిజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వే ఆదారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 ప్రతిష్ఠాత్మక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ఆక్రమణలు తొలగించుకుంటే ఆందోళన



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ఆక్రమణలు తొలగించుకుంటే ఆందోళన చేస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమయ్య అన్నారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో కెనాల్ బౌండ్రి, ప్రభుత్వ స్థలాలు రక్షణకై రౌండ్‌టేబుల్ సమావేశం కోటగిరి ఎత్తొండ రోడ్డు ఎవస్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు కాంగ్రెస్ బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాసంఘాలు దళిత సంఘాలు ఎంఆర్‌పిఎస్ అంబేద్కర్ సంఘం పాల్గొన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమయ్య మాట్లాడుతూ కెనాల్ బౌండ్రీ ఆక్రమించటంతో రైతాంగానికి ఇబ్బందులకు గురవుతారని భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని అక్రమాలు పాల్పడిన వారిపై నోటీసులు ఇచ్చి తొలగించాలని కెనాల్ బౌండ్రీలు ప్రభుత్వ స్థలాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో పోచీరాం, శ్రీను, రాములు, గంగాధర్, సాయన్న, పోశెట్టి, లింగారాం, సాయిలు, పాల్గొన్నారు.

## పసుపు బోర్డును స్వాగతిస్తున్నాం

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని ఎంపీ అరవింద్ గాలి మాటలు మానేసి పసుపుకు మద్దతు వచ్చేలా చూడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్వింటాలుకు పసుపుకు రూ. 15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టం చేశారు. తూతూ మంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయటం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచించారు. పసుపు బోర్డునే ఏర్పాటు చేయాలని తాము కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని గుర్తు చేశారు. తాము పసుపు బోర్డుపై డిమాండ్ చేసినప్పుడు బీజేపీ ఎంపీ అరవింద్ రాజకీయాల్లో కూడా లేరని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటించిన విధానంపై అభ్యంతరాలున్నాయని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఆహ్వానించలేదని, ప్రోటోకాల్‌ను పాటించలేదని ఇది ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవటం బాధాకరమన్నారు. పసుపు బోర్డును ఏర్పాటు చేయాలంటూ 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. పలువురు ముఖ్యమంత్రులను కలిసి పసుపు బోర్డు ఏర్పాటుకు మద్దతుగా లేఖలు సేకరించాను. ప్రధానమంత్రిని మోడీని రెండుసార్లు కలిసి బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. పార్లమెంట్‌లో అనేకసార్లు మాట్లాడటమే కాకుండా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటూ ప్రైవేట్ మెంబర్ బిల్లును కూడా ప్రవేశపెట్టానని వివరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, బాజిరెడ్డి జగన్, మాజీ ఛైర్మన్ అలీమ నాయకులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఓ ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు పొడ్చన్ పల్లి గ్రామానికి చెందిన అరిగే కృష్ణ కూతురు సింధూ(19) మెదక్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. గత నెల రోజులుగా కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో దిగులుగా ఉంటుంది. కుటుంబీకులు కళాశాలకు కచ్చితంగా వెళ్ళమని చెప్పడంతో క్రమంలో ఆవేశానికి గురైన సింధూజ శనివారం మధ్యాహ్నం ఇంట్లో కుటుంబీకులు ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. వెంటనే కుటుంబీకులు గమనించి స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందింది. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/శివ్వంపేట:** సికింద్లాపూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర, బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం సంక్రాంతి మొదటి వారం నుండి మహా శివరాత్రి వరకు ప్రతి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జాతర, బ్రహ్మోత్సవాలు మొదటివారం ఉత్సవాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కార్యనిర్వహణ అధికారి శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ శర్మలు, ఇతర అర్చకుల బృందం ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు ముగిసిన తర్వాత దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులకు, నాయకులకు, దేవస్థానం వారు శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమెతో పాటు స్వామి వారిని దర్శించుకున్న వారిలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రాగౌడ్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పోచయ్య, నాయకులు కొత్తపేట యాదాగౌడ్, చింత స్వామి, నర్సింగ్ రావు, వాకిటి హన్మంత్‌రెడ్డి, నరసింహారెడ్డి, భిక్షపతి రెడ్డి, సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, కుంట లక్ష్మణ్, యువనాయకులు రాకేష్ రెడ్డి, శైలేందర్, సాయి గౌడ్, సమీర్ తదితరులు ఉన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** అతివేగంగా వెళ్తూ రోడ్డు పక్కన నిలబడ్డ మహిళ కారు ఢీ కొట్టగా ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చేటుచేసుకుంది. నిజామాబాద్‌కు చెందిన రజిని(45) అనే మహిళ ఎడపల్లిలో ఓ వేడుకకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఎడపల్లి రిక్వేస్ట్ స్టాప్ దగ్గర బస్ కోసం నిలబడింది. అప్పుడే బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వేగంగా వెళ్తున్న ఏపీ29సీబీ 9599 అనే నంబర్ గల కారు ఢీకొట్టడంతో ఆ మహిళ ఎగిరి పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## చెట్ల పొదల్లో పసికందు!

### ఆడబిడ్డనా అని వదిలారా?



**ప్రజాపక్షం/మాక్లూర్:** అభం శుభం తెలియని, రక్తం మరకలు ఆరని పసి కందును కసాయి తల్లిదండ్రులు చెట్ల పొదల్లో పారేసిన అమానుష ఘటన నిజామాబాద్ జిల్లాలోని మాక్లూర్ మండలం చిక్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం గ్రామస్తుడు ర్యాపాని గణేష్ వాకింగ్ చేద్దామని తన ఇంటినుండి బయల్దేరగా గ్రామ శివారు ప్రాంతంలో మోటారు పక్కన ముళ్ల పొదల్లో పాప ఏడుపులు వినిపించగా వెళ్లి చూడగా రక్తం మరకలు ఆరని పసికందును చూడగానే ఒక్కసారిగాయువకుడు షాక్‌కు గురయ్యాడు. అప్పుడే పుట్టిన పసిపాపను బొడ్డును కూడా కత్తిరించకుండానే రక్తపు మరకలతోనే పేపర్లో చుట్టి కర్చీఫ్‌లో కట్టి ఉంచారు. వెంటనే ఆ పసిపాపను తన ఇంటి వద్దకు తీసుకెళ్ళి వెంటనే కుటుంబ సభ్యులు పురిటి నొప్పులతో పుట్టిన బిడ్డకు రక్తం మరకలు చూసి చలించి గుడ్డతో తుడిచి బొడ్డు కత్తిరించి గ్రామంలోని రిపోర్టర్ సతీష్, నవీన్, భోజన్న, షబ్బీర్, నవీన్ గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు పసిపాపను గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రానికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. అంగన్‌వాడి టీచర్లు సమంత, ఆశ వర్కర్లు సువర్ణ, మంజుల సిబ్బందితో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అప్పుడే పుట్టిన బిడ్డను తరలించారు. తీసుకొచ్చే సమయంలో ఇద్దరు యువకులు బైక్‌మీద పారిపోయినట్టు కూడా గణేష్ తెలిపారు. పోలీసులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఇలాంటి దుర్మార్గానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి...**

అప్పుడే పుట్టిన పసిపాపను పొదల చాటున వదిలిన కసాయి తల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. రక్తం మరకలు ఆరని పసిపాపను చూసి గ్రామస్తులందరు విలవిలలాడారు. అలాగే గ్రామంలోని కొందరు మహిళలు పాపను నాకు కావాలంటే నాకు కావాలంటూ పాపని తీసుకోవడానికి ముందుకు వచ్చారు. కానీ ఎవరికి ఇవ్వలేరు. సంక్షేమ శాఖ నుండి తీసుకోవాలని అధికారులు సూచించారు.

# క్రీడ

## రోహిత్ మళ్లీ విశ్వరూపం చూపిస్తాడు..

### సూర్యకుమార్ ఉంటే..: సురేశ్ రైనా



టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ వచ్చే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో 2019 ప్రపంచ కప్ మాదిరిగా దంచి కొడతాడని భారత మాజీ ఆటగాడు సురేశ్ రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు. 2019 వరల్డ్ కప్‌లో రోహిత్ విశ్వరూపం ప్రదర్శించాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 81 సగటుతో 648 రన్స్ (ఐదు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ) చేసి టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే, ఇటీవల హిట్‌మ్యాన్ జోరు తగ్గింది. బ్యాటర్‌గా వరుస మ్యాచ్‌ల్లో విఫలమవుతూ అభిమానులను నిరాశపరుస్తున్నాడు. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో చివరి టెస్టుకు స్వయంగా జట్టు నుంచి వైదొలిగాడు. ఈ నేపథ్యంలోనే రోహిత్ తిరిగి పుంజుకుంటాడని సురేశ్ రైనా పేర్కొన్నాడు. '2011 ప్రపంచకప్ జట్టుకు ఎంపికకాకపోవడంతో రోహిత్ చాలా బాధపడ్డాడు. తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2013తో ఆ లోటును తీర్చుకున్నాడు. మేం చివరగా (2013) ఇంగ్లాండ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. అయితే, ప్రస్తుతం దుబాయ్ వేదికగా భారత్ మ్యాచ్‌లు ఆడనుంది. అక్కడి పరిస్థితులు ఇంగ్లాండ్ కంటే పూర్తిగా భిన్నంగా ఉంటాయి. యూఏఈలో ఎలా ఆడాలో రోహిత్‌కు తెలుసు. ఒకవేళ అతను 2025 ఓవర్ల వరకు ఆడితే 2019 వరల్డ్ కప్ ప్రదర్శన పునరావృతం చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని రైనా పేర్కొన్నాడు.

### సూర్యకుమార్ ఉంటే..

ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కకపోవడంపై రైనా స్పందించాడు. 'సూర్య ప్రపంచ కప్ జట్టులో అంతర్భాగంగా ఉన్నాడు. అతను గేమ్‌లో ఏ దశలోనైనా ఓవర్‌కు 9 పరుగుల చొప్పున స్కోర్ చేయగల సమర్థుడు. విభిన్నంగా బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించగలడు. ఒకవేళ సూర్య జట్టులో ఉంటే ఎక్స్‌ఫ్యాక్టర్‌గా ఉండేవాడు. కానీ, ఫామ్‌లో లేని టాప్ 3 బ్యాటర్లపై ఇప్పుడు బాధ్యత ఉంటుంది. శుభ్‌మన్ గిల్ సరైన సమయంలో వైస్ కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నాడు. అతను భారత క్రికెట్ భవిష్యత్ సూపర్ స్టార్. వన్డేల్లో ఇప్పటికే సత్తాచాటాడు. గిల్‌ను ఎలా ముందుకు నడిపించాలో రోహిత్‌కు తెలుసు' అని సురేశ్ రైనా వివరించాడు.



## బౌలర్లు భళా..

### టీమిండియా శుభారంభం

అండర్19 టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత అమ్మాయిలు శుభారంభం చేశారు. తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఈ పోరులో మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్.. భారత బౌలర్ల దెబ్బకు 13.2 ఓవర్లలోకే చేప చుట్టేశారు. 44 పరుగులు మాత్రమే చేసి కుప్పకూలారు. విండీస్ బ్యాటర్లలో అసబి క్యాలెండర్ (20 బంతుల్లో 1 ఫోర్ సాయంతో 12), కెనికా కాసర్ (29 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్ సాయంతో 15 పరుగులు) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. సమరా రామ్ నాథ్, అమృత రామ్ తహల్ సహా ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. టీమ్ఇండియా బౌలర్లలో పరుణికా సిసోదియా 3 వికెట్లు తీయగా.. జోషిత 2, ఆయుషి శుక్లా 2 వికెట్లు పడగొట్టారు.

అనంతరం ఈ స్వల్ప లక్ష్యాన్ని మన అమ్మాయిలు 4.2 ఓవర్లలోనే ఊదేశారు. ఒక వికెట్ కోల్పోయి సునాయసంగా ఛేదించారు. తెలుగమ్మాయి గొంగడి త్రిష (2 బంతుల్లో 4, 1 ఫోర్) నిరాశ పరిచింది. ఆ తర్వాత కమిలిని (13 బంతుల్లో 16*.. 3 ఫోర్లు), సానికా చాల్కే (11 బంతుల్లో 18*.. 3 ఫోర్లు) పరుగులు సాధించారు. జోషితా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకుంది.

### భారత అమ్మాయిల జట్టు

గొంగడి త్రిష, జి కమలిని (వికెట్ కీపర్), సానికా చాల్కే, నికి ప్రసాద్ (కెప్టెన్), భావికా అహిరే, మిథిలా వినోద్, ఆయుషి శుక్లా, జోషిత, పరుణికా సిసోడియా, షబ్నమ్ షకీల్, సోనమ్ యాదవ్.

### వెస్టిండీస్ జట్టు

అసబి క్యాలెండర్, సమారా రామ్ నాథ్ (కెప్టెన్), నైజాని కంబర్‌బ్యాచ్, జహజారా క్లాక్స్‌టన్, బ్రియానా హరిచరణ్, కెనికా కాసర్, అబిగెల్ బ్రైస్, క్రిస్టెన్ సదర్లాండ (వికెట్ కీపర్), అమృతా రామ్‌తహల్, అమియా గిల్బర్ట్, సెలీనా రాస్.

### ఆటగాళ్ల ఎంపిక.. గంభీర్, రోహిత్ మధ్య

## అభిప్రాయభేదాలు?



ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం అజిత్ అగార్కర్ సారథ్యంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 6న ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్, ఫిబ్రవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ మొదలవుతుంది. ఈ ట్రోఫీ కోసం రోహిత్ నాయకత్వంలో 15 మంది ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేశారు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు అదనంగా పేసర్ హర్షిత్ రాణాకు చోటునిచ్చారు. శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. అయితే, కొంతమంది ఆటగాళ్ల ఎంపిక విషయంలో కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ మధ్య అభిప్రాయభేదాలు తలెత్తినట్లు వార్తలొస్తున్నాయి. హార్దిక్ పాండ్యకు వైస్ కెప్టెన్ బాధ్యతలు కట్టబెట్టాలని గంభీర్ అనుకున్నాడట. అయితే, శుభ్‌మన్ గిల్‌ను ఉప సారథిగా నియమించాలని రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పట్టుబట్టారట. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రాణించిన సంజు శాంసన్‌కు జట్టులో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. శాంసన్‌ను తీసుకోవాలని గంభీర్ భావించాడట. కానీ, రోహిత్, అగార్కర్ మద్దతుతో పంత్ ఎంపికయ్యాడని సమాచారం. విజయ్ హజారే టోర్నీ సందర్భంగా కేరళ నిర్వహించిన శిబిరానికి దూరంగా ఉండటం, దేశవాళీ జట్టులో ఆడకపోవడం శాంసన్‌కు ప్రతికూలంగా మారాయి.



## నేను సంపాదించిన ఆస్తి అదే

### – బాలయ్య

నటసింహం బాలయ్య–దర్శకుడు బాబీ కాంబినేషన్ లో సంక్రాంతి కానుకగా వచ్చిన డాకు మహారాజ్ బ్లాక్ బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఈ చిత్రం తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబడుతోంది. పైగా సంక్రాంతి సెలవులు కూడా కలిసి రావడంతో.. ఈ సినిమాకి సాలిడ్ కలెక్షన్స్ వచ్చాయి. ఇక 'డాకు మహారాజ్ ప్రమోషన్ ఈవెంట్లో బాలయ్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ముఖ్యంగా ఫుడ్ విషయంలో తన భార్య వసుంధర తనను తిడుతుందని బాలయ్య చెప్పడం విశేషం. కానీ, తాను ఫిట్‌గా ఉండేందుకు ప్రత్యేక రహస్యం ఏమీ లేదని.. షూటింగ్ సమయంలో తాను ప్రొడక్షన్ ఫుడ్ కూడా తింటానని బాలకృష్ణ చెప్పారు. అలాగే బాలయ్య ఇంకా మాట్లాడుతూ.. పార్టీలకు, కులాలకు అతీతంగా తనకు అందరు ఫ్యాన్స్ ఉన్నారని.. జీవితంలో అదే తాను సంపాదించిన ఆస్తి అని బాలయ్య తెలిపారు. మొత్తానికి డాకు మహారాజ్‌తో ఈ సంక్రాంతి సీజన్‌లో బాలకృష్ణ మరో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు.

# రీల్

## 'అఖండ–2'లో సీనియర్ హీరోయిన్ శోభన ?



నటసింహం బాలయ్య–బోయపాటి శ్రీను కాంబినేషన్లో వచ్చిన 'అఖండ' చిత్రం అద్భుత విజయాన్ని సాధించింది. దీంతో 'అఖండ 2 – తాండవం'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. కాగా తాజాగా ఈ సినిమాలో మరో సీనియర్ హీరోయిన్ నటించనుందని తెలుస్తోంది. ఒకప్పటి హీరోయిన్ శోభన ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తోందని.. ఆమె పాత్ర ఓ సన్యాసిని అని తెలుస్తోంది. సినిమాలో శోభన పాత్రలో చాలా వేరియేషన్స్ కూడా ఉంటాయట., మొత్తానికి ప్రస్తుతం ఈ సినిమాలో నటించే నటీనటుల ఎంపిక పై దర్శకుడు బోయపాటి దృష్టి పెట్టారు. ఆల్ రెడీ, ఇప్పటికే పలు కీలక పాత్రల్లో ఇతర భాషల నటులను తీసుకోవాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. కాగా ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. బోయపాటి శ్రీను–బాలయ్య కాంబినేషన్‌లో హ్యాట్రిక్ విజయాలు నమోదయ్యాయి. దీంతో 'అఖండ 2 – తాండవం' పై రెట్టింపు అంచనాలు ఉన్నాయి.



## స్కూల్ టీచర్‌పై క్రష్ ఉండేది

### – మీనాక్షి చౌదరి

నటి మీనాక్షి చౌదరి ఈ మధ్య వరుసగా హిట్లు అందుకుంటుంది. గతేడాది విజయ్ గోట్, లక్కీ భాస్కర్‌తో హిట్లు అందుకున్న ఈ భామ తాజాగా సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా మూవీ సక్సెస్‌కి సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహించింది చిత్రయూనిట్. అయితే ఈ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. తనకు స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని చెప్పుకొచ్చింది. మనందరికీ స్కూల్ లేదా కాలేజీ టైంలో క్రష్ ఉంటుందని.. ఇది అబ్బాయిలకే కాదు అమ్మాయిలకు కూడా ఇలా ఉంటుంది. నాకు కూడా నా స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని అతడంటే చాలా ఇష్టమని మీనాక్షి తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

### ది రాజా సాబ్ రిలీజ్

## ఈ నెలకు షిఫ్ట్?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ఇపుడు చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు మారుతీతో చేస్తున్న సాలిడ్ హారర్ కామెడీ థ్రిల్లర్ చిత్రం ది రాజా సాబ్ కూడా ఒకటి. మరి ఈ సినిమా పట్ల కూడా మంచి బజ్ నెలకొనగా ఇపుడు ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కంప్లీట్ అవుతుంది. అయితే ఈ చిత్రం విషయంలో రీసెంట్‌గా సంగీత దర్శకుడు థమన్ చేసిన కామెంట్స్ కూడా మంచి ఆసక్తి రేపగా ఇపుడు ఈ సినిమా రిలీజ్ ఏప్రిల్‌లో ఉండకపోవచ్చు అనేది కూడా దాదాపు ఖరారు అయ్యింది. అయితే మరి రాజా సాబ్ రాక ఎప్పుడు అనేది ఇపుడు బజ్ తెలుస్తుంది. దీనితో ఈ చిత్రాన్ని మేకర్స్ ఏప్రిల్ నుంచి జూలై నెలకి షిఫ్ట్ చేసినట్టుగా టాక్ వినిపిస్తుంది. జూలై మూడో వారానికి అలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్‌లు హీరోయిన్స్‌గా నటించగా ఈ చిత్రానికి టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

### దావోస్ సమావేశాలకు భారత్ నుండి

## అతిపెద్ద బృందం

### రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, ఫడ్నవీస్ సహా ఐదుగురు కేంద్రమంత్రులు



దావోస్ : ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) 55వ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం అవుతున్నాయి. దావోస్‌లో ఐదు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలలో భారతదేశ "భిన్నత్వంలో ఏకత్వ" ప్రదర్శనకు ఈసారి భారీ ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూలేనివిధంగా భారత ప్రభుత్వం తరపున అతిపెద్ద ప్రతినిధి బృందం ఈసారి దావోస్ సమావేశాలలో పాల్గొంటున్నది. కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ నాయకత్వంలో ఒక పెద్ద ప్రతినిధిబృందం ఈ సమావేశాలకు వెళ్ళింది. ఐదుగురు కేంద్ర మంత్రులు, మూడు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, ఇతర రాష్ట్రాల నుండి అనేకమంది మంత్రులు, 100 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఇతర నాయకులు, ప్రభుత్వ అధికారులు, పౌర సంఘాలు, కళలు, సాంస్కృతిక విభాగాలకు చెందిన ప్రముఖులు అత్యంత ప్రతిష్టాత్మకమైన, నిర్ణయాత్మకమైన ఈ సమావేశాలలో పాల్గొంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొంటున్నారు. తెలంగాణ నుండి మరో మంత్రి డి.శ్రీధర్‌బాబు, సీనియర్ అధికారులు పెట్టుబడులు సాధించే లక్ష్యంతో వెళుతున్నారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, తమిళనాడు మంత్రి టిఆర్‌బి రాజా, కేరళమంత్రి రాజీవ్, ఉత్తరప్రదేశ్ మంత్రులు కూడా పాల్గొంటున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలలో రూ.7 లక్షలకోట్ల మేరకు అవగాహనా ఒప్పందాలు చేసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. "భారతదేశ ఆలోచనా ప్రక్రియను, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆర్థిక విధానాన్ని, సాంకేతికసామర్థ్యాన్ని పెంచుకుని వివిధ రంగాలలో భారతదేశం ఎలా పరివర్తన చెందింది అనే విషయాల గురించి అర్థం చేసుకోవడానికి దావోస్ లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశం ఎంతో ఆసక్తి చూపిస్తున్నది" అని అశ్వనీ వైష్ణవ్ అన్నారు. దావోస్‌కు బయలుదేరి వెళ్ళేముందుగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. అశ్వనీ వైష్ణవ్‌తోపాటు కేంద్రమంత్రులు సి.ఆర్.పాటిల్, చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌధురి, కె.రామ్మోహన్ నాయుడు ఈ సమావేశాలకు వెళ్ళారు.2025లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన సవాళ్ళు ఎదుర్కొంటుందని ప్రపంచ ప్రసిద్ధ ప్రధాన ఆర్థిక వేత్తలు ఇప్పటికే అంచనావేశారు. కేవలం 17 శాతం మాత్రమే మెరుగుదలను వారు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది అమెరికా ఆర్థిక వ్యవస్థ బాహుబలిస్థాయిలో ఫలితాలు సాధిస్తుందని, చైనా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని, దక్షిణ ఆసియాలో ప్రధానంగా భారత ఆర్థిక వ్యవస్థ కూడా ఎంతో బలంగా వృద్ధి చెందుతుందని ప్రపంచ ప్రసిద్ధ ముఖ్య ఆర్థిక వేత్తలు అంచనావేశారు. ఈ నేపథ్యంలో అనేక నివేదికలు ఈ వేదిక ద్వారా విడుదల అవుతాయి. కీలకమైన సమస్యలపై చర్చలు జరుగుతాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ దృశ్యమాధ్యమ విధానం ద్వారా ఈ సమావేశాలలో పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంపన్న కంపెనీలకు చెందిన సిఇఓలు ఈ సమావేశాలలో తమ ప్రభావం చూపించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సమావేశాలకు వెళ్ళడంలేదు. జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షల్జ్, ఉక్రేన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీతోపాటు జర్మనీ, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా, ఇజ్రాయెల్‌లకు చెందిన 60 మంది ప్రముఖ రాజకీయ నాయకులు, దేశాధినేతలు ప్రపంవ్యాప్తంగా దావోస్‌కు తరలివస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రముఖులు, యూరోపియన్ యూనియన్ ప్రముఖులు, యూరోపియన్ యూనియన్ కమిషన్ నాయకులుతోపాటు 1,600 మంది వాణిజ్యసంస్థల నాయకులు, వీరిలో 900 మంది ప్రపంచ అగ్రశ్రేణి సిఇఓలు, 120 మంది ప్రపంచ ప్రసిద్ధ నవసృష్టికర్తలు, 170 మందికిపైగా పౌర సంఘాల నాయకులు, సామాజిక సంఘాల నాయకులు, కార్మిక నాయకులు, ప్రభుత్వేతర సంస్థలు, మత సంఘాల నాయకులు, వివిధ తెగలకు చెందిన నాయకులు ఈ ప్రపంచ వేదిక సమావేశాలలో పాల్గొంటున్నారు. దావోస్‌లో ఐదురోజుల సమావేశాలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు వేలాదిమంది పోలీసులను, భద్రతా సిబ్బందిని మోహరించారు. సుమారు 5,000 మంది స్విస్ సైనికులు ఈ బాధ్యతల్లో ఉన్నారు. వారివద్ద అత్యాధునిక డ్రోన్లు, తాజా సాంకేతిక సామాగ్రి ఉన్నాయి. కృత్రిమ మేధను, ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గట్టి భద్రత సమకూర్చారు. ఈ సమావేశాల నిమిత్తం ప్రత్యేక నిబంధనలను అమలు చేస్తున్నారు. ఈ సమావేశాల కారణంగా దావోస్‌కు అక్కడ నివసించే జనాభాకు రెట్టింపుస్థాయిలో పర్యాటకులు ఐదురోజులపాటు వస్తున్నారు. వీరి భద్రతకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశారు.

## హనుమకొండలో లలితా జ్యూవెల్లరీ షాప్ ప్రారంభం

### 57వ బ్రాంచ్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి



ప్రజాపక్షం /హనుమకొండ ప్రతినిధి : హనుమకొండ రాయపురలో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా జ్యువెలర్స్ 57 బ్రాంచ్ ఆదివారం ప్రారంభించారు. ఈ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, లలితా జ్యువెల్లర్స్ ఎండీ ఎం.కిరణ్‌కుమార్‌తో కలసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య లలితా జ్యువెల్లర్స్ షోరూమ్ ను ప్రారంభించారు. అనంతరం ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని, మేయర్ మాట్లాడుతూ వ్యాపార రంగంలో హైదరాబాద్ తరువాత వరంగల్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇలాంటి వ్యాపార సంస్థల ఏర్పాటుతో ఎంతో మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. వరంగల్ నగర ప్రజలు నగల కోసం హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా లలితా జ్యూవెలరీ మనకు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలితా జ్యువెల్లరి అన్ని ప్రాంతాల వారికి తక్కువ తరుగు, తక్కువ ధరలో నగలు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రజల మన్ననలు పొందుతున్నదని చెప్పారు. ఈ సందర్భంగా లలితా జ్యూవెల్లరీ యాజమాన్యాన్ని వారు అభినందించారు. వినియోగదారులకు నాణ్యమైన బంగారు ఆభరణాలను అందుబాటు ధరలలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటం







(మొదటి పేజీ తరువాయి)

చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కొనసాగుతున్నాయన్నారు. చైనా, వియత్న, పిలిపిన్స్, క్యూభా లాంటి దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ప్రజలకు విద్య, వైద్యంతో పాటు జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాయన్నారు. దేశ స్వాతంత్రం రాకముందే సిపిఐ పార్టీ ఆవిర్భవించిందని.. 99 ఏండ్లు పూర్తి చేసుకొని శత జయంతి ఉత్సావాలు జరుపుకుంటుందన్నారు. దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. అప్పుడు ఏర్పడిన ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం స్వాతంత్ర్యం కోసం ఉద్యమించకుండ మతరాజకీయాలకు ఆజ్యం పోసిందన్నారు. భూ స్వాములకు వ్యతిరేకంగా దున్నేవాడికి భూమి కావాలని పేద ప్రజల పక్షాన పోరాడిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ కీలక పాత్ర నిర్వహించి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచినట్లు గుర్తుచేశారు. మోదీ సర్కార్ కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు చట్టాలను తెచ్చిందన్నారు. కార్మికులను అణిచివేసి పెట్టుబడి దారులకు రెడ్‌కార్పెట్ వేస్తుందని విమర్శించారు. తమ హక్కుల కోసం రైతులను పెద్దఎత్తున పోరాటం చేస్తే మోదీ సర్కార్ దిగి రైతు చట్టాలను వెనుక్కితీసుకుందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన మాట తప్పటంతో రైతులు మరోసారి పోరాటం చేస్తున్నారన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా...హక్కుల పరిరక్షన కోసం ఏవరు పోరాటం చేసిన వారికి సిపిఐ అండగా ఉంటుందన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల్లో పార్టీని గ్రామస్థాయిని పటిష్టం చేసే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోదులకు, కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం కృషిచేసిన నాయకులకు సిద్దిపేట సిపిఐ పార్టీ పక్షాన జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిని జిల్లా కార్యవర్గం మందపవన్ ఆధ్వర్యంలో ఘనం గా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎడ్ల వెంకట్రామ్‌రెడ్డి, గడిపే మల్లేశం, అందే అశోక్, వనేష్,దయానంద్‌రెడ్డి. జెర్రిపోతుల జనార్ధన్, శంకర్, కిష్టపురం లక్ష్మ ణ్, బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.

### కదంతొక్కిన కమ్యూనిస్టులు

భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సిద్దిపేటలో కమ్యూనిస్టులు కదం తొక్కారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విక్టరీ చౌరస్తా పార్కు వద్ద సిద్దిపేట తొలి ఎంఎల్‌ఏ ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎడ్ల గురువారెడ్డి, జిల్లా కార్యదర్శి మంద వపన్‌లు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. వందలాది సిపిఐ కార్యకర్తలు, నాయకులు విక్టరచౌరస్తా నుండి మెదక్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా. హైదరాబాద్ రోడ్డు కొత్త బస్టాండ్, సభ ప్రాంగణమైన శివానుభవ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు నినాదాలు హోరెత్తాయి. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు గడిపే మల్లేశం, అందే అశోక్,బన్సిలాల్, శంకర్. కిష్టపురం లక్ష్మ ణ్, బన్సిలాల్, దయానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

అఫ్జల్‌గంజ్‌లో ప్రైయివేట్ ట్రావెల్స్ బస్సు మేనేజర్ సయ్యద్ జహంగీర్‌పై కాల్పులు కూడా జరిపారు. ఈ అన్నిటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఆయా జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఎటిఎంలో నగదు జమా చేసే ఏజెన్సీ అధికారులు, సెక్యూరిటీ గార్డులతో సమీక్షా సమావేశాలు నిర్వహించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు వారితో సమావేశమై బ్యాంక్‌లో దోపిడీలు, దొంగతనాలు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇదే విధంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్లలో బ్యాంక్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించే పనిలే పడ్డారు పోలీసులు. బ్యాంకులు ఎప్పటికప్పుడు తమ భద్రతా ఏర్పాట్లను సమీక్షించుకొని మెరుగుపరుచుకోవాలని సూచించారు.సిసిటివి కెమెరాల ద్వారా, ఇతర ఆధునిక టెక్నాలజీ తొడుతో బ్యాంకు దోపిడీలు, దొంగతనాల వంటి నేరాలను నివారించవచ్చు. నగరాలకు దూరంగా ఉన్న బ్యాంక్‌లు, ఎటిఎంల వద్ద ఇప్పటికి సరైన సెక్యూరిటీ లేకపోవడం గమనార్హం. దోపిడీలు, దొంగతనాలు జరిగిన సమయంలోనే బ్యాంక్‌లు, పోలీసులు హడావిడీ చేయడం ఆ తరువాత భద్రతను గాలికి వదిలివేయడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు శాశ్వత చర్యలు తీసుకునేలా బ్యాంక్‌లపై వత్తిడి తేవాలని డిజిపి డాక్టర్ జితేందర్ అధికారులను ఆదేశించారు. బ్యాంకులకు తగిన విధంగా భద్రత కల్పించడానికి, బ్యాంకుల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టడానికి బ్యాంకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతాపరమైన ఏర్పాట్ల గురించి వివరించాలని డిజిపి సూచించారు. బ్యాంకింగ్ రంగం అనేది సొసైటీ మనుగడకు, పలు రకాల వ్యాపార వాణిజ్య కార్యకలాపాల గమనానికి మూలస్తంభం వంటిది. ప్రజలు తమ కష్టార్జితాన్ని ఎంతో నమ్మకంతో బ్యాంకులో దాచుకుంటారు. వ్యాపార వాణిజ్య కార్యకలాపాల ద్వారా తమ ఎదుగుదల కోసం బ్యాంకులపైనే ఆధారపడతారు. అలాంటి ప్రాముఖ్యత ఉన్న బ్యాంకులు, ప్రజలకు భద్రత కల్పించాల్సి అవసరం ఉందని డిజిపి అభిప్రాయపడ్డారు. అలాగే మక్క రాష్ట్రాల్లో బరితెగించి దోపిడీలకు పాల్పడుతున్న ఛత్తీస్‌ఘడ్ దోపిడీ ముఠా హైదరాబాద్ మీదుగానే వెళ్లివస్తున్నారు. ఇలాంటి వారి కదలికలపై ఆరా తీయాలని, పక్కరాష్ట్రాల పోలీసులతో నిందితుల వివరాలు తీసుకుని పరిశీలించాలని అధికారులను కోరారు. ఇటీవలి ఘటనల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 489 బ్యాంకులను తమ అధికారులు సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించినట్లు పేర్కొన్నారు. నాణ్యత లేని బ్యాంకు భవనాలు, బలహీనమైన భద్రతా ఏర్పాట్లు మరియు లాకింగ్ వ్యవస్థ, సెక్యూరిటీ గార్డులు అప్రమత్తంగా లేకపోవడం లేదా అసలు నియమించుకోకపోవడం, పాత కాలం నాటి అలారం వ్యవస్థ, సీసీటీవీలు లేకపోవడం, డేటా ఫుటేజ్ సింగిల్ బ్యాకప్ మాత్రమే ఉండడం వంటి లోపాలు కలిగిన బ్యాంకులను గుర్తించి, తీసుకోవలసిన చర్యలను కమిషనర్ బ్యాంకుల ప్రతినిధుల దృష్టికి తెచ్చారు.

బ్యాంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్లతో సహా అన్ని ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేసేలా 24/7 పనిచేసే ససిటివి కెమెరాలు అమర్చాలని అలాగే ఫుటేజ్ క్లౌడ్ నిల్వ (ప్రత్యామ్నాయ నిల్వ) ఉండేలా చూసుకోవాలని బ్యాటరీతో పని చేసే స్టోరేజ్ కలిగిన రహస్య కెమెరాలను అమర్చాలని బ్యాంక్ అధికారులకు పోలీసులు సూచిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com